ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 456
వెల : రూ.25/-
మార్చి 2023




జనసాహితి ప్రచురణ

# ఆఖరి కవి సమ్మేళనం

**– సాంబమూర్తి లండ**

శరీరానికి సరికొత్త భాష నేర్పాలి
అవసరాలు తరిమితే
పరికరాలు పుట్టినట్టు
పేగులంటూ లేని సంతతిని
అభివృద్ధి చేసుకోవాలి
చిట్టచివరి సూర్యుడు
పొలంగట్టున రాలిపోయాడు
ఆకలి అన్న పదాన్ని
దాని స్పెల్లింగ్‌తో సహా తుడిపేసుకోవాలి!

హాస్టల్‌లో పిల్లాడు
వారం పది రోజుల్లో ఇంటిని మరిచిపోయినట్టు
పువ్వులు కసిరికొట్టిన చెట్లకు
ఓల్డేజ్ హోమే కన్నపేగుగా మారిపోయినట్టు
బువ్వ దొరకని కాలానికి
మనల్ని మనం సిద్ధం చేసుకోవాలి!

చేలన్నీ మేడల్ని కనే యంత్రాలైతే
అన్నం ముద్ద గురించి మాట్లాడ్డం నేరం!
అదేదో ఇప్పుడే
కరువు తీరా మాట్లాడుకుందాం
నిషేధ పదాలున్నాయని
జైలు గోడలు మన గది తలుపులు తట్టేలోపు
ఆలిశెట్టిని మధ్యలో కూర్చోబెట్టి
ఆకలి మీద ఆఖరి కవి సమ్మేళనం పెట్టుకుందాం!

ఆపరేషన్ గ్రీన్ హంట్
అటు తిరిగి ఇటు తిరిగి పచ్చని చేల మీద పడొచ్చు
కాళ్ళ కింద నేలంతా అమ్ముకుని
కాటికాపరి పద్యం ఒకటి ఎత్తుకుందాం

నీ దేశం నీది కాదన్నప్పుడు
నీ పంట నీది కాదన్నప్పుడల్లా బతకగా లేనిది
నీ ఆకలి నీది కాదన్నప్పుడు మాత్రం
బతకలేమా.. పదండి!
మాల్స్ లోకి స్వదేశీ వాక్సినొకటి వచ్చింది
ఒక్కసారి వేయించుకుంటే
ఆకలి రోగం దరి చేరదు

క్లోరో ఫిల్ చిప్పు పేటెంట్ కోసం
దేశం దరఖాస్తు చేసుకుందిట
కానీ ఖర్చు లేకుండా
ఎవరి రక్తమాంసాలను వారే తృప్తిగా ఆరగించొచ్చు!! ✤

కవితలు

# నేను 'ప్రేమ'నే కౌగిలించుకుంట!!

**– సహచరి**

నా దేశానికి ఇతర దేశాలతో ముప్పుందంటే నమ్మాను..
మరో మతం వల్లే నా దేశం
అభద్రతకు గురౌతుందంటే
నిజమేనని విశ్వసించాను..
ఒకే జాతి ఒకే మతం ఒకే భాష
ఒకే మార్కెట్.. ఒకే ఎన్నికన్నా
బాగానే ఉంటుందనుకున్నా..
సిఏఏలు ఎన్నార్సీలు
త్రీ సెవెంటీలు దేశభద్రతకే
అనుకున్నా!
జీఎస్టీలు, నోట్లరద్దు మోనిటైజేషన్
పైప్ లైన్లో మైనింగ్ ఘనులు
విమాన రైల్వే బ్యాంకింగ్ రంగాల్ని
అమ్మేస్తుంటే దేశం కోసమే అనుకున్నా..
అన్నదాతల ఆందోళన విద్రోహమే ననుకున్నా..
ఎన్నికలప్పుడు ఓట్లు కొనడమే కాదు,
గెలిచినోళ్లను కొనేయడం,
మతం చిచ్చుతో ధర్మాన్ని కాపాడ్డమేనంటే నమ్మలేకున్నా!
మనుధర్మమే రాజ్యాంగమంటే
నన్ను పాతేయ్యడమే ననీ తెలుసుకున్న..
నువ్విప్పుడు ఆవుల్ని  కౌగిలించుకోవాలనడం..
నిజంగా ప్రేమించుకునే మనుషుల్ని
కాఫ్ పంచాయితీల్లో పరువు హత్యల పేర
అంతం చేయడం లా..
కబేలాలకు తరలిపోయే పశువుల్ని వదించినట్లు
ఆవుమాంసం తిన్నాడని
అఖ్లాక్‌లను అంతమొందించడం లాంటిదేననీ తెలుసుకున్న..
నువ్విప్పుడు ముస్లింలకు దళితులకు దగ్గరవ్వడం అంటే..
బిల్కిస్ భానోలను చెరబట్టి
హత్రాస్‌లను సృష్టించడమేననీ తెలుసుకున్న..
కోటానుకోట్ల ప్రజలసొమ్మును కొల్లగొట్టినోళ్లకు
నీకూ బాంధవ్యం క్రోనీ 'కాపిటలిజం'లా
దేశానికి ఉరితాళ్ళను పేనుతుందని తెలిసాక..
నేనిక గోవుల్ని కౌగలించుకొని..
మనుషుల్ని ద్వేషించలేను..
దేశాన్ని ప్రేమించడం అంటే
మనుషుల్ని ప్రేమించడమే కదా..
నేను ప్రేమనే కౌగిలించుకుంటాను!
ఈ నేలనే ప్రేమిస్తూ
'భారత్ బచావో' అంటూ నినదిస్తాను!! ✤

46 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

456

జనసాహితి ప్రచురణ

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 46
సంచిక : 8
మార్చి 2023

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : | శ్రమదోపిడీ – చిత్రం అంతర్జాలం నుండి | | .....01 |
| ✦ రెండవ అట్ట | : | కవితలు – సాంబమూర్తి లండ, సహచరి | | .....02 |
| ✦ మూడవ అట్ట | : | కవిత – కత్తి పద్మారావు | | .....35 |
| ✦ నాల్గవ అట్ట | : | కార్టూనిస్ట్ టీ.వీ. గీసిన చిత్రం | | .....36 |
| ✦ సంపాదకీయం | : | చెమట సముద్రగర్భంలో – అక్షరాల అగ్నిపర్వతం!! | | .....05 |
| ✦ కథ | : | 'అ', 'ఆ', 'ఆ' లు | – బోలుసాని జయప్రభ | .....08 |
| ✦ ధారావాహిక | : | దేశ విభజన వస్తువుగా సాహిత్యం (7) | | |
| | | అత్తియా హుసేన్ నవల | – కొత్తపల్లి రవిబాబు | .....11 |
| ✦ స్పందన | : | స్త్రీ విముక్తిని కోరుతూ రాహుల్ సాంకృత్యాయన్ నాటకం | – హరిబాబు | .....12 |
| ✦ పుస్తక సమీక్ష | : | 'లొట్టపీసు పూలు' | – చేకూరి శ్రీనివాసరావు | .....14 |
| ✦ వ్యాసాలు | : | టర్కీ భూకంపం – పాక్ వరదలు.... | – ప్రసన్న | .....26 |
| | : | ఉరికంబం సాక్షిగా సెక్యులరిస్టు – భగత్‌సింగ్ | – దివికుమార్ | .....29 |
| ✦ జాతీయ అక్షరయోధులు | : | అవతార్ సింగ్ – పాష్ | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....18 |
| ✦ కరపత్రాలు | : | అంతర్జాతీయ మహిళాదినం సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన – పిలుపు | | .....19 |
| | : | దర్శన్ మృతిపై పిడిఎస్ఓ కరపత్రం | | .....24 |
| ✦ పుస్తక పరిచయం | : | నర్సింహారావు రాసిన 'విశ్వం'పై | – జి.వి. భద్రం | .....21 |
| ✦ కవితలు | : | గోలి సీతారామయ్య, భైరి ఇందిర (**17**); కంచరాన భుజంగరావు (**22**), తమ్మినేని సూర్యనారాయణ (**23**), దీర్ఘకవిత : శీలా సుభద్రాదేవి (**25**) | | |
| ✦ వివిధ | : | 'ప్రజాసాహితి' యాజమాన్య వివరాలు (**04**); ముప్పై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**13**); వర్తమాన సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు (**16, 20, 23**); చైతన్యవాహిని (**31**); ఈ పుస్తకాలు అందాయి (**33**); కార్టూన్‌లు – అంతర్జాలం నుండి | | |
| ✦ సంతాపాలు | : | భైరి ఇందిర, భమిడిపాటి జగన్నాథరావు (**28**); ప్రొ॥ కందాళ శోభారాణి (**32**) | | |


ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : **9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

రచనలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X

LIBRARY OF CONGRESS
LCCN 94903393

**'ప్రజాసాహితి'**
**కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు**
**"అకౌంట్ నెం.**
***0680101004936***
***IFSC No. CNRB0000680***
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి


1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

**వెలువడింది!**

# ప్రాచీన ప్రపంచ చరిత్ర
సామాజిక విశ్లేషణ

**- డా॥ ఆర్కే**




ప్రచురణ : **జనసాహితి**

1/4 క్రౌన్ సైజులో

పేజీలు : **335**

వెల : **రూ. 450/-**

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2

## 'ప్రజాసాహితి' యాజమాన్య వివరాలు
**(ఫారం 4, రూల్-8 ప్రకారం)**

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రచురణ స్థలం | : | విజయవాడ-520002 |
| 2. | ప్రచురణ కాలం | : | నెలకొకసారి(మాసపత్రిక) |
| 3. | ముద్రాపకుని పేరు | : | **కొత్తపల్లి రవిబాబు** |
| | జాతీయత, చిరునామా | : | భారతీయుడు<br>30-7-6 అనపర్తివారివీధి,<br>అన్నదానం సమాజం రోడ్డు,<br>దుర్గాఅగ్రహారం,<br>విజయవాడ - 520002 |
| 4. | ప్రచురణ కర్త పేరు, జాతీయత, చిరునామా | : | పైవిధంగానే |
| 5. | సంపాదకుని పేరు | : | కొత్తపల్లి రవిబాబు |
| 6. | భాగస్వాములు | | జనసాహితి, ఆంధ్రప్రదేశ్ |

పైన పేర్కొన్న విషయములన్నియు యధార్థములు.

1.3.2023

సం॥ **కొత్తపల్లి రవిబాబు**
ప్రచురణకర్త

## సంపాదకీయం

# చెమట సముద్ర గర్భంలో - అక్షరాల అగ్నిపర్వతం!!

**"నన్నే** చిత్రపటంలా/ మీ గోడమీద /వేలాడదీయాలనుకుంటున్నారా!! / నేను జారిపోతాను! / ఆకస్మిక వరదలా తలెత్తి / మీపై పొర్లిపోతాను!! / నేను భూమినవుతాను; / అగ్నినవుతా; / ఆకాశంగా మారతా!! / గాలిగా, నీరుగా మార్చుకుంటాను!! / మీరు నన్ను ఎంత నిర్బంధిస్తే, / అంతకు పదింతలై విజృంభిస్తా!!! / సహజ జలపాతంలా పరవళ్ళు తొక్కుతా!!"

ఇటీవల ఒక అవార్డు తిరస్కారంతో చర్చలోకి వచ్చిన ప్రముఖ తమిళ రచయిత్రి సుకీర్తా రాణి – విన్పించిన ధిక్కార స్వరం ఇది.

"నేను కవితలు రాసేటప్పుడు –
సుకీర్తా రాణినే కావొచ్చు!
నా రచన బయటకు వచ్చిన తరువాత,
అది సమాజంలో భాగం!!
కవి ఎప్పుడూ ఒంటరి కాదు!! **(– సుకీర్తా రాణి)**

అవార్డులకు, రివార్డులకు, బిరుదులకు, సత్కారాలకు, సన్మానాలకు, పైపై మెరుగులకు, గుర్తింపుల భేషజాలకు ఎదురుచూడకుండా, వాటిని అంగీకరించకుండా, ఎటువంటి లొంగుబాటు ధోరణి లేకుండా, సహజ నిసర్గంగా కష్టజీవుల పట్ల మారుమోగిన ధిక్కారస్వరాలు ప్రపంచ చరిత్రలో ఎప్పుడు సజీవంగానే నిలుస్తాయి. ఆ అసమాన ధిక్కార స్వరాలే ప్రజాసాహిత్య బాటలో మేలిమలుపులయ్యాయి.

ఇది ఒక సంఘటిత ప్రజా విజయం. దీని వెనక ఉన్న తాత్త్వికతను అర్థం చేసుకోవాలంటే, వ్యక్తికి – సమాజానికి మధ్య ఉండే గతితార్కిక సంబంధాన్ని ఆకళింపు చేసుకోవాలి –

"వ్యక్తిగత ఆస్తుల సమాజం, దాని బూర్జువా తాత్త్వికత – ప్రతి కృషినీ, విజయాన్నీ కేవలం వ్యక్తిగతమైనదిగా మాత్రమే పరిగణిస్తుంది. అది వ్యక్తి వెనక సమష్టినీ, సమష్టిలో వ్యక్తినీ గుర్తించలేదు. సమష్టి శ్రమజనితమైన సంపదనంతా వ్యక్తులపరంగావించటం దాని లక్షణం. కనుక – అది వ్యక్తులను మాత్రమే కీర్తిస్తుంది. ఆకాశానికెత్తుతుంది."
**('ప్రజాసాహితి' – 300వ సంచిక; జనవరి 2008 సంపాదకీయం)**

గతాన్ని ప్రశంసించడం ఏమంత విశేషం కాదు. వర్తమానం ఎప్పుడూ నిప్పుల మీద నడక. సామాజిక కర్తవ్య నిర్వహణలో ఈ రాటుదేలిన సంఘటిత నెత్తుటి అడుగుజాడలే రేపటి ఉజ్జ్వల ఉదయాల వైపు నడిపిస్తాయి.

తమిళ కవయిత్రి సుకీర్తారాణి ఈ తాత్త్వికతతోనే – పాతికేళ్లుగా తమిళ సాహిత్య రంగంలో క్రియాశీలంగా సృజన చేస్తున్నారు. ఇటీవల, 'న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' – 'దేవీ సమ్మాన్' అనే అవార్డును ఆమెకు ప్రకటించింది. మొదట ఎవరిస్తున్నారో తెలియక, అంగీకరించినా, ఆ అవార్డును దేశంలో అవినీతిలో పేరుగాంచిన ఆదానీ సంస్థ ప్రాయోజితం చేస్తున్నదని తరువాత తెలిసి, నిష్కర్షగా ఆమె ఆ పురస్కారాన్ని తిరస్కరించారు.

"మనం నమ్మే సిద్ధాంతాలు, సూత్రాలతో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడరాదని నేను నమ్ముతాను. నేను నమ్మే, మాట్లాడే రాజకీయాలు, సిద్ధాంతాలు ఆదానీ గ్రూపు వంటి కార్పొరేట్ సంస్థ ప్రమేయం ఉన్న అవార్డు తీసుకోవడానికి – విరుద్ధమైనవి. అందుకే నేను వద్దన్నాను. పైగా, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక బహుళజాతి కంపెనీ – అవార్డుల పేరుతో చేసే కార్యక్రమానికి హాజరవ్వడం నాకెంత మాత్రం ఇష్టం లేదు." అని ముక్కుసూటిగా సుకీర్తా రాణి స్పష్టం చేశారు.

ముప్పాతికేళ్ల 'ఆజాదీ కా అమృతోత్సవ' వేడుకలు ఆర్భాటంగా పాలకవర్గాలు జరుపుకున్నాయి. సంపద సృష్టికర్తలైన దేశ ప్రజల కడగళ్ళను కప్పిపుచ్చి – అధికార, అనధికార పాలకవర్గాలన్నీ ఆదానీ, అంబానీ మొదలైన ధనిక వర్గాలకు జాతి సంపదలని ఏ ముసుగులు లేకుండా దోచిపెడుతున్న వర్తమానంలో మనం నిలబడి ఉన్నాం. ఓటర్లనే కాక ప్రజాపతినిధుల నుండి రాజకీయ పార్టీలదాకా కొనుగోళ్ళు అమ్మకాల ప్రధాన సాంస్కృతిక రాజకీయ స్రవంతిలో భాగంగా – సాహిత్యకారులను కూడా లోబరుచుకునే నీచ ప్రయత్నం సాగుతోంది. దాన్ని వమ్ముచేస్తూ సుకీర్తారాణి ఈ ఆదానీ ప్రాయోజిత అవార్డును తిరస్కరించడం రచయితల ధిక్కార వారసత్వానికి ప్రేరణనిచ్చే మరొక సరికొత్త స్వరం!

కవీ, ఓ కళాకారుడా!
కవయిత్రీ, ఓ కళాకారిణీ!!
అటా, ఇటా, నువ్వెటువైపు???
ప్రజలవైపా!! ప్రభుతవైపా!!!

అనే 'వర్గ స్పృహ'తో నిగ్గదీసి అడిగారామె!! మన చుట్టూ జరుగుతూ ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ దోపిడీ మూలాలకు వ్యతిరేకంగా రచయితలు స్పందించాల్సిన కర్తవ్యాన్ని గుర్తుచేస్తోంది.

ఈ వరవడిలోనే ఉత్తరప్రదేశ్‌లో ప్రముఖ జానపద కళాకారిణి – నేహాసింగ్ రాథోడ్ ఆ రాష్ట్రంలో యోగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాకంటక బుల్డోజర్ పరిపాలనను తన జానపద గీతాలతో ఎదుర్కుంటోంది. ఆ రాష్ట్రంలో దళిత మహిళలపై, రైతులపై, కష్టజీవులపై, సాగుతున్న దమనకాండను తీవ్ర ధిక్కారస్వరంతో నిగ్గదీస్తోంది. ఎప్పటికప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ప్రభుత్వ అరాచకాలను నిర్భయంగా ప్రజల్లో జానపద గీతాల రూపంలో చెకుముకిలాడిస్తోంది. సామాజిక మాధ్యమాలలో ప్రజల స్పందన కూడా అంత బలంగా ఆ జానపద గీతాలకు కనిపిస్తోంది. ఈ ఫిబ్రవరి 2023లోనే కాన్పూర్లో అక్రమ కట్టడాలను కూల్చివేయడం అనే ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ అధికారులు ఒక పూరి పాకలో ఉన్న తల్లి కూతుళ్ళను సజీవ దహనం చేసిన పైశాచిక సంఘటనను కూడా నేహాసింగ్ రాథోడ్ తనధిక్కార జానపద గళంతో ఎండగట్టిన నేపథ్యంలో యోగి బుల్డోజర్ పాలన గిజగిజలాడింది. అక్కడి పోలీసులు ఆమెకు నోటీసులు ఇచ్చారు. తాను ప్రజల కోసం పాడుతున్న జానపద కళాకారిణినని, ఎవరికీ తలవంచవలసిన అవసరం లేదని, ప్రజల కోసం తాను ఇలాగే పాడుతూ ఉంటానని తేల్చి చెప్పేసింది. నేటి వర్తమాన బహుముఖ సంక్షోభాల కాలంలో ఇలాంటి ధిక్కారస్వరాలు దేశం నలుమూలల ఉవ్వెత్తున ఎగిసి పడాల్సిన అవసరాన్ని ఈ సంఘటన చాటి చెబుతోంది.

కోవిడ్ రెండో విడత కాలంలో భారతదేశం శవాలతో బీభత్సంగా మరుభూమిగా మారిన దుస్థితిలో – అసంఖ్యాకంగా ప్రాణాలొదిలిన అభాగ్యదేశ ప్రజానీకం కనీసం గౌరవనీయమైన అంత్యక్రియలకు కూడా నోచుకోని దుర్భర అవస్థలో గంగానదిలో పూర్తిగా దహనం కాని కళేబరాలను కళ్ళారా చూసిన దిక్కుమాలిన సందర్భాన్ని ఏ మతంవాడైనా, ఏ కులంవాడైనా కలలో కూడా మర్చిపోడు. ఆ హృదయ విదారక దృశ్యాలను చూసి, గుజరాత్ కవయిత్రి పరుల్ ఖక్కర్ 'శవవాహిని గంగా' అంటూ దేశ ప్రధానిని నిలదీసి, రచించిన కవిత ధిక్కార స్వరాన్ని విన్పించింది.

నిజానికి ఆమె అనుభూతి కవిత్వం రాసుకునే సాధారణ కవయిత్రే. కానీ కళ్ళ ఎదుట గుండెను పిండేసిన వాస్తవికతను చూసి, నేరుగా దేశ ప్రధానిని ప్రశ్నించింది. అది ముప్పాతికేళ్ల భారత పాలకవర్గాల పాలనా విధానాల్ని అభిశంసించింది. కాలక్షేప కవిత్వం రాసే అవకాశవాద ఉభయచరాలు లాంటి సగటు రచయితలు ఆమెనప్పుడు నిందించారు. కానీ, కాలం కన్నీళ్ళతో గర్భం దాల్చి, కత్తుల్ని కనే రోజులు ఎప్పుడూ ఉంటాయి. అలాగే వయసు మీదపడిన, విప్లవ కవి వరవరరావుని మన వర్తమాన కాలంలోనే, ఏ ఆధారాలు చూపకుండానే, రాజ్యం ఏళ్ల తరబడి నిర్బంధంలోకి తీసుకున్న సందర్భాన్ని మరచిపోలేము కదా!!

సుమారు 30 ఏళ్ల క్రితం ఒక పాలక ముఠా – తమ కంటక ప్రాయమైన ప్రజావ్యతిరేక కార్యకలాపాలను జనం పాటగా పాడి, బలంగా ఎండగట్టడాన్ని సహించలేక, బెల్లి లలిత అనే ప్రజా కళాకారిణిని భయానకంగా కత్తికో కండగా నరికి, అక్కసు తీర్చుకున్న నెత్తుటి చరిత్ర – మన దళారీ పదవీ వ్యాపార బ్యాలెట్ పెట్టెలకు ఉంది.

అలాగే, ఆ మధ్య గోవా పాప్ గాయకుడు రెమో ఫెర్నాండస్ తన పిడుగుల గళంతో పాలకులు – 'గోవా మాతను మానభంగం చేస్తున్నారు' అంటూ, ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్) పేరిట గ్లోబలైజేషన్ సృష్టిస్తున్న సామాజిక విధ్వంసాన్ని ఖండించాడు.

ప్రజాసాహిత్య సాంస్కృతిక పోరాట చరిత్ర పొడవునా, ప్రపంచం నాలుగు దిక్కులా, మారుమోగేటట్టుగా – ధిక్కార స్వరాలు ఏ కాలంలో అయినా సజీవంగానే ఉంటాయి. ఏ దేశంలో అయినా, పిడికిళ్లను పండించే ఉద్యమ సేద్యం ఎప్పుడూ సంఘర్షిస్తూనే వుంటుంది. ఆ పిడుగుల గళాలతో, కలాలతో రచించిన తిరుగుబాటు చరిత్ర ప్రజల నాలుకల మీద సుస్థిరంగా, సజీవంగా బతికే ఉంటుంది.

అలనాటి రాచరిక భూస్వామ్య వ్యవస్థలో దైవభావం అనే పరిమితిలోనైనా, సామాజిక అసమానతలను, నిచ్చెనమెట్ల కులవ్యవస్థను, వాటిని సమర్థించే భావజాలాలను – శక్తివంతంగా ఎదుర్కొన్న నేపథ్యంలో ఉత్తర, దక్షిణ భారతంలో భక్తి ఉద్యమం తలెత్తింది. తెలుగు నేలమీద కూడా ఆ ధిక్కార స్వరాలు బలంగానే వినిపించాయి.

తన కావ్యాన్ని.... 'పాలకులనే నరాధములకిచ్చి – పడుపు కూడు తినలే'నని, ఒక కవి అంటే,

'రాజుల్మత్తులు, వారి సేవ నరకప్రాయంబు' అని తన నిరసన గళాన్ని ఎత్తాడు మరోకవి.

'మహిళలు కవిత్వం రాయకూడ'దనే భూస్వామ్య విషసంస్కృతిని ఎదిరించి నిలిచిన అతివల కలాలు తమదైన ప్రత్యేకతను చాటుకున్న ఆనవాళ్లు సాహిత్య చరిత్రలో వున్నాయి.

'రాజధిక్కారానికి అనేక శిక్షలు అనుభవించి, వ్యవస్థీకృత సంకెళ్లను ఒక మేరకు తెంచుకొన్న వాగ్గేయకారులకు ఈ తెలుగు నేలమీద కొదవులేదు. 'భూమి నాది అన్న భూమి పక్కున నవ్వు' అని ప్రకటించిన అసమ సామాజిక ధిక్కార స్వరం నేటికీ తెలుగుజాతి సాంస్కృతిక మూలాల్లో తల్లి వేరుగా పాదుకుని ఉంది. "పసిడి గలుగువాని బానిస కొడుకులు" కావద్దంటోంది!

ఇక్కడే ఐరోపా, పశ్చిమాసియా దేశాల పరిణామాలను పరిశీలిస్తే ప్రపంచ సాహిత్యం 'స్వేచ్ఛ', 'స్వాతంత్రం', 'సమానత్వం' అంటూ ఆధునికత కూడలిలో నిలబడి, నాటి కాసుల కబంధహస్తాల కరాళ ధ్వనులను, అప్టన్ సింక్లేర్ అక్షరబద్ధం చేసిన సాహిత్య చరిత్ర విస్పష్టమవుతుంది. ఆపైన, పెట్టుబడిదారీవ్యవస్థ అదనపు విలువలను మెక్కి మెక్కి, సమాజ గమనానికి అడ్డంపడితే, ఆ అవరోధాన్ని అధిగమించడానికి కార్మిక కర్షక ప్రజాపోరాటం ఎదుర్కొంటున్న సంఘర్షణలోంచి "ఉక్కుపాదం", "అమ్మ" లాంటి ప్రజాసాహిత్య సంస్కృతికోద్యమ పరిణామాలు కోకొల్లలు.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత, ఆకలితో అలసటతో నిలువ నీడ లేక, నెత్తురోడే ప్రజల కోసం 18 దేశాలకు చెందిన 140 మంది రచయితలు 1919 జూన్ 26న, ఆనాటి 'లా హ్యూమనైట్' అనే ఫ్రెంచి పత్రికలో ప్రకటించిన 'Declaration of the Independence of the Mind' క్రమం నుంచి, 1935 సంవత్సరంలో లండన్‌లో – పురుడు పోసుకున్న, అభ్యుదయ సాహిత్య చరిత్ర గమనంలో, (హిట్లర్) నియంతృత్వ పోకడలపై తిరుగుబాటును ప్రకటించిన కలాల కవాతు సాగుతూనే వుంది.

ఇక బ్రిటిష్ వలస భారతానికి వస్తే, ప్రేమ్‌చంద్ నుండి మహాశ్వేతాదేవి కృషి మీదుగా, దళారీ రాజ్యం పెంచి పోషించిన దేశీయ ఉగ్రవాదం పోకడలను ధిక్కరించిన అవతార్ సింగ్ పాష్ అమరత్వాన్ని మరచిపోకూడదు. నిచ్చెనమెట్ల దొంతరల సామాజిక అంతరాల నుండి గట్లు తెంచుకొని వచ్చిన నామ్‌దేవ్ దసాల్, అన్నాబావూ సాఠే మొదలైనవారు కాగడాలై ఎత్తిపట్టిన దళిత చైతన్యం, పోరాటం ఎటు నడవాలో దారి చూపిస్తోంది.

ఆపైన జాతీయ ఉద్యమ చీకటి వెలుగుల సంఘర్షణలో, హింసాత్మక దేశవిభజన వదిలివెళ్ళిన కలాల అడుగుజాడలు మత విద్వేషాలను ఎండగట్టిన సమీప చరిత్ర సాదత్ హసన్ మంటో, భీష్మ సాహ్ని మొదలైనవారి సాహిత్యం – 'గోడ మీద మూడో వాడి' విభజన వ్యూహాల పాలన అరాచకాలను మనకు ఎత్తి చూపిస్తుంది.

సామ్రాజ్యవాద ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక దోపిడీకి వ్యతిరేకంగా నిలిచిన ఆఫ్రికా కవులను ఉరితీసారు., గుగీ వా థియాంగో లాంటివాళ్లు తమ రచనల్లో భాషా సామ్రాజ్యవాదం మూలాలను ధిక్కరించి కఠినతర జైలు శిక్షలకు గురి అయ్యారు. కెన్ సారో వివా లాంటి క్రియాశీల రచయితలు ఉరికంబం ఎక్కారు. పాదాల కింద నేలను దక్కించుకోవడానికి దర్విష్ లాంటి పాలస్తీనా ప్రతిఘటన కలాలను – ఎంతగా సమాధి చేస్తే, అంతగా కత్తుల పంటను పండిస్తున్నాయి.

ఇంతటి మహత్తర ధిక్కారస్వరాలకు ఉన్న ప్రజాచైతన్యం మీద నివురు ఊది, రాజెయ్యాల్సిన అవసరం మళ్లీ ఎజెండా మీదకు వచ్చింది. వెన్నెముక లేని బలహీనుణ్ణి ముద్దాడే దివాలాకోరు అవార్డుల సుఖరోగాలు అంటని, సాహిత్య సమరయోధుల కోసం కాలం కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తోంది. ప్రధాన స్రవంతిగా ఉన్న సాహిత్య సాంస్కృతిక రంగం గుంట పూలు పూయడాన్ని చూడక తప్పటంలేదు. కానీ, అనంతమైన, అవిభాజ్యమైన కాలం అనే వడపోతలో మిగుల్చుకోవలసిన పోరాట పోషకాలను పరిశీలిస్తే – భవభూతిలా స్త్రీ సహనంలో ధిక్కారాన్నీ, వేమనలా సామాజిక మూఢత్వాన్ని చెంప చెళ్ళుమనిపించే నిష్కర్షనీ, జాషువాలా హైందవ నాగరాజు బుసలను కసిరి కొట్టే పదునైన చేవనీ, గురజాడలా దేశమంటే మనుషులని దిక్కులు పిక్కటిల్లేలా నినదించే గళాన్నీ, శ్రీశ్రీలా సామాజిక నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలను దండు కట్టించే చొరవనీ, కాళోజీలా ప్రజల హక్కుల కోసం నడుం కట్టే ధిక్కారస్వరాన్నీ, మన కాలపు కవిలా 'పుట్టకముందే దేశద్రోహుల జాబితా'లో పుటం పెట్టిన నిగ్గునీ, కలబోసుకున్న తెలుగు నేల – బీటలు వారినా, పోరాట ధాతువులతో సారవంతమై, కత్తుల పంటలను పండిస్తూనే ఉంది.

అయితే, నిజమైన అర్థంలో ప్రజాస్వామిక విలువల గురించి మాట్లాడడమే, దేశద్రోహంగా మారిపోయిన నేటి స్థల కాలాల మధ్య, ఫాసిస్టు తరహా మతతత్త్వ పాలక విధానాల నడుమ ఒక పెను విషాదం గడ్డకట్టి ఉంది. ఆ కన్నీటి గడ్డను వేదికగా చేసుకొని, ప్రధాన సాహిత్య సాంస్కృతిక ధోరణులు కలవరపెడుతున్నాయి. నూనె మీద పడిన నీటి కణాల లాగా అక్షరాలు ముక్క ముక్కలుగా తెట్టు కడుతున్నాయి. ప్రగతిశీలంగా కనిపిస్తున్న అస్తిత్వవాదం, స్వసుఖవాదం, వ్యక్తి కేంద్రక కెరీరిజం, ఆధునికాంతర కొత్తదనం అనే గుహాంతర అంధకారం ఒక వైపు నుంచి కమ్ముకొస్తోంది. మరొకవైపు నుంచి, సత్యానంతర మతగతాల పిడివాదం ప్రజల అభిప్రాయాలను, అవగాహనను తలకిందులు చేసే గందరగోళం, ఇంకొకవైపు నుంచి ఒంటరి లంకెల కళలు కొన్ని, ఆబ్జెక్టివిజం పేరుతో అమూర్త భావనలతో, అర్థసత్యాలతో పరాయికరణకు గురై, నిష్పాక్షికవాదం అనే ముసుగులో స్వీయ అనుభూతుల తామర తంపరలను ఎగజిమ్ముతున్నాయి.

కమ్యూనిజం, సోషలిజం, రాకముందే, నూతన ప్రజాతంత్ర దశ అనే వేగుచుక్కను చూడకముందే, ఎర్రని చివురులను పూతలోనే చిదిమేసే 'విచ్చలవిడి అరాచకవాదం' సాహిత్యాన్ని కూడా సొంత ఆస్తిగా భావించే అస్తిత్వానికి పరిమితమైపోతోంది. ఒంటెద్దు పోకడల ఒంటరి గుహలలోకి మౌనంగా ఎదిగిపోయే అడ్డదారులు జబ్బలు చరుచుకుంటున్నాయి. ఇలాంటి విచ్ఛిన్నమవుతున్న వ్యక్తిత్వాల మధ్య సాంస్కృతిక సామ్రాజ్యవాద చొరబాటు, దానికి తొడుక్కున్న అంగీలాంటి భూస్వామ్య పతన సంస్కృతి మతోన్మాద ఫాసిజం ఏ విలువల్ని నేర్పుతున్నాయి?!

వ్యక్తిగత స్వార్థ భావనలను అస్తిత్వంగా కాపాడుకోమంటున్నాయి. తాత్కాలిక సంబంధాల రంగుల చీకట్లను మస్తుగా కప్పుకోమంటున్నాయి. కొత్తదనం పేరుతో వ్యామోహానికి దాసోహం కమ్మంటున్నాయి. ఈ పద్మవ్యూహాలను చీల్చుకొని, ఈ ఉక్కు కౌగిలిలను విదుల్చుకొని, వ్యక్తిగత నిజాయితీకి, లైంగిక సమానత్వానికి, సామాజిక ఐక్యతకు సిద్ధం కావాల్సిన, అంకిత భావంతో కూడుకున్న సామాజిక నిబద్ధత, ప్రజా సాహిత్య సాంస్కృతిక నిమగ్నత యొక్క అవసరం అనివార్యమవుతోంది..

ఈ మహోన్నత కర్తవ్యానికి ప్రజా రచయితలు, కళాకారులు, మేధావులు లూషన్‌లా, ప్రజా పోరాట చైతన్యం అనే అగ్నిపూలకు చివరి రక్తం బొట్టు వరకు కూడా ధారపోయాల్సిందే.

శ్రామిక జనసాహిత్య సాంస్కృతికోద్యమ సుకీర్తారాణి ధిక్కార స్వరం, ప్రజాపోరాట మహాజ్వాలలకు భాస్వరం!! **27.02.23**

కథ

# 'అ', 'ఆ', 'ఆ' లు

- బోలుసాని జయప్రభ

**"నానమ్మ** నాకు వన్ థౌసండ్ రూపీస్ ఇవ్వు, సినిమాకి వెళ్ళాలి" అడిగాడు అనిరుధ్.

"ఏంటీ!? సినిమాకి వెళ్ళటానికి వెయ్యి రూపాయలా?

"పది రూపాయలతో పదిమందితో కలిసి సినిమా చూసేవాళ్ళం. అదీ ఏ ఆరునెలలకో ఒకసారి. ఇదేంటి ప్రతీవారం సినిమాలే?"

"అబ్బా గ్రానీ! ఫస్ క్రియేట్ చెయ్యకు. మీ చిన్నప్పటిరోజుల గురించి మాట్లాడి బోర్ కొట్టించకు. మా డాడీని అడిగితే ఇలా అనరు. వెంటనే ఇచ్చేస్తారు. అంతా? ఇంతా? అని అడగరు". అని కళ్ళలో నీరు తిరుగుతుండగా ఏడుపుగొంతుతో అన్నాడు.

"గ్రాండ్మా నాకో త్రీ థౌసండ్ రూపీస్ ఇవ్వు. బ్యూటీపార్లర్‌కెళ్ళాలి. 'అనూస్' వాళ్ళు ప్యాకేజీ ఇచ్చారు. మెసేజ్ వచ్చింది. ఈ ఛాన్స్ మిస్ అయితే మళ్ళీ ఎన్నాళ్ళో వెయిట్ చేయాలి" అని అన్నది తన్వి.

నిగనిగలాడే పచ్చని మేని ఛాయతో మెరుపుతీగ లాగా, చంద్రబింబం లాంటి ముఖంతో వెలిగిపోయే తన్వికి ఇంకా మెరుగులెందుకు? అని అనుకుంటూ అదేమాట తన్వితో అన్నది.

"ఎందుకమ్మా ఇంత ఖర్చు? ఎలాంటి మేకప్ లేకుండానే కళకళలాడే నీకు పైపై మెరుగులు అవసరమా?"

"బ్యూటీపార్లర్‌కెళితే నా ఫ్రెండ్స్ మధ్య గర్వంగా ఉంటుంది. పార్లర్‌కి వెళ్లకపోతే కల్చర్ లెస్ అని అంటారు. మోడరన్‌గా కనిపించడం అవసరం. అప్పుడప్పుడు పై పై మెరుగులు దిద్దుకుంటూ ఉండాలి".

జీన్స్ ప్యాంటు, టీ షర్ట్ వేసుకుని, తమ్ముడిని రెడీ అవ్వమని చెప్పి ఫ్రెండ్‌కి కాల్ చేయటానికి సెల్ పట్టుకుంది!

లలితమ్మగారు తల పట్టుకుంది. ఇలా పెరిగితే పిల్లలు ఏమైపోతారో ఏమో అని దిగులు పడుతూ, డబ్బులు వాళ్ళ చేతిలో పెట్టింది.

మళ్లీ వీకెండ్ రానే వచ్చింది. "ఫ్రెండ్స్‌తో లాంగ్ రైడ్‌కెళ్తున్నాము 5,000/- రూ. కావాలి గ్రానీ!"

"అప్పుడేనా? లాస్ట్‌వీక్‌లోనే 1,000/-రూ. ఇచ్చాను కదా!"

"లాస్ట్‌వీక్ ఎప్పుడో కదా ఇచ్చింది" అని అన్నాడు అనిరుధ్.

"ఫ్రెండ్స్‌తో కలిసి బంగీ జంప్‌కెళ్ళాలి.... నానమ్మా! జస్ట్ టు థౌసండ్ రూపీస్ ఇవ్వు" అని అడిగింది తన్వి. అప్పుడేనా అని అడిగే ధైర్యం చేయలేదు. మళ్ళీ ఏమి సమాధానం వస్తుందోనని?

"ఈ లెక్కన సంజయ్ ఎంత సంపాదిస్తున్నట్లు? పాపం పిచ్చి గున్న అందుకే రాత్రనక, పగలనక ఎప్పుడూ బిజీ, బిజీ అని అంటూ ఉంటాడు. అత్యవసరం అయితే ఇంత కష్టపడితే సమర్థించవచ్చు. అనవసరమైన ఆనందాల కోసం, ఆర్భాటాల కోసం ఖర్చు పెట్టటానికే ఇంత కష్టపడి సంపాదించాలా, ఆరాటపడాలా? డబ్బుల కోసం ఆరాటపడాలా....

"ఇదంతా గ్లోబలైజేషన్ ప్రభావం అనుకుంటాను. డబ్బు సంపాదించండి, డబ్బు ఖర్చుపెట్టండి. మన చుట్టూ అమ్మకానికి ఎన్నో మెరుపులు, తళుకుల ప్రకటనలతో వస్తువుల ప్రపంచం - సంపాదించినదంతా వాటికి ఖర్చుపెట్టి ఖాళీ జేబులతో వచ్చే నెలలోకి ప్రయాణం. అవసరాలు, అనవసరాలు అనే విచక్షణ లేకపోతుంది.

"విలాసాలు విషంతో సమానం. దీన స్థితిలో ఉన్న తోటి మనిషికి తోచినంత సహాయం చేయటం మన ధర్మం. Simple Living and High thinking should become the aim of all people. మాస్టారుగారయిన తన తండ్రిగారి మాటలను ఇంట్లోవాళ్ళు, బయటివాళ్ళు ఎంతో గౌరవించేవాళ్ళు. బయటికి వెళితే పరంధామయ్యగారి పిల్లలని తమని ఎంతో ఆదరించేవారు అందరు.

మథనపడుతున్న మనసును తేలిక పర్చుకోవాలంటే సుధతో మాట్లాడాల్సిందే. సుధకి ఫోన్ చేసి పిల్లల బిహేవియర్ చూసి తన మనసులో పడుతున్న బాధని చెప్పింది. "అమ్మా! రోజులు మారుతున్నాయి. కాలంతో పాటు మనమూ మారాలి. తప్పదు. లేకపోతే వెనకబడిన వాళ్ళ క్రింద జమకట్టేస్తారు. నీ వల్ల కాకపోతే ధ్యానంలోనో, పూజలోనో, గుడికి వెళ్ళో నీ మనసుని డైవర్ట్ చేసుకో. అంతేగానీ పిల్లలని హర్ట్ చేయకు. అసలే ఈ రోజుల్లో పిల్లల మనసులు చాలా సున్నితంగా ఉంటున్నాయి. టూర్ నుండి సంజయ్, సునయన వాళ్ళు వారం రోజుల్లో వస్తారట. సునయనకి తెలిస్తే గొడవలౌస్తాయి. పర్సనల్ విషయాలలోకి ఇంటర్ఫియర్ అయ్యావని కోపం వస్తుంది తనకు.

"తన కొడుకు కుటుంబం తనది కాదా?" అని, "నేను వీళ్ళకేమీ కానా?" అని మనసు బాధతో మూలిగింది.

"అది కాదు నేను మిమ్మల్ని ఇలానే పెంచానా? మీరు మీ నాన్న ఎదురుగా నిలబడి అనవసర ఖర్చుల గురించి డబ్బులు అడిగేవారు కాదు కదా! ఏది వండితే అది ఇదేంటి అని కూడా అడగకుండా, ఇష్టంగా తినేసేవాళ్ళు కదా! కష్టమూ, ఇష్టమూ తెలియకుండా మీ పిల్లలు ఇలా ఎలా తయారయ్యారేంటి?" అన్నది సుధతో గద్గదస్వరంతో.

"అమ్మా! ఆ రోజులు వేరు, ఈ రోజులు వేరు. నీదంతా చాదస్థం. వూరికే మనసు పాడుచేసుకోకు. టీవీ చూస్తూ కాలక్షేపం చెయ్యి. నీలాంటివారందరూ అదే వ్యాపకంగా బ్రతుకుతున్నారు" అని ఫోన్ పెట్టేసింది.

"నా అనుభవాల ద్వారా వీళ్ళకు నేర్పదగినది ఏమీ లేదా? మారిన కాలంతో పాటు మనమూ మారాలని అంటున్నారు. ఆ అడుగు ఎటు పడుతున్నది అని ఎవ్వరూ ఆలోచించరేమిటి? వారిలోని వివేకాన్ని మేల్కొల్పేదెలా? సమాజం ఎందుకిలా విషపూరితం అవుతుంది? కుటుంబాలు ఇలా చిన్నాభిన్నమవుతున్నాయేంటో."

ఫోన్ రింగ్ అయితే లలితమ్మగారు ఎత్తారు. ల్యాండ్ లైన్ అయితే లలితమ్మగారు ఎత్తుతారు. ఎవరి సెల్ వాళ్ళకే ఉన్నది.

"హలో, మీ అబ్బాయి మా పబ్‌లో ఉన్నాడు. కొంచెం మందు ఎక్కువైనట్లుంది. డ్రైవ్ చేసే స్థితిలో లేడు. మీరు ఎవరైనా వచ్చి తీసుకుని వెళతారా?

లలితమ్మగారికి ఏమీ అర్థంకాలేదు. ఫోన్‌ని కోడలికి అందించింది.

"ఇపుడెవరు వస్తారు? మీ పబ్‌వాళ్ళే ఒక రెస్ట్‌రూమ్ అరెంజ్ చేసి, మత్తు దిగినాక పంపించే ఏర్పాటు చేయాలి కదా! అలాంటి ఫెసిలిటీస్ ఉండాలి కదా! అన్నది సునయన విసుగ్గా.

"ఎవరమ్మా మత్తులో ఉన్నారంటున్నావు?" అడిగారు లలితమ్మ.

"అనిరుధ్ అత్తయ్యగారు! వాళ్ళ స్కూల్ ఫ్రెషర్స్ డే పబ్‌లో సెలెబ్రేట్ చేసుకున్నారట. మందెక్కువైందట. చాలా మామూలు విషయం లాగా, తన కొడుక్కి అలవాటైన మత్తు అనే వ్యసనాన్ని అంత తేలికగా, సాధారణ విషయంలా చెబుతున్న సునయన వైపు ఆశ్చర్యంగా చూసింది లలితమ్మగారు. ఇది తప్పు కదా? అని అనబోయి సుధ ఇచ్చిన వార్నింగ్ జ్ఞాపకం వచ్చి ఆగిపోయింది.

తాగి మైకంలో మునుగుతున్న కొడుకు గురించి హైటెక్ కుటుంబాలలో తీసుకునే జాగ్రత్త ఇదే కాబోలు! వాడు తాగి చెడిపోతున్నాడే, మద్యం, మాదకద్రవ్యాలు మనిషి పతనానికి నాంది అనే ఆలోచన పెద్దవాళ్లలోనే లేదాయే. ఇక పిల్లలకు ఎలా తెలుస్తుంది? ఇదీ ఒక స్టేటస్ సింబల్‌గా అయిపోయిందనుకుంటా ఈ హైటెక్ జీవులకి.

"నాయనమ్మా! నేను రాత్రి వచ్చేపాటికి డోర్ దగ్గరే ఉండు. నీకైతే నిద్ర రాదు కదా! అందరూ నిద్రపోతారు. నిన్న అయితే ఎవరూ డోర్ తీయలేదు. క్రింద లాన్‌లోనే నిద్రపోయి, పొద్దున్నే డాడీ మార్నింగ్ వాక్‌కి వెళ్ళినపుడు లోపలికి వచ్చాను" అన్నది తన్వి.

"పరీక్షలకని కంబైన్డ్ స్టడీస్ చేసి వస్తున్నావా?"

"లేదులే నాయనమ్మా!"

ఇంత పొద్దుపోయాక ఇంటికి రావడం ఇబ్బందికదమ్మా, "పోనీ నీ ఫ్రెండ్ వాళ్ళింట్లోనే ఉండి, తెల్లవారాక రాకపోయావా?" అని అనాలనుకున్నది. మళ్ళీ ఆ ఫ్రెండ్ ఆడో, మగో తెల్చుకోలేక నోరు మూసుకుని ఉండిపోయింది.

"కాదులే నాయనమ్మా! డాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నాను."

"ఇంత రాత్రప్పుడా?"

"కాలేజీ అయిపోయాక డైరెక్టుగా డాన్స్ క్లాసెస్‌కి వెళుతున్నాను. ఇంటికి రావాలంటే మళ్ళీ రెండు గంటలు పడుతుంది కదా!"

"మీ కాలేజీలో డాన్స్ సబ్జెక్టు కూడా పెట్టారా? ఉన్నవి సరిపోవట్లేదంటా? దిక్కుమాలిన డాన్స్ క్లాస్ లేకపోతే ఏంటంటా? పిచ్చితల్లీ ఎంత అలసిపోతున్నావో?"

"సబ్జెక్టు కాదు. కాలేజీవాళ్ళు పెట్టించనూ లేదు నాయనమ్మ. ఒక రిసెప్షన్లో డాన్స్ ప్రోగ్రాములో పార్టిసిపేట్ చేయటానికి ప్రాక్టీస్ చేస్తున్నాను."

"ఏంటీ? మీ డాన్స్ స్కూల్‌వాళ్ళు పెళ్లిళ్లలో డాన్స్ ప్రోగ్రామ్స్‌కి మిమ్మల్ని పంపిస్తున్నారా? మా రోజుల్లో రికార్డింగ్ డాన్స్ వేసేవాళ్ళని 'డాన్స్ పిల్ల' అని అనేవారు. హన్నా! మీ డాన్స్ మాస్టర్‌గారిని నిలదీస్తాను. మా మనవరాలు ఏమైనా రికార్డింగ్ డాన్సులు చేసే అమ్మాయను కున్నావా? మాది పరువుకు ప్రాణం పెట్టే కుటుంబం. మా అబ్బాయి పెద్ద ఆఫీసర్ తెలుసా? అని అడుగుతాను."

"నాయనమ్మా! నాయనమ్మా! ఈ రోజుల్లో ఇది కామన్. గొడవ చేయకు ప్లీజ్. నాకు నిద్రొస్తుంది" అంటూ లోపలికి వెళ్ళిపోయింది తన్వి.

లలితమ్మకి తన చిన్నతనంలో మెరిసే కురచ దుస్తుల్లో, ఈలలు వేస్తూ, కుర్రకారు వెంటపడుతుండగా, పలుచని వోణి లాంటిది పైన కప్పుకుని, తడబడుతున్న అడుగులతో స్టేజీ పైకి నడచి వస్తున్న రికార్డు డాన్సర్ కళ్ళముందు కదలాడింది.

నా మనవరాలు కూడా అలాంటి వేషధారణతో నలుగురిలో కనిపించదు కదా! ఏమో? ఇదీ ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయిందేమో? ఈ కురచ బట్టలు, మద్యాన్ని అమ్ముతున్నవాడెవడు? నష్టబోతున్నదెవరు?

"శీల సంపదను వృద్ధిచేసి, మనోబలాన్ని పెంపొందించి, బుద్ధిని వికసింపచేసి, స్వశక్తితో విశ్వాసాన్ని పెంచే విద్యే మనకు కావలసింది". అన్న కాలంలో వాళ్ళం కదా, అందుకే ఇంత విడ్డూరంగా వుందా? మనవడు పిలిస్తే ఆలోచనలో నుండి బయటకు వచ్చింది లలితమ్మగారు.

రిసెప్షన్ ఫార్మ్ హౌస్‌లో ఏర్పాటుచేశారు. పార్టీకెళ్ళటానికి ఆకర్షణీయంగా అలంకరించు కోవాలి కదా! బ్యూటీషియన్ని ఇంటికే పిలి పిస్తున్నారు ఈరోజుల్లో. పెళ్ళివారికే కాదు బంధువులకి కూడా అలంకరణ అత్యవసరం అని అనుకుంటున్నారు. ఇదీ ఒక స్టేటస్ సింబల్ అయిపోయిందనుకుంటా. వ్యాపారపు మాయ.

"అత్తయ్య! మీరు కూడా పెళ్ళికి వస్తున్నారు. సంధ్య మరీ మరీ చెప్పింది. మిమ్మల్ని కూడా తీసుకురమ్మని."

"ఏ సంధ్య? ఓ! మా మేనమామగారి వేలు విడిచిన పిన్నిగారి మనవరాలు కాదు కదా! ఏమో ఎక్కడెక్కడివాళ్ళనో ఆహ్వానిస్తున్నారు. వాళ్ళ స్టేటస్‌ని ప్రదర్శించటానికి కాబోలు. ఇన్నేళ్ల నుండి రాకపోకలు లేకుండా హఠాత్తుగా జ్ఞాపకం తెచ్చుకోవటం, ఆహ్వానాలు వాట్సాప్‌లో పంపటం. ఇది మామూలు అయింది. మా రోజుల్లో అయితే మూడో పిలుపు వస్తే కానీ మర్యాదగా ఆహ్వానించినట్లు కాదు

అనుకునేవాళ్ళం. అప్పుడే బయలుదేరేవాళ్ళం. ఈ రోజుల్లో ఇళ్ళకి ఎవరు వస్తున్నారు? ఆధునికత ముసుగులో అనుబంధాలు, బంధాలు బందీలైపోయాయి. అలా అయినా చుట్టాలందరిని కలవచ్చని బయలుదేరింది లలితమ్మగారు.

"నాయనమ్మా! వెళదాం రా! నువ్వు, నేను డాడీ వాళ్ళ ఫ్రెండ్ కార్‌లో వెళదాము. మమ్మీవాళ్ళు వెళ్ళిపోయారు ముందే".

రెండు గంటలు ప్రయాణం చేసాక రిసెప్షన్ జరుగుతున్న ఫార్మ్‌హౌస్‌కి చేరుకున్నారు. ఎంతో ఆర్భాటంగా, ఆడంబరంగా ఉన్నాయి పెళ్లి ఏర్పాట్లు. ఒక కిలోమీటర్ దూరం నుండే విద్యుత్ దీపాల ధగధగలు, చిరుతిళ్ళ స్టాల్స్, రకరకాల కూల్‌డ్రింక్స్, హాట్‌డ్రింక్స్, పళ్ళముక్కలు, మరోప్రక్కన పాట కచేరీ ఉన్నాయి.

ఈ రోజుల్లో పెళ్ళిళ్ళు వీడియో గ్రాఫర్ల, ఈవెంట్ మేనేజర్‌ల ఆధీనంలో జరుగుతున్నాయి. మా రోజుల్లో పురోహితుల ఆధ్వర్యంలోనో పెళ్ళికి సారథ్యం వహించే పెద్దల ఆధ్వర్యంలో పద్ధతిగా జరిగేది.

ఏవో అర్థంకాని మాటలతో అల్లిన పాటలు. పాటలు కావవి మూలుగులు. బ్రాహ్మణుల మంత్రాలు అర్థంకానట్లే, రకరకాల భాషలతో అల్లిన ఈ పాటలు అర్థంగావాయే. ఈవెంట్ మేనేజర్ నెక్స్ట్ ప్రోగ్రాం అనౌన్స్ చేసాడు.

రెండు అలంకరించిన బుట్టలలో నుండి కార్ కీస్ చెరొకదానిలో నుండి తీయించారు ఒక పిల్లవాడిచేత. వాడు తనకి స్టేజీపైకి వచ్చే అవకాశం వచ్చింది కదా అని పొంగిపోతూ గర్వంగా ఫీల్ అవుతున్నాడు. వాడి తల్లీ, తండ్రులు ఆ అదృష్టం తమ అబ్బాయికే వచ్చిందని పొంగిపోయారు. ఆ రెండు కార్లకి సంబంధించిన జంటలలో ప్రతీ జంట తారుమారుగా మరొక జంటతో కలిసి స్టేజీ మీద పాడుతున్న పాటకి అనుగుణంగా డాన్స్ చేయాలి. సునయన, సంజయ్‌ల జంటకి వేరే ఎవరో జంటతో జత కలిసింది.

కొత్తగా కలిసిన జంట కోడలు సునయన నడుము మీద చేయివేసి బాల్ రూమ్ డాన్స్ చేస్తున్నాడు. ఏదో లోకంలో ఉన్నట్లుగా, మైమరుపుతో, ఉల్లిపొర లాంటి ఒంటికి అతుక్కుపోయిన చీర, వెనక ఎలాంటి ఆచ్ఛాదనా లేదనిపించే జాకెట్, అచ్చం సినిమా హీరోయిన్లా ఉన్నది కోడలు. తాను పెంచిన సంజయ్‌లా కాకుండా కొత్తగా అనిపించాడు సంజయ్ కూడా. ఒక్క క్షణం కలవరం, కంపరంతో, గుండె కంపించినట్లుగా అయింది.

ఈ విషవలయపు గూడు ఎంత దూరం అల్లుకుంటుందో ఆ అదురుపాటు నుండి తేరుకునేలోపు పదుచు అబ్బాయిలు, అమ్మాయిల వంతు వచ్చింది. ఆంగికం, అభినయం, వాచికం లాంటివి ఏమీ లేకుండా అసభ్యకరమైన భంగిమలతో, ఉన్మాదంలో ఉన్నట్లు, సోలిపోతున్నట్లు ఉన్నారు వారంతా. సినిమాలో క్లబ్ డాన్సర్స్ వేసుకునే కురచ దుస్తులు ధరించి ఉన్నారు వాళ్లంతా. తన్వి వంతు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నది లలితమ్మగారు ఆతృతగా. పాపం పిచ్చిపిల్ల నెలరోజులుగా పగలనక, రాత్రనక డాన్స్ క్లాసెస్‌కి వెళ్ళింది.

తన్వి స్టేజీ మీద తళుకులీనుతూ, మెరిసిపోయే కురచ దుస్తులతో సినిమాలోని క్లబ్ డాన్సర్‌లాగా ఏమాత్రం బిడియం లేకుండా ఊగిపోతోంది. ఇంటినుండి వాళ్ళ వెనుకే బయలుదేరాము కదా! అంటే ఇంటి నుండి ఇలానే బయలుదేరి ఉంటారు. మా ఊళ్ళో రికార్డు డాన్సర్ అయినా స్టేజీ పైకి వెళ్ళాక పైన కప్పుకున్న పలుచటి ఓణీ తీసేది. కానీ వీళ్ళు.... ఇంత జనంలో అలా....! లలితమ్మగారికి తల తీసేసినట్లైంది. ఆపై తలెత్తి స్టేజీవైపు చూడాలంటేనే ధైర్యం చాలలేదు. అలా ఉన్నచోటే భూమి చీలి, అందులో కూరుకుని మాయమైపోతే బాగుండనిపించింది. ఇంక ఇంటికి బయలుదేరేవరకు తలవంచుకునే ఉన్నది. చుట్టాలు, అయినవాళ్ళని కలిసిన ఆనందం ఆవిరైపోయింది.

ఇంటికి వెళ్ళేటప్పుడు కార్‌లో తన్వి వైపు గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది. లోనెక్ ఫ్రాక్, మోకాలిపై వరకే ఉన్నది. కాలిమీద కాలు వేసుకుని కూర్చుంటే....! లలితమ్మగారి కళ్ళు చెరువులయ్యాయి.

ఇంటికి చేరుకున్నాక తన్వి తనని ఒకబ్బాయి ఎక్కడెక్కడో తడిమాడని కన్నీళ్లతో సునయనకి కంప్లయింట్ చేసింది. కంప్లయినింగ్ ఆటిట్యూడ్ మానుకోవటం మంచిది. ఇలాంటివన్నీ లైట్‌గా తీసుకోవాలని, ఇన్సల్ట్‌గా ఫీల్ అవకూడదు. ఈ మోడరన్ సొసైటీలో ఇలాంటివన్నీ కామన్. నాకు కూడా ఇలాంటి ఎక్స్పీరియెన్సెస్ ఎన్నో? లైఫ్‌ని ఎంజాయ్ చేయాలి. ఉన్నది ఒకే జీవితం. ప్రతీ ఘడియని ఆనందంగా మలచుకోవాలి. ఈట్, డ్రింక్ & ఎంజాయ్ లైఫ్ ఫిలాసఫీగా ఎంచుకోవాలి. ఈ సంపాదనంతా ఎందుకు మరి. ఆనందించే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి."

"తేనెటీగ తేనెలో పడి మునిగిపోతే చనిపోతుందట" ఆధునికత అంటే ఏమిటి? ప్రస్తుతం ఆధునికతలో విషసంస్కృతి చీడపురుగులా సమాజాన్ని పట్టిపీడిస్తోంది. నేటి తరంలో సంస్కృతికి నిర్వచనం మారిపోతోంది. సంస్కృతి విలువలు క్రమేపీ పడిపోతున్నాయి. కేవలం విద్య, విజ్ఞానం ద్వారా ఉన్నతమైన సంస్కృతి నిర్మాణం జరగదు. నేడు నైతిక విలువల మీద దాడి పెచ్చుమీరింది. వస్తు వినిమయం, వినోదాల పేరుతో వ్యాపార విలువలు రాజ్యమేలుతున్నాయి. ఆదర్శవంతమైన సంస్కృతి - వ్యక్తి, సమూహం, సమాజం ఈ మూడింటి సమన్వయ సహకారాలతో ఏర్పడుతుందని" ఆంగ్లకవి టి.ఎస్. ఇలియట్ అభిప్రాయం. సంస్కృతి, నాగరికతలు విలువలతో కూడిన సంస్కారం పునాదిగా ఏర్పడాలి. వెలకట్టలేని సిరిసంపదలతో కాదు. అందులో వెలే కానీ విలువలకు తావుండదు. ఇటీవల పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులు బ్యాగ్‌లను తనిఖీ చేస్తే కండోమ్స్, గర్భనిరోధక మాత్రలు, సిగరెట్లు లభించాయట. లెక్కలేనని డబ్బులు కూడా ఉన్నాయట.

"సంప్రదాయాన్ని కాదనడమే ఆధునికత అయిపోదు. సమాజం మారిపోతున్నది దానితో పాటు మనమూ మారాలి అని రేషనలైజ్ (Rationalise) చేసుకుంటే చాలదు.

"ఆ మార్పు ఎటువైపుకి దారితీస్తోంది, మన అడుగు ఎటు పడుతోంది? మంచివైపు అడుగు పడటానికి మా తరంవాళ్ళు నడుంబిగించాలేమో." ●

## దేశ విభజన వస్తువుగా సాహిత్యం-7

### అత్తియా హుసేన్ రాసిన నవల

# 'సన్‌లైట్ ఆన్ ఎ బ్రోకెన్ కాలమ్'

### (విరిగిన స్థంభంపై ప్రసరించిన వెలుగు)

- కొత్తపల్లి రవిబాబు

**అత్తియా** హుసేన్ తన స్వీయానుభవాలను కలిపి ఇంగ్లీషులో రాసిన నవల ఇది. 1961లో వెలువడింది. ఆమె 1913 అక్టోబర్ 20న లక్నోలో ఔథ్‌కు చెందిన కిద్వాయ్ తెగలో విద్యాధికులైన తల్లిదండ్రులకు జన్మించారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చదివిన ఆమె తండ్రి గడియా ప్రాంతపు జమీందారు. అత్తియా తన తండ్రి నుండి రాజకీయాలపట్ల ఆసక్తినీ, తల్లి నుండి ఉర్దూ, పర్షియన్, అరబిక్ భాషల్లోని కవిత్వంపట్ల అభిరుచినీ పెంచుకున్నారు. ఒకవైపు యూరోపియన్ సాహిత్యాన్నీ, మరోవైపు ఖురాన్‌నూ అధ్యయనం చేశారు. ముల్కరాజ్ ఆనంద్, సజ్జాద్ జహీర్‌ల ప్రభావంతో వామపక్ష రాజకీయాలవైపు మొగ్గారు. సరోజినీ నాయుడు ప్రోత్సాహంతో కలకత్తాలో జరిగిన అఖిల భారత మహిళా మహాసభకు హాజరయ్యారు. రచయిత్రిగా 'ది పయొనీర్', 'ది స్టేట్స్ మన్' పత్రికలలో విరివిగా రాశారు. కుటుంబ సభ్యులకు ఇష్టం లేకపోయినా పిన్ని కొడుకును వివాహమాడారు. భర్త ఆలీ బహదూర్ ప్రభుత్వ ఉద్యోగరీత్యా 1940లలో బొంబాయి చేరారు. 1947లో ఇండియన్ హై కమీషన్ ఉద్యోగరీత్యా ఇంగ్లండ్‌కు భర్తతోపాటు వెళ్ళారు. దేశ విభజన ఆమెను ఎంతో కలవరపరిచింది. ఆమె తన 84వ ఏట 1998 జనవరి 25న మరణించారు.

ఈ నవల లక్నోలోని ముస్లిమ్ ఉన్నతవర్గానికి చెందిన ఒక కుటుంబగాథ. దేశ విభజనపై ముస్లిముల దృక్పథాన్ని చర్చించిన మహిళ రచించిన మొదటి నవల. ఒక కులీన ముస్లిం జమీందారు కుటుంబంపై విభజన కల్గించిన ప్రభావాన్ని రచయిత్రి దీనిలో చర్చించారు.

కథానాయకి లైలా ఉత్తమపురుషలో కథ చెప్తుంది. ఆమె ప్రధాన లక్ష్యం సంప్రదాయ కుటుంబం నుంచి స్వతంత్రం పొందడం. దేశానికి స్వతంత్రం వచ్చేనాటికి ఆధునిక మహిళగా పరివర్తన చెందుతుంది. ఆమె ప్రత్యక్షంగా రాజకీయ చర్చలలో పాల్గొనదు. కాని ఆమె కుటుంబంలోని పురుషులు రాజకీయాల్లో వుండటం వలన ఆమె రాజకీయాలను అర్థం చేసుకుంటుంది.

ఈ నవల కథాకాలం 1932 నుండి 1952 వరకు మొగల్ సామ్రాజ్యానికి కీలకంగా వున్న లక్నో నగరంలో కథ జరుగుతుంది. తల్లిదండ్రులు చనిపోగా 15 ఏళ్ళ లైలా తాత (తండ్రికి తండ్రి), మేనత్తల ఇంట్లో పెరుగుతుంది. పరదా పాటించే సంప్రదాయ కుటుంబం అది. బయట ప్రపంచంతో ఆ ఇంటి స్త్రీలకు సంబంధమేలేదు. తాత మరణించిన తర్వాత ఆమె ఆధునికుడైన పెదనాన్న కుటుంబంలో పెరుగుతుంది. తన కుటుంబ స్నేహితుడి బంధువైన పేదవాడైన అమీర్‌ను ప్రేమిస్తుంది. వారి పెళ్ళికి సంప్రదాయ సమాజం అనుమతించదు కాని లైలా పట్టు విడవక అతనినే వివాహమాడుతుంది. దేశ విభజన తర్వాత లైలా వితంతువుగా తను బాల్యం గడిపిన ఇల్లు చూడాలని లక్నో వస్తుంది. ఆ ఇల్లు అప్పటికి కాందిశీకుల శిబిరంగా మారింది.

ఈ నవల నాలుగు భాగాలుగా సాగుతుంది. ప్రతి భాగంలోనూ ఒక విభిన్న అంశంపై కేంద్రీకరణ వుంటుంది. మొదటిభాగంలో అనాథ ఐన లైలా తాత ఇంట్లో, తండ్రి, చెల్లెళ్ళు అబిదా, మజ్హాలతో, మజ్హా 17 ఏళ్ళ కూతురు జహ్రాతో వుంటుంది. తాత చనిపోగా లైలా పెదనాన్న హమీద్ దగ్గర చేరుతుంది. రెండవ భాగంలో ఆధునికుడైన హమీద్ ఇంట్లో ఆమె పరదా వదలివేస్తుంది. హమీద్ భార్య సైరా. వారికి సలీం, కమల్ కొడుకులు. లైలా కాలేజీలో చేరుతుంది. తన స్నేహితురాండ్రతో రాజకీయ చర్చలు చేస్తుంది. మూడవ భాగంలో ఇంగ్లండ్‌లో చదివి ఇండియాకు తిరిగి వస్తాడు హమీద్ కొడుకు కమల్. తండ్రీ కొడుకుల రాజకీయ అభిప్రాయాలు వేరుగా వుంటాయి. మరో కొడుకు సలీం పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలని నిర్ణయించుకుంటాడు. ఆవిధంగా కుటుంబం విచ్ఛిన్నమౌతుంది. లైలా అమీర్ అనే పేద ముస్లిమ్‌ను వివాహం చేసుకోవాలనే నిర్ణయం కూడా ఈ కుటుంబ విచ్ఛిన్నానికి కారణ మౌతుంది. నాల్గవ భాగంలో 14 ఏళ్ళ తర్వాత 1952లో స్వాతంత్ర్యానంతర భారతదేశానికి తిరిగి వచ్చి తన బాల్యంనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటుంది. వితంతువుగా దేశ విభజన నాటి అకృత్యాలను చూస్తుంది. తన భర్త విభజన అల్లర్లలో చనిపోలేదు. మధ్యప్రాచ్యానికి సైనికునిగా వెళ్ళి అక్కడ శత్రువులకు చిక్కి వారి చేతిలో చనిపోతాడు. అనిశ్చిత వర్తమానం, అగమ్యమైన భవిష్యత్తు ఆమెను కలవరపరుస్తాయి.

లైలా కాలేజి మిత్రులలో నీతా తిరుగుబాటుధోరణి గల హిందువు. నదీరా రాడికల్ ముస్లిం. రోమనా ముస్లిమేగాని ఏమీ పట్టించుకోదు. జాన్ డేవిస్ ఆంగ్లో ఇండియన్ క్రిస్టియన్ – తటస్థుడు. నీతా ఒక ఊరేగింపులో చురుకుగా పాల్గొంటున్న సమయంలో హత్యకు గురవుతుంది. నదీరా సలీంని పెళ్ళి చేసికొని పాకిస్తాన్ వెళ్తోంది. అక్కడ శరణార్థుల కోసం సామాజిక కార్యకర్తగా పనిచేస్తుంది.

వలస భారతదేశంలో కలసివున్న ఈ స్నేహితులు దేశ విభజన వల్ల ఇలా విడిపోతారు.

వచ్చే సంచికలో :
మనోహర్ ముల్గొంకర్ రాసిన **'పంపు తిరిగిన గంగ'**

స్పందన

# పితృస్వామిక వ్యవస్థ చేత అన్నివిధాల బంధింపబడ్డ స్త్రీల విముక్తిని కోరుతూ నాటకం వ్రాసిన రాహుల్ సాంకృత్యాయన్

– హరిబాబు

**ప్రపంచమంతటా** భారతీయ తత్త్వశాస్త్రంపైనా భారతదేశ సంస్కృతిపైనా పండితుడుగా పేరెన్నికగన్న రాహుల్ సాంకృత్యాయన్, అప్పుడే కొత్తగా స్వతంత్ర దేశమయిన భారతదేశంలో స్త్రీలపట్ల కొనసాగుతున్న వివక్షతను ప్రశ్నించాడు. తన కాలంలో ఉద్దేశ్యపూర్వకంగానే సమాజంలో నిర్లక్ష్యం చేయబడుతున్న స్త్రీల సమస్యలను పట్టించుకొని, ఆ స్త్రీలు తమ బంధనాల నుండి విముక్తం కావాలనుకున్నాడు.

భారతదేశంలోని మారుమూల గ్రామాల్లో, గ్రామీణ ప్రాంతాలలో స్త్రీలు అనుభవిస్తున్న దురవస్థలను స్వయంగా కళ్ళారా చూసిన సాంకృత్యాయన్, వారు ఆ దురవస్థల నుండి విముక్తం కావాలని మనసారా కోరుకున్నాడు.

అనేక భాషల్లో పండితుడైన సాంకృత్యాయన్, అభివృద్ధి నిరోధక మితవాద అభిప్రాయాలను సమాజంలో పాతుకుపోయిన దుష్ట దుర్మార్గపు చెడును, ఆలోచనలను పూర్వాచారపరాయణత్వంలో పాతుకుపోయిన సమాజాల నుండి సమూలంగా పీకిపారేయాలని ఆశించాడు. అటువంటి ప్రగతిశీలమైన లక్ష్యంతో, ఆయన భోజపూరి భాషలో ఒక నాటకం వ్రాశారు. ఆ నాటకం పేరు 'మెహరారోంకె దుర్దశ'. ఈ నాటకంలో, సమాజంలో స్త్రీల యొక్క అసమానత్వపు స్థితిని ఎత్తిచూపిస్తూ సమాజంలో అంతర్గతంగా వుండి, స్త్రీలను బానిసత్వంలో కట్టిపడేయటం అన్నది నిర్మూలింపబడాలి అని పిలుపునిచ్చారు. గ్రామీణ స్త్రీలు మాట్లాడుకొనే ఈ నాటకాన్ని వాడుక భోజపూరీ భాషలో ఆయన వ్రాశారు.

1942లో వ్రాసిన యీ నాటకంలో, 1923లో ప్రేమ్‌చంద్ వ్రాసిన 'సుభాగి', 1933లో మహాదేవి వర్మ రాసిన 'యుద్ధం – స్త్రీలు' అన్న రచనల్లోలాగా, స్త్రీల చైతన్యాన్ని చిత్రీకరించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఉత్తర ప్రాంతంలో ఒక స్త్రీగా వుండటంలో ఎన్ని ప్రమాదాలు యిమిడి వున్నాయో ఆయన యీ నాటకంలో వివరించారు.

8 మంది పాత్రలతో 5 అంకాలుగా కూర్చిన యీ నాటకంలో, గ్రామీణ ప్రాంతాల స్త్రీలకు సంబంధించిన అత్యంత బాధాకరమైన సమస్యలను ఎత్తి చూపించారు. స్త్రీలను వాడకపు వస్తువులు (సరుకులు)గా చూచే అసహ్యకరమైన ఘటనలు ఎత్తిచూపించి, ఆ రకంగా స్త్రీలను పరిగణించటాన్ని, వారిపట్ల వ్యవహరించటాన్ని ఖండించారు.

ఆనాటివరకూ సమాజంలోని స్త్రీ వ్యతిరేక విశ్వాసాల, నమ్మకాల వలన జరిగిన అనేకమయిన దురాచారాల వలన లక్షలమంది స్త్రీలు ప్రాణాలను పోగొట్టుకొన్న వివరాలను ఆ నాటకంలో వెల్లడించారు. స్త్రీలకు విద్య లేకపోవటం (చదవకుండా నివారించటం) నుండి, స్త్రీలకు ఆస్తిలో (సంపదలో) నామమాత్రమైన వాటా కూడా నిరాకరించటాన్ని చర్చించారు. అవకాశాలు యిస్తే స్త్రీలు తమ జీవితాల్లో అన్నిరంగాల్లోనూ రాణించే సామర్థ్యం కలవారు అన్న ఎటువంటి తొణికిసలేని దృఢ విశ్వాసాన్ని యీ నాటకంలో చిత్రీకరించారు. కుటుంబంలోనూ, సమాజంలోనూ స్త్రీలపై, పురుషులు ఆధిపత్యాన్ని, చలాయించటానికి అధికారం యిచ్చిన పితృస్వామిక వ్యవస్థను తీవ్రంగా విమర్శించారు.

1947కు ముందటి కాలంలో గల నాటి ఫ్యూడల్ సామాజిక వ్యవస్థలో ఆఖరికి ఆడపిల్ల పుడితే, కన్నతల్లే ఆ పుట్టిన పసిబిడ్డ గొంతులో ఉప్పువేసి (ఉప్పుకల్లును) చంపివేసే (మన ప్రాంతాల్లో పుట్టిన బిడ్డ గొంతులో వడ్లగింజలు వేసి చంపివేసే) స్త్రీల విధిలేని దుస్థితిని అందుకు నెట్టిన సామాజికవ్యవస్థ స్వభావాన్ని ఆ నాటకంలో ఆయన నిరసించారు.

కేవలం కొంచెం కాలితేనే, భరించలేని బాధను పొందే మనం భర్త మరణిస్తే అతడి చితిమంటల్లో జేరి ఆత్మ హననం చేసుకోవటాన్ని ఏ భార్య కోరుకొంటుంది అని ప్రశ్నిస్తూ సతీసహగమన దురాచారాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

రాహుల్ సాంకృత్యాయన్ నాటి సోవియట్ రష్యాలో నివసించినప్పుడు ఆ వ్యవస్థనూ, కమ్యూనిస్టు సమాజాన్నీ పరిశీలించిన దాని ఆధారంగా, అక్కడి అవగాహనతో అటువంటి సామాజిక మార్పును కావాలన్న దృష్టిని ఏర్పరచుకొన్నారు. సోవియట్ యూనియన్‌లో సంభవించినట్లు భారతదేశపు స్త్రీలకు కూడా భద్రమైన స్వయంప్రతిపత్తి కలిగిన హోదా, ప్రతిపత్తి, గౌరవాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు.

ఆయన తన నాటకంలోని పాత్ర లక్ష్మి ద్వారా "నేటి ప్రపంచంలో, స్త్రీలకు తమకు చెందిన ఏజెన్సీ (తమ దుస్థితిని ప్రశ్నించే, తమ సమస్యలను పట్టించుకొనే సంస్థ) ఏదీ లేదు. స్త్రీలు కేవలం తోలుబొమ్మలు. ఎటువంటి గళం (ప్రశ్నించే) లేని పరాధీనలు" అంటూ స్త్రీల హృదయ విదారకర పరిస్థితులను చిత్రించారు.

తమకు ప్రాతినిధ్యం వహించే గళం కానీ ప్రాతినిధ్యం వహించే సంస్థ కానీ లేదంటూ సాంకృత్యాయన్ కలుగజేసిన జాగృతి, ఫెమినిస్టు ఉద్యమం ప్రారంభంకావటానికి ఒక గుర్తుగా మన ముందుంది.

భోజపురి వాడుకభాషలో అత్యంత ప్రతిభావంతంగా వ్రాసిన యీ నాటకంలో, విధిలేని దుస్థితిలోకి నెట్టబడ్డ స్త్రీలు, గొంతుక నొక్కేయబడిన స్త్రీలు జానపద పాటలను, హాస్యాన్నీ, ఎత్తిపొడుపు వ్యంగ్యాలను తమను శారీరకంగా, మానసికంగా హింసించేవాళ్ళను ప్రశ్నించటానికి ఆయుధాలుగా చేసుకొన్న వాస్తవాన్ని యీ నాటక రూపంలో వెల్లడించారు. పొలాల్లో పంటలు పండించే ఎండలో పనిచేస్తూ కూడా యింటిపనులు కూడా చేసే స్త్రీలకు, ప్రతిరోజూ తమపై సాగే అన్యాయాలను గుర్తించే నిర్దిష్టమయిన చూపు కూడా స్త్రీలకు అలవడుతుందన్న అంశాన్ని ఆయన తన నాటకం ద్వారా, ప్రజల దృష్టికి తీసుకువచ్చారు.

తెలుగులో గురజాడ అప్పారావుగారి 'కన్యాశుల్కం' నాటకం మాదిరి, భోజపురి భాషలో సాంకృత్యాయన్ నాటకం 'మెహరారోంకె దుర్దశా' అంతటి ప్రాచుర్యం పొంది, మహిళాచైతన్యాన్ని పెంపొందించింది.

నేటి 21వ శతాబ్దంలో కూడా సాంకృత్యాయన్ వ్రాసిన ఆ నాటకానికి, రెట్టింపు ప్రాసంగికత ఉంది.

**(ప్రీతి చౌదరి, రిచా చాంద్‌లు సంయుక్తంగా వ్రాసిన వ్యాసం ఆధారంగా)**

# ముప్పై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

## సంపుటి : 16 సంచిక : 5 మార్చి 1993

**ముప్పై** ఏళ్ళక్రితం 1993 మార్చినాటి 'ప్రజాసాహితి' సంచిక నాటి సంక్షుభిత వాతావరణానికి అద్దంపడుతూ శ్రామిక మహిళలలో పెల్లుబికిన సారా వ్యతిరేక పోరాటాలను, దానిని సమర్ధవంతంగా ప్రక్కదారి పట్టించేందుకు రాజ్యం పట్ల అయోధ్య బాబ్రీ మసీదు కూల్చివేత మతోన్మాదాన్ని స్ఫురింపజేసే ముఖచిత్రంతో వెలువడింది. శ్రమజీవుల పోరాటాలకు ఆలంబన కావాల్సిన భగత్‌సింగ్ స్ఫూర్తిని సైతం స్ఫురింపజేసింది. మా చైతన్యంపై సారా వాసన పులిమినా / మతం మంట పెట్టినా / ఉద్యమాల ఉషోదయాలతో / పరిమళిస్తూనే ఉంటాం / మానవత్వపు నెగళ్ళై / మండుతూనే ఉంటా....మంటూ ముఖచిత్రానికి కవితాపంక్తులను ఉదయ్ రాశారు. 'పునరుద్ధరణవాదానికే, మహిళల అణచివేతకు బాగా ఊతమిచ్చే మతతత్త్వ రాజకీయాలను ఓడించడానికి సారా వ్యతిరేక పోరాటం మంచి వేదిక కాగలుగుతుందని, లౌకిక, ప్రజాసమస్యల పరిష్కారానికి సాగే ఉద్యమాలే మతోన్మాద శక్తులను ఓడించగలుగుతాయని' సంపాదకీయం పిలుపునిచ్చింది. సామ్రాజ్యవాదాన్ని ఓడించడం, భూస్వామ్య పెట్టుబడిదారీ దోపిడీలను అంతం చేయడం, వర్ణకుల వ్యవస్థలను నిర్మూలించడం, మతోన్మాదాన్ని ఓడించడం.... ఇవన్నీ విప్లవోద్యమంలో అంతర్భాగాలనీ భగత్‌సింగు తన రచనలలో స్పష్టంగా పేర్కొన్నాడని వివరిస్తూ 'ప్రజామిత్ర' సంస్మరణ వ్యాసం రాశారు. స్త్రీవాద దృక్పథాన్ని, మహిళా ఉద్యమాలను వక్రీకరించి, వ్యాపారీకరించే పరిస్థితులలో నిజాయితీపరులైన, సమగ్ర జీవిత దృష్టి కలిగిన రచయితలు కావాలిప్పుడు. లైంగిక వివక్ష, మానవ సంబంధాలను, ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాలను ఎంతగా నిర్వీర్యపరుస్తుందో, ఎంతగా అమానవీయపరుస్తుందో స్త్రీ పురుషులిద్దరికీ అర్ధమయ్యేవిధంగా అనేక కోణాల నుండి రచనలు రావాల్సిన అవసరమున్నదంటూ కాత్యాయనీ విద్మహే 'ఇటీవల నవలలు స్త్రీవాద ధోరణులు' అంశంగా వ్యాసం రాశారు. ఇంకా 'ప్రజాసాహితీ సాంస్కృతికోద్యమం', మరియు డా॥ కె. వెంకట్రామయ్య రాసిన 'రచయితగా భగత్సింగ్' అనే వ్యాసాలు ఈ సంచికలో ప్రచురితమయ్యాయి. 'మీ భార్య పనిచేస్తుందా?!....' తవటు నాగభూషణం రాసిన గల్పిక, కోణం కాని కోణం కుంభకోణం అంటూ కత్తుల కాంతయ్య రాసిన వ్యంగ్యం ప్రచురితమయ్యాయి. డా॥ చెరుకు సుధాకర్ రాసిన మీరైనా ప్రశ్నించండి; ప్లావియా రాసిన షాపింగ్ కవిత, ఎ. మురళీకృష్ణ రాసిన మరణంలేని అక్షరం కవిత, చైతన్యప్రకాశ్ రాసిన 'తప్పదు' కవిత, సయిదా గుజ్జర్ రాసిన 'సాక్ష్యం' కవితలు ప్రచురించబడ్డాయి. "కోపించే ఆడబడుచులారా" అంటూ దియా అజీజ్‌దియా రాసిన సౌదీ అరేబియా కవిత, రసూల్ రాసిన "సారా తాగమంటదేందిరో" అనే ప్రజల పాట ప్రచురితమయ్యాయి. 'కవిత్వం ఉత్తమమే.... మరి సమీక్షో....' అంటూ దివికుమార్ స్పందన, 'అయోధ్యలో రావణకాష్టం రచయితకు హిందూ మతోన్మాదుల బెదిరింపులను ఖండించండనే' పత్రికా ప్రకటన, అయోధ్యలో రావణకాష్టం 24వ పేజీ, గాయాల అయోధ్య ముఖచిత్రం ప్రత్యక్ష వార్తాకథనం (షంసుల్ ఇస్లాం) తదితరాలు ప్రచురితమయ్యాయి. ఇంకా అమరుదు అలిశెట్టి ప్రభాకర్ కుటుంబ సహాయనిధికై ప్రకటన, పిల్లల ప్రపంచం, ఆంక్షలు-నిషేధాలు కూడా ఆ సంచికలో చోటుచేసుకున్నాయి. రాజ్యం తన దోపిడీ విధానాలను యధేచ్ఛగా కొనసాగించేందుకు మతోన్మాదాన్ని, సారా మహమ్మారిని ప్రజల మధ్య శ్రమజీవుల మధ్య చీల్చి ఉంచే సాధనంగా ఉంచే కుట్రలను అర్థం చేసుకుంటూ శ్రమజీవుల ఐక్యతను సాధించాలని చెప్పే రచనలు ఈ సంచికలో వున్నాయి.


1/8 డెమ్మీలో 68 పుటలు. వెల : రూ.5/-

పుస్తక సమీక్ష

# డయాస్పోరిక్ కథలు.... "లొట్టపీసు పూలు"

- చేకూరి శ్రీనివాసరావు

**కవులు,** రచయితలకు క్రాంతదర్శనం, తాత్త్విక స్వేచ్ఛ, ఆధునిక పోకడలు, ప్రపంచీకరణ దృష్టి, విశాలత అవసరం. బోన్సాయ్ రచనలు పాఠకునిపై పెద్దగా ప్రభావం చూపవు. రచయితలు 'ఇన్స్కేపిజం' (అంతర్ముఖీనం)తో తమ లోపలి సంఘర్షణలు మాత్రమే రాస్తున్నారు. అది సరిపోదు. సామాజిక సంఘర్షణ, బాధలను వెతికిపట్టి చూపాలి. రచయిత అనుభవం, సంఘర్షణ స్థాయిని బట్టి రచనకు ప్రదీప్తి, శాశ్వత కీర్తి కలుగుతుంది. వైయక్తిక, సామాజిక విజయం సాధించడంలో సమ్మిళితమై ఉన్న పోరాటాన్ని శీలం భద్రయ్య "లొట్టపీసు పూలు" కథల్లో ప్రతిఫలించాడు. ఈ కథల్లో రచయిత యొక్క 'డయాస్పోరిక్ దృక్పథం' ప్రధానంగా ఉంటుంది.




'మాతృభూమి నుండి చెల్లాచెదురుగా దూరంగా నెట్టబడిన జీవితాలను 'డయాస్పోరిక్ జీవితాలు' అంటారు. "డయాస్పోరా" అనేది గ్రీకు పదం. అనగా "విత్తడం" అని అర్థం. 'డయాస్పోరిక్ సాహిత్యం'లో రచయితలు తమ పూర్వీకుల అనూహ్య స్థానభ్రంశం, గతాన్ని ప్రేమించడం (నోస్టాల్జియా), అస్తిత్వ మూలాలను వెతుక్కోవడం, వారి గుర్తింపు, అన్వేషణతో ప్రారంభమై వారి చరిత్రను రికార్డు చేయడం జరుగుతుంది. రచయిత యొక్క పూర్వీకుల అనూహ్య స్థానభ్రంశం లేదా వలసలు నిర్బంధమైనవి కావొచ్చు. స్వచ్ఛందమైనవి కావొచ్చు. దేశీయ, విదేశీయంగా కూడా ఈ వలసలుంటాయి. భారతీయ ప్రవాస డయాస్పోరిక్ సమూహాల సాహిత్యానికి ప్రసిద్ధులైన రచయితలు వి.యస్. నైపాల్, సల్మాన్ రష్దీ, కిరణ్ దేశాయి, భారతీ ముఖర్జీ, జంపా లహరి వంటివారున్నారు. దేశీయ వలసల గురించిన సాహిత్యాన్ని డయాస్పోరా సాహిత్యమని, దేశాంతర వలసల సాహిత్యాన్ని 'ట్రాన్స్ నేషనల్ సాహిత్యం' అనొచ్చని 'రేగడి విత్తులు' నవలా రచయిత్రి చంద్రలత ఒక వ్యాసంలో అభిప్రాయపడ్డారు.

"లొట్టపీసు పూలు" కథల్లో రచయిత శీలం భద్రయ్య తమ పూర్వీకుల మూలాలను వెతుక్కునే డయాస్పోరిక్ కథకుడిగా కన్పిస్తారు. 'ఇసపురుగు', 'కేంపుచెర్వు', 'బంచెర్రాయి', 'కర్తవ్యం', 'టముకు', 'వెలుగుచుక్క', 'తోడు', 'అగ్గువ బతుకులు" వంటి కథలు రచయిత పూర్వీకుల 'వలస జీవిత ప్రభావం' గురించి తెలియజేస్తే, 'కోదండం', 'మాయబారి', 'కొత్తదొర' వంటి కథలలో రచయిత పూర్వీకుల నిజాం వ్యతిరేక సాయుధపోరాట వారసత్వం కనబడుతుంది. నిజాం సంస్థానం భారతదేశంలో విలీనమయి 75 సంవత్సరాలు అయిన సమయంలో శీలం భద్రయ్య రాసిన "లొట్టపీసు పూలు" కథలు చర్చించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేస్తున్నాయి.

ఈ కథా సంపుటిలో వలస నేపథ్యంలో అత్యంత మానవీయంగా మలిచిన ఉత్తమ కథ "అగ్గువ బతుకులు". పేదజన పక్షపాతిగా ఉన్న ప్రతీఒక్కరూ ఈ కథ చదివాక కన్నీళ్లు కార్చకుండా ఉండలేరు. ఇది ప్రపంచ భావి ఆర్థిక, సామాజిక పరిణామాలను హెచ్చరించే కథ. గ్రామాలకు అభివృద్ధి – డీ సెంట్రలైజేషన్ జరగాలనే ఆవశ్యకతను తెలియజేస్తుంది. వేగవంత పట్టణీకరణకు ప్రపంచీకరణ, జిగేల్ మనిపించే వసతులు, ఉపాధి వంటివి కొన్ని ప్రధానకారణాలు. ఈ కథలో ఉపాధి కోసం పట్టణాలకు మారిన వలస కార్మికుల 'అస్తిత్వ సంక్షోభం' (ఐడెంటిటీ క్రైసిస్)ను బాగా చూపించారు. 2050 నాటికి పల్లెలు డీ పాపులేట్ అవుతాయి. 70 శాతం జనాభా పట్టణాలకు చేరిపోతుంది. దాంతో పట్టణాల్లో అధిక జనసాంద్రత, ఐడెంటిటీ క్రైసిస్, పలు రకాల కాలుష్యం, భారీ ట్రాఫిక్, క్రిమినలైజేషన్, జనాభా ఒత్తిడి ఉంటుంది. పరదేశాన ఇమడలేక, స్వదేశ ఆపేక్షను విడవలేక సంఘర్షణపడుతూ, స్వరపర భావనల అంచున నిలబడ్డ సరిహద్దు మనుషుల గురించి "మిడ్ నైట్ చిల్డ్రెన్"లో సల్మాన్ రష్దీ రాశారు. విప్లవ, దిగంబర కవిగా ప్రసిద్ధుడైన చెరబండరాజు 'మందు' కథలో చాలీచాలని జీతంతో విసిగిపోయి, పల్లెకు మారాలనుకునే పరమేశ్వరం పాత్రను పరిచయం చేశారు. శీలం భద్రయ్య "అగ్గువ బతుకులు" కథలో ఉపాధి కోసం గ్రామాన్ని వదిలిపెట్టి పట్నం చేరిన రాములు, రాములమ్మ కరోనా సమయంలో పట్నంలో ఉండలేక, తిరిగి గ్రామానికి

పయనమవుతారు. కన్నీళ్లు పెట్టించే కథనంతో ఈ కథ ముగుస్తుంది.

అన్ని డయస్పోరిక్ కమ్యూనిటీలు తమదైన సాంస్కృతిక స్పృహతో సాంఘిక వ్యక్తిత్వం కోసం తహతహలాడతాయి. భాష, మతం, సంస్కృతులతో ముడిపడ్డ తమ పూర్వీకుల జీవితాలు రచయితలకు ప్రధాన ప్రేరణగా నిలుస్తాయి. శీలం భద్రయ్య అచ్చయిన మొదటి కథ "కేంపు చెర్వు" కథ చదివినపుడు పాఠకులకు ఈ విషయం అర్థమవుతుంది. ఈ కథ రచయిత మూలాలను పట్టి చూపించే కథ. ఈ కథకు దాశరథి రంగాచార్య "చిల్లర దేవుళ్ళు" నవలకు పోలిక ఉంది. ఇది పర్యావరణ పరంగా విశ్లేషించాల్సిన కథ. జలాశయాల నిర్మాణంలో భూములు పోగొట్టుకున్న నిర్వాసితులకు చాలినంత నష్టపరిహారం లభించకపోవడం, అనూహ్యంగా ఆ చోటు వదిలిపెట్టి వెళ్ళాల్సి రావడం తీరని బాధకు గురిచేస్తుంది. అయితే జలాశయాల పరీవాహక ప్రాంతంలో ఉన్న రైతుల గోస 'గోరు చుట్టుపై రోకటి పోటు' లాంటిది. ఆనకట్టలకు సరైన లైనింగు నిర్మాణం చేపట్టక పోవడంతో సీపెజ్ (ఊట దిగటం) సమస్య మొదలవుతుంది. దాంతో ఆ భూములు పంటలు పండక నిరుపయోగంగా మారుతాయి. ప్రభుత్వ సాయం ఉండదు. భూములకు విలువ కూడా ఉండదు. నిర్వాసితులకు ప్రభుత్వ సాయం ఎంతో కొంత అందినా, వీరికి అది కూడా దక్కదు. కొల్లాటరల్ డ్యామేజీ గురించి చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నర్మదానదిపై భారీ ఆనకట్ట నిర్మాణం గురించి పునరాలోచించాలని మేధాపాట్కర్, బాబా ఆమ్టే లాంటివాళ్ళు జాతీయస్థాయిలో పోరాడారు. ఉత్తరాఖండ్ లోని జోషిమఠ్ పట్టణంలో కాలువలు తవ్వి లైనింగ్ మరిచారు. దాంతోఅదిప్పుడు సీపెజ్ సమస్య వలన రోజు రోజుకు భూమి కుంగిపోతుంది. ఈ కథలో శివుడుపాత్ర ఆధునిక భావాలున్న పాత్ర అంటాను. అతని తిరుగుబాటు కేవలం గ్రామ ప్రజలయొక్క నష్టపరిహారాన్ని కాజేయాలనుకున్న దొరపై మాత్రమే కాదు, పర్యావరణ ప్రభావంపై కూడా అని నా అభిప్రాయం.

బతుకు తెరువుకు మస్కట్కు వలస వెళ్లి దొంగతనం నెపంపై అక్కడే చిక్కుకున్న యువకుడు సైదులు భార్య నర్సమ్మ కథ "ఇసపురుగు". వలస జీవితం ఇద్దరినీ విడదీస్తుంది. భర్త ఎన్నటికీ తిరిగిరాడనే శోకంతోనున్న నర్సమ్మ, భర్తను రప్పించడానికి అవసరమయ్యే ఆర్థికసాయాన్ని పటేల్ దగ్గర కోరుతుంది. అతని కోరికపై తన శీలాన్ని సైతం తాకట్టు పెట్టడానికి సిద్ధపడుతుంది. వి.ఎస్. నైపాల్ రాసిన 'ఏ హౌస్ ఫర్ మిస్టర్ బిశ్వాస్'లో 'ఎన్నటికీ తిరిగి వెళ్ళలేని స్వదేశీ భావోద్వేగం' ఉంటుంది. వీటిని చదివినపుడు ఈ పాత్రలు పడే సంఘర్షణ, భావోద్వేగం పాఠకుని గుండెలోతులకు తప్పక చేరుతుంది. 'ఇసపురుగు' కథలో రెండు విషయాలున్నాయి. ఒకటి మహిళాభ్యుదయం, రెండవది నిజాం కాలంనాటి ప్రజల దుస్థితి, పటేల్ దోపిడీని తెలియజేస్తాయి. జాగీర్దార్లు, వారి తాబేదార్లు మహిళలను బలవంతంగా చెరబట్టడం, ఉంపుడుగత్తెలుగా ఉంచుకోవడం సామాజిక హోదాగా భావించేవారు. మహిళల అవసరాలు, బలహీనతలను ఎరగా చూపి లోబరుచుకోవడం, వేధించడం జరిగేది. నేటికీ ఈ దుస్థితి వివిధ రూపాల్లో ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు, సామాజిక, రాజకీయ వ్యవస్థలు సమష్టిగా వారికి అండగా ఉండి మహిళల రక్షణను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

నేడు ప్రచారంలో ఉన్న 'క్షీణ సంస్కృతి' స్త్రీ రక్షణకు మరో అతిపెద్ద సవాలు. దేశంలో షేర్ షా సూరి 'పట్వారీ వ్యవస్థ'ను ప్రవేశపెట్టగా అక్బర్ మరింత మెరుగుపరిచాడు. బ్రిటిష్ ప్రభుత్వం 1814లో సవరణలు చేసినా, మౌలిక స్వరూపంలో మార్పు లేదు. యాజమాన్య రికార్డులు, పంటల ఉత్పత్తి రికార్డు, వ్యవసాయ సంబంధ పన్నులు వసూలు చేయడం వీరి ప్రధాన బాధ్యతలు. దేశమంతటా వివిధ పేర్లతో ఉన్న ఈ వ్యవస్థ రాను రాను గ్రామీణ ప్రాంతాల్లో ఆధిపత్య దోపిడీదారు వ్యవస్థగా మారింది. నిజాం రాజ్యంలో పటేల్, పట్వారీ వ్యవస్థ నిరంకుశ బూర్జువా వర్గంగా మారడంతో, ఈ దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటం జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్.టి.ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1983 లో 'పటేల్, పట్వారీదారీ విధానం' రద్దు చేశారు. అయితే ఈ కథ చారిత్రక నేపథ్యంలో పరిశీలించినపుడు క్రోనాలజికల్ సింక్రనైజేషన్ (కాలమాన సమన్వయం) లోపం జరిగినట్టుగా ఉంది. ఉపాధికోసం వలసలు సమీప గ్రామాలకే ఉండేవి. మస్కట్ వంటి దూరప్రాంతాలకు తక్కువగా ఉండేవి.

వలస నేపథ్యంలో మరో కథ "తోడు". ఈ కథ కూడా ఎండిన హృదయాలను కూడా నిండుగా కన్నీళ్లను కురిపించే కథ. "బాధలు సైన్యంలా వాహినిలా వస్తాయి" (When sorrows come they come not in single spies but in battalions.) అని షేక్స్పియర్ అన్నట్టు ఈ కథలో రామలింగం పాత్ర మలచబడింది. "నేను రాను బిడ్డో.. సర్కారు దవాఖానకు.... అని ఒక సినిమాపాటలో పాడినట్టు వైద్యం పట్ల నేటికి ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని గుర్తుచేస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని అమానవీయతను ఈ కథలో చెప్పారు. అంతే కాకుండా కథలో ప్లాస్టిక్ రావడంతో తోలు చెప్పులు, ఆ వృత్తి మూలనపడుతుంది. మార్పు నిరంతర ప్రక్రియ. సాంకేతిక యుగంలో ఈ మార్పు ఇంకా వేగంగా ఉంది. పేదలు సాంకేతిక అనివార్యపు మార్పును గ్రహించకపోతే వారి ఉపాధిపోయి వాళ్ళు ఇంకా పేదవాళ్ళుగా మారే అవకాశం ఉంది. రచయితలు ముందుగానే గమనించి హెచ్చరిస్తే అట్టడుగువర్గాలకు లాభదాయకంగా ఉంటుంది. కథా రచయితగా శీలం భద్రయ్య ఈ కథ ద్వారా సామాజిక బాధ్యతను తీసుకోవడం ఆనందంగా ఉంది.

సమాజంలో అధిక సంఖ్యాకులు శ్రామికులు. వీరు పోరాడి విప్లవాన్ని సాధిస్తారు. ఆ విజయాన్ని బూర్జువా శక్తులు ఆక్రమించుకుంటాయి. రైతాంగ సాయుధపోరాటం, నిజాం వ్యతిరేకోద్యమ కాలం పాలనాధికారం మార్పుచెందే కాలం. ఒక ప్రభుత్వం మరొక ప్రభుత్వంతో తలపడుతున్న సమయం. సాంప్రదాయ రాచరికవ్యవస్థ అంతమై, నూతన రాజకీయ వ్యవస్థ ఏర్పడినా నేటికీ అట్టడుగు ప్రజలకు న్యాయం జరగలేదనే

ఊహావాస్తవికవాదంతో (Utopian Realism)తో ఈ సంపుటిలో కథలున్నాయి. జపాన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, చైనా ప్రజలు నిర్వహించిన పోరాటంలో ఏ జాతి విముక్తి పోరాట లక్షణాలున్నాయో నిజాం వ్యతిరేక పోరాటానికి అవే ఉన్నాయి. నిరంకుశ వ్యవసాయ విధానాలు, భూమంతా ఒక్కరి చేతుల్లోకి వెళ్ళడం ద్వారా గ్రామీణ ఆర్థిక, సామాజికపరమైన మార్పులు తీవ్రంగా సంభవించాయి. 'భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం' ప్రజలు నడుంబిగించారు. "దున్నేవానిదే భూమి" అనే నినాదంతో కమ్యూనిస్టులు ప్రజలను ఐక్యపరిచి భూపోరాటం నడిపారు. కానీ తరువాత కాలంలో ఈ ఉద్యమాన్ని హఠాత్తుగా నిలిపేశారు. దీనిపై విమర్శను కూడా ఎదుర్కున్నారు. తరువాత ప్రభుత్వాలు జోక్యం కలుగజేసుకోవడంతో ఆ ఉద్యమాలు చల్లారాయి. దాంతో భూస్వామ్య వర్గాలు రూపం మార్చుకొని భూమిని పేదలకు దక్కకుండా చేశాయి. ప్రజల ఉద్యమ పంథా మారింది. హింసామార్గం పట్టింది. నవీన వలసవాద, ఉదారవాద విధానాలు, ప్రపంచీకరణ ఈ ఉద్యమంపై ప్రభావం చూపడంతో చైతన్యం చల్లారిపోయింది.

ఉదారవాద సిద్ధాంతాలు ప్రజలకు మేలు చేసేవిగా కనిపిస్తాయి. అలాంటి లోపపూరిత విధానాలను "కొత్తదొర" కథలో రచయిత ఎండగట్టారు. ఈ కథలో పెంటయ్య పాత్ర 'లంపెన్' పాత్ర. (ఉద్యమాన్ని నీరుగార్చే పాత్ర). భూస్వామ్య దొరకు ఎదురు తిరిగిన ప్రజలకు నాయకుడు పెంటయ్య. తరువాత ఉద్యమాన్ని వ్యక్తిగత స్వార్థానికి, ఉద్యమాన్ని నీరుగార్చి నిర్వీర్యం చేస్తాడు. ఈ కథలో ప్రజలంటే శ్రామికులు. ఉద్యమ ఫలితం దక్కని మోసానికి గురైన ప్రజలకు ప్రతీకలు. నాటికాలానికి నేటికాలాన్ని ప్రతీకగా తీసుకొని చెప్పడం ఈ కథ ప్రత్యేకత.

తెలంగాణ పోరాట నేపథ్యంలో రాసిన మరో కథ "కోదండం". ఈ కథ చదివినపుడు అంజయ్య పాత్ర నా చిన్ననాటి సంగతులను గుర్తుచేసింది. రచయిత ఈ కథను సోషలిస్టు రియలిజంతో మలిచాడు. తెలంగాణలో కమ్యూనిస్టులు, స్టేట్ కాంగ్రెస్ కార్యకర్తలు నిజాం వ్యతిరేకపోరాటం చేశారు. ముఖ్యంగా ప్రజాపోరాటాన్ని రికార్డు చేసిన రచయితలు తక్కువ. ఈ కథలో ప్రజాపోరాటం ఉంటుంది. పిల్లలు సైతం పిడుగుల్లా మారి రజాకార్లతో వీరోచితంగా పోరాడారని తెలియజేస్తుంది. "బంచెర్రాయి" కథ చదువుతున్నప్పుడు నా బాల్యంలో చవిచూసిన తెలంగాణ పోరాట సామాజిక చైతన్య పరిస్థితులను జ్ఞాపకం చేసింది. "టముకు" కథలో దొర వీరారెడ్డి పాత్ర మనస్తత్వాన్ని ప్రత్యేకంగా చర్చించాల్సిన విషయం. 'మాయబారి' కథ తెలంగాణ సాయుధపోరాట కథనే. తిరుగుబాటుకు నాయకత్వం వహించిన కథా నాయకుడు ముత్తయ్య. రజాకార్ల నేపథ్యంలో ఉన్న 'కొత్తదొర' కథను చదివాక, ఈ కథను చదవడంలో పాఠకులకు విసుగు కలుగుతుంది. అనగా రెండు కథల్లో ఒకే రకమైన కథా నిర్మాణం, పోరాటం, సన్నివేశాలు ఉంటాయి.

"లత్త" కథ చదివితే, ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో బాలికలపై గల వివక్షను గుర్తుచేస్తుంది. గురజాడ 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ'లా బాల్యవివాహాలు ఇంకా పోలేదనే వెనుకబాటుతనాన్ని సూచిస్తుంది. వివాహ సంబంధాలకు పోయేటపుడు బేసి సంఖ్యలో పోవాలనే సంప్రదాయాన్ని మర్చిపోకుండా చెప్పడం రచయిత సమగ్ర దృష్టికి నిదర్శనం. ఈ కథలో మహిళకు 'ఎగనాకుడు' ఉండడమనేది మహిళా చైతన్యానికి అడ్డుగోడగా నిలిచింది. అబ్బాయి పాత్రకు 'ఎగనాకుడు'ను కల్పించి, అమ్మాయితో వివాహం జరిపించి ఉంటే, కథ ఇంకా ఆధునికతను, అభ్యుదయాన్ని సంతరించుకుని ఉండేదని నా అభిప్రాయం. ఈ కథ చదివితే సమాజంలో పురుషాధిక్యానికి ఇంకా చోటుందేమోననిపిస్తుంది. ఆధునిక తల్లితండ్రులు సంప్రదాయ విధానాలను విడిచిపెట్టకపోవడం వలన పిల్లలు పడే బాధ 'శూర్పణఖ' కథలో ఉంటుంది. కథ ముగింపులో రామారావు పాత్ర శూర్పణఖను పెళ్లి చేసుకుని ఉంటే అభ్యుదయ కోణంలో ఇంకా బాగుండేది. 'ఖూనీ' కథలో నేను అనే పాత్ర పేరును రచయిత ఎక్కడా ప్రస్తావించకుండా రహస్యంగా దాచిపెట్టాడు. కథలో 'నేను' అనే పాత్ర సృష్టి విచిత్రంగా ఉంటుంది. చివరిదాకా చెప్పకుండా ఉన్నప్పటికీ తెలివైన పాఠకుడు ఊహించగలడు. ఈ కథలో 'నేను' అనే పాత్ర రచయితదే.

శీలం భద్రయ్య కథనం ప్రత్యేక నైపుణ్యంగా ఉంది. సమ్మిళితవర్గపు (Inclusive) ప్రతినిధిగా కనబడుతాడు. కథనం ప్రత్యక్షంగా పాఠకులతో ముచ్చటించినట్టు ఉన్నాయి. భాషపరంగా విశ్లేషించినపుడు, అచ్చమైన తెలంగాణ భాష, సంస్కృతిని ఆకళింపు చేసుకొని రాసిన రచయిత అని చెప్పాల్సిందే. ఈ కథల్లో రచయిత భాష, సంస్కృతి పరంగా తెలంగాణ నేటివిటిని కాపాడారు. రచయితకు భాష సహజసిద్ధంగా వచ్చినట్టు కన్పిస్తుంది. ఈ కథల్లో ఎక్కువగా నవలా శైలిని అనుసరించాడు. ●

# మహిళా ప్రధాన కమీషనర్ బర్నాలి గోస్వామిపై దాడి

**త్రిపుర** మహిళా ప్రధాన కమీషనర్ బర్నాలి గోస్వామిపై బిజెపి కార్యకర్తలు దాడిచేసారు. దాడిచేసినవాళ్లు చీరను వంటిమీద దుస్తులను చింపివేసి అవమానించారు. ఈ దాడిలో 200 మందిదాకా పాల్గొన్నారు. ఆమె అంగరక్షకుడిని కూడా గాయపర్చారు. పోలీసులకు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా వాళ్ళు స్పందించలేదని ఆమె అన్నారు. తాను త్రిపుర ముఖ్యమంత్రి మానిక్ సాహాకి తెలియచేసినట్లు చెప్పారు.

త్రిపుర మహిళా ప్రధాన కమీషనర్ బిజెపిలో అధికారంలో వున్న ధామ్‌నగర్ ఎమ్మెల్యే బిశ్వబిందుసేన్‌కి సహకరించకపోవడం వల్లే దాడిచేసామని బిజెపి కార్యకర్తలు చెబుతున్నారు. ●

కవిత

# వీరుడు ఒంటరి కాదు

- గోలి సీతారామయ్య

కన్నీటి చుక్కల్నీ వీరుడు
చెక్కిలిపై జారనీయడు
పోటెత్తిన సముద్రాన్ని
వెనక్కి మళ్లించినట్లు....

ఆ నిశ్శబ్ద గంభీరతలో
ఎన్ని వేల ఆలోచనలో....
ఈ ప్రేరణకు మూలం
సహచరి చెలిమి చలవే

'ప్రజాసాహితీ' క్షేత్రంలో
వర్గపోరు జ్వలనానికి
ఎన్ని లక్షల అక్షరాలను
సైన్యంగా మార్చినారో....

అదొక దీర్ఘకాల యుద్ధం
అదొక నిరంతర సమరం
చరిత్ర నిర్మాతలు ప్రజలే....
లక్ష్యమైన వ్యక్తులు మీరు

మానవాళి గమ్యం
కమ్యూనిజమేనని....
జంటగా మీరు ఎన్ని
కలలు కన్నారో మరి..

వీరుడు ఒంటరి కాదు
సమూహ ప్రేమికుడు
జనపథంలో నడిచొచ్చిన
ఘనత మీ ఇరువురిది

లోకహితంకై తపించిన
మీ జంట ఏక ఆశయం
ప్రగతిశీల యువతకు
నిరంతరం స్ఫూర్తిదాయకం

(31-1-2023న చనిపోయిన
కొత్తపల్లి సుధాబాలను
స్మరించుకుంటూ....)

కవిత

# అంతిమయాత్ర

- భైరి ఇందిర

నేను పోయినప్పుడు
ఓ కాగితాన్ని కప్పండి
రాసుకోడానికి పనికొస్తుంది

మట్టిలో కప్పెట్టకండి
మరీ గాలాడదు
పురుగూ పుట్రా ఉంటాయ్

పెన్సిలు, రబ్బరు, కర్చీఫ్
బ్యాగులో ఉండేలా చూడండి
సెల్ మర్చిపొయ్యేరు
బోర్ కొట్టి చస్తాను

దండలు గిండలు వెయ్యకండి
నాకు ఎలర్జీ

పసుపు గట్రా పూసి
భయంకరంగా మార్చకండి

పిల్లలు ఝడుసుకుంటారు
పైగా నన్ను గుర్తుపట్టాలి కదా

పుణ్యస్త్రీ, పాపపు స్త్రీ అని
పేర్లు పెట్టకండి
నాకు చిర్రెత్తుకొస్తుంది

నా సామాన్లన్నీ పడేయకండి
అడిగినవాళ్లకు ఇచ్చేయండి

మంగళవారమైనాసరే,
పాడెకు కోడిపిల్లను కట్టి
హింసించకండి
ఇప్పుడైనా నా మాట నెగ్గనియ్యండి

డ్యాన్సులాడి లేట్ చెయ్యకండి
ఏదైనా టైం ప్రకారం జరగాలి

కాస్త చూసి తగలబెట్టండి
పక్కన మొక్కలుంటాయేమో


బడికి ఇన్ఫామ్ చెయ్యండి
వాళ్లు సెలవిచ్చుకుంటారు

దేనికీ ఇబ్బంది పడకండి
గొల్లవాళ్ల కొట్లో ఖాతా ఉంది

పిట్టకు పెట్టేదున్నా లేకున్నా
అన్ని రోజులూ అందరు
ఇక్కడే ఉండండి
మళ్లీ మళ్లీ చస్తానా ఏంటి

పనిలో పని
కాష్టం దగ్గర
కవిసమ్మేళనం పెట్టండి
నేనూ ఉ(వి)న్నట్టుంటుంది

## జాతీయ అక్షరయోధులు



## అవతార్ సింగ్-పాష్

**( 1950 - 1988 )**



**12**

**సింగంపల్లి అశోక్‌కుమార్**

# అవతార సింగం

## నక్సలైట్ ఉద్యమంతో పుట్టిన చైతన్యం
## 'ది మోస్ట్ డేంజరస్ థింగ్' కవనసైన్యం
## నిష్క్రియాపరత్వం, మతోన్మాదాలపైన
## కరపత్రాల దండయాత్ర అసామాన్యం

**"అఖండ భారత్ గురించీ / మతసామరస్యం గురించీ / అనర్గళంగా ఉపన్యాసాలను యిస్తున్న వాళ్లను చూస్తే / నాకు ఒళ్లు మండుతుంది. గభాలునవాళ్ల తలలమీంచి / టోపీలు తీసేసి గాలిలోకి ఎగరవేస్తూ / ఒరేయ్ భారత దేశం అంటే అర్థం / దుష్యంతుడు పరిపాలించిన రాజ్యం అని కాదురా / భారత దేశం అంటే అర్థం / ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని రైతు / పంటలు పండిస్తూ వుంటే / దోపిడిదొంగలు వచ్చి / దోచుకుంటున్న పంటపొలాలు అని చెబుదామనిపించింది" అంటూ తన 'భారత్' కవితాశతఘ్ని పేల్చిన అవతార్ సింగ్ సంధూ తొలి రచన 'లోహ్'తోనే తిరుగుబాటు దారుడుగా గుర్తింపుపొందిన ప్రముఖ భారతీయ పంజాబీ కవి. మార్క్సియన్ భావజ్వాల. పాష్ వీరి కలం పేరు.**

పాబ్లో నెరూడా, మాక్సింగోర్కీ రచనలతో ప్రేరణపొందిన సాహితీవేత్త. అవతార్‌సింగ్ రచనలు సమాజానికి అద్దం, అసమ సమాజంపై యుద్ధం. నిబద్ధమైన బలమైన వామపక్ష అభిప్రాయాలతో కవిత్వం నిండి ఉంటుంది. ఉత్పత్తి మార్గాలను నియంత్రించే భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు మొదలైనవారిని వ్యతిరేకిస్తూ, ప్రతిఘటిస్తూ పంజాబ్‌లో జరిగిన నక్సల్‌బరీ ప్రభావిత విప్లవోద్యమం మధ్య వికసించిన చైతన్యం అవతార్‌సింగ్ పాష్.

ఆయన కవిత 'హాత్'-జైళ్లలో గడిపిన సమయాన్ని ప్రతిబింబిస్తూ రాసిందే.టూ అండ్ టూమేక్ త్రీ' - కవితలో మతోన్మాదాన్ని, వేర్పాటువాద భావజాలాన్ని వ్యతిరేకించారు. మతం ఆధారంగా దేశాన్ని మళ్లీ(విభజన తరువాత)విభజించాలనే ప్రయత్నాలను ఖండించారు. ఆయన విప్లవ ఝుంఝా ప్రభంజన చైతన్య గళం ఆగ్రహానికి గురైంది. హత్యానేరం మోపబడి (రెండేళ్లు జైలు శిక్ష తర్వాత) నిర్దోషిగా విడుదలయ్యారు. 'సియర్ఢ్' (స్రవంతి) సాహిత్య పత్రికకు సంపాదకత్వం వహించారు. 1992లో 'ప్రజాసాహితి' నిర్మలానంద సంపాదకత్వంలో 'పాష్ కవిత' పేరుతో అనువాద సంకలనం వెలువడింది

1986లో ఖలిస్తాన్ అనుకూల ఉగ్రవాదుల నుండి మరణ బెదిరింపులు వచ్చిన తరువాత అమెరికా వెళ్లారు. అతను యు.ఎస్.లో ఉన్నప్పుడు సిక్కు ఉగ్రవాద హింసను తీవ్రంగా వ్యతిరేకిస్తూ యాంటీ-47 ఫ్రంట్‌తో పాలుపంచుకున్నారు. తన వీసా పునరుద్ధరించడానికి పంజాబ్ వచ్చారు. న్యూఢిల్లీకి వెళ్లే ముందురోజు స్వగ్రామంలోనే ఖలిస్తాన్ ఉగ్రవాదులు పాష్‌ని కాల్చిచంపారు.

ఈ రోజు ఆయన కవిత 'ది మోస్ట్ డేంజరస్ థింగ్'(అత్యంత ప్రమాదకరమైన విషయం) ప్రజాఉద్యమాల సందర్భంగా పదేపదే పఠించే ప్రతిఘటన కవితగా మారింది.

ఒక సమ్మె, లేదా ఆందోళన మొదలైనా, లేదా విప్లవోద్యమాలలోఎవరైనా చంపబడినా ఒక సంకేతంగా మారిపోయిన అవతార్‌సింగ్ పాష్ 1950 సెప్టెంబర్, 9న పంజాబ్‌లోని జలంధర్ జిల్లా తల్వాండి సేలం గ్రామంలో జన్మించారు. 1988 మార్చి, 23న పంజాబ్‌లో ఖలిస్తాన్ ఉగ్రవాదులు ఆయన్ని కాల్చి చంపారు.

కరపత్రం

అంతర్జాతీయ మహిళా పోరాటదినం మార్చి 8 స్ఫూర్తిని స్వీకరిద్దాం

# మహిళల జీవితాల్ని విధ్వంసం చేస్తూ, శ్రామిక ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటున్న పాలకుల మద్యం పాలసీని ప్రతిఘటిద్దాం.

## పితృస్వామ్య పీడన, దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడుదాం.

*మిత్రులారా!*

ఎనిమిది గంటల పనిదినం కోసం, సురక్షితమైన పని పరిస్థితుల కోసం, వేతనాల పెంపుదల కోసం, ఓటు హక్కు కోసం, సమానపనికి సమాన వేతనం కోసం 150 ఏళ్లకు పూర్వమే అమెరికా, తదితర దేశాల్లోని మహిళా కార్మికులు పోరాటాలు సాగించారు. గడ్డకట్టే చలిలో, మంచులో అనేకరకాల అవరోధాలను, ఆటుపోట్లను, పాలకుల నిర్బంధాన్ని ఎదుర్కొంటూ సాగించిన పోరాటాల ఫలితంగా కొన్ని హక్కుల్ని సాధించుకున్నారు. ఈ క్రమంలో 1910లో కోపెన్ హేగన్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు మహిళల కాన్ఫరెన్స్‌లో జర్మనీకి చెందిన కమ్యూనిస్టు నాయకురాలు క్లారా జెట్కిన్ అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని ప్రతిపాదించారు. నాటి నుంచి నేటి వరకు అంతర్జాతీయ మహిళా పోరాట దినం మార్చి 8 శ్రామిక మహిళల సంఘటిత పోరాటాలకు, హక్కుల సాధనకు సంకేతంగా నిలుస్తూ స్ఫూర్తినిస్తున్నది.

నేడున్న సామాజిక, ఆర్థిక సంక్షుభిత పరిస్థితుల్లో మహిళలు అడుగడుగునా లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు, ప్రేమ పేరిట హంతక దాడులకు, పరువు హత్యలకు బలవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆదివాసీ, దళిత మహిళలపై భూస్వామ్య, పెత్తందార్ల దోపిడీ, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి. బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, లైంగిక హత్యలు నిత్యకృత్యంగా మారాయి. సమాజంలో ఉన్న అన్నిరకాల అసమానతలు, పురుషాధిపత్య భావజాలం, ఫ్యూడల్ విలువలు, కుల అణిచివేత, మతతత్వం – ఇవన్నీ మహిళలను మరింత అణిచివేతకు గురిచేస్తున్నాయి. వ్యవసాయ కూలీలుగా, పారిశ్రామిక కాంట్రాక్టు కార్మికులుగా, వివిధ సేవారంగాల్లో ఉద్యోగులుగా, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు శ్రామికులుగా పనిచేస్తున్న మహిళలతో పాటు చదువుకొని, ఉద్యోగాలు చేస్తున్న మహిళలు ఎంతో స్వేచ్ఛగా, ఆధునికంగా వున్నట్లు కనిపిస్తున్నప్పటికీ ఇంటా బయటా నిత్యం వివక్షను, లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నారు.

వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. అప్పులపాలై రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కరువు పీడిత ప్రాంతాల్లో దుర్భర దారిద్ర్యం ఫలితంగా మహిళలు వ్యభిచార కూపంలోకి నెట్టబడుతున్నారు. గ్రామీణ జీవన విధ్వంసం లక్షలాదిమంది కష్టజీవి మహిళల్ని అసంఘటిత రంగంలోకి నెట్టివేసింది. దీంతో అతి తక్కువ వేతనాలకు, రోజుకి 14 నుంచి 16 గంటల పాటు పనిచేస్తూ శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఉపాధికల్పన పేరిట మహిళల శ్రమ కారుచౌకగా సామ్రాజ్యవాద, కార్పొరేట్ కంపెనీలకు సప్లై చేయబడుతోంది. ఈ కంపెనీలన్నీ 18-30 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలనే ఎక్కువగా తీసుకుంటూ వారి శక్తులన్నింటినీ పీల్చి పిప్పి చేస్తున్నారు. ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులన్నింటినీ కాలరాస్తూ కార్మిక చట్టాలను సవరించారు. మన శ్రమను, సహజవనరులను, ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఈ విధానాలన్నీ పేదరికాన్ని, అసమానతలను తీవ్రంగా పెంచుతున్నాయి. కొద్దిమంది సంపన్నుల ఆస్తులు వందల శాతం పెరిగిపోతూ వుంటే, మెజారిటీ ప్రజల జీవితాలు పేదరికంలోకి దిగజారుతున్నాయి.

రోజురోజుకీ పెరుగుతున్న పెట్రోలు, డీజిల్, గ్యాసు ధరలు, ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేద, మధ్యతరగతి ప్రజల బ్రతుకు మరింత భారంగా మారింది. విద్య, వైద్యం వ్యాపార సరుకుగా మారడంతో అప్పుల పాలవుతూ, కోలుకోలేని విధంగా దెబ్బతింటున్నారు. ఈ పరిస్థితుల్లో మహిళలు కుటుంబ పోషణ కోసం సర్వ శక్తుల్నీ కూడదీసుకొని ఎంత చాకిరీ చెయ్యడానికైనా సిద్ధపడుతున్నారు. చాలీచాలని తిండితో, ఆకలితో, అనారోగ్యాలతో పేదరికపు భారాన్నంతా మోస్తున్నారు. తమ లాభాల కోసం పెట్టుబడిదారీ వర్గం, సామ్రాజ్యవాద కంపెనీలు సినిమాలు, టీవీల ద్వారా వ్యాప్తి చేస్తున్న విషసంస్కృతి, ఫోన్లు, ఇంటర్నెట్‌లలో లభ్యమయ్యే పోర్న్‌సైట్లు, బూతువీడియోలు యువతను నేరస్తులుగా మార్చుతున్నాయి. మహిళలపై, పిల్లలపై హింసాత్మక లైంగిక దాడులకు ప్రేరేపిస్తున్నాయి.

ప్రభుత్వాల మద్యం విధానం శ్రామిక మహిళల జీవితాల్ని మరింత దయనీయ స్థితిలోకి నెట్టేస్తోంది. టార్గెట్లు పెట్టి మరీ శ్రామిక ప్రజల్ని, యువతని తాగుబోతుల్ని చేస్తూ మద్యం అమ్మకాల్ని సాగిస్తున్నారు. పొద్దస్తమానం చాకిరీ చేసిన శ్రమజీవుల కష్టార్జితాన్నంతా పిండుకొని వారిని మరింత పేదరికంలోకి నెట్టేస్తున్నారు. మహిళల కూలి డబ్బుల్ని

కూడా బలవంతంగా గుంజుకుని, భర్త తాగొచ్చి కొట్టడం, తిట్టడం, వేధించటం, అవమానించడం, నిరంతర ఘర్షణలతో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. పేదరికం, చాలీచాలని తిండితో తాగుడు వ్యసనం వల్ల అనారోగ్యాలకి గురై పురుషులు చిన్నవయసులోనే మరణిస్తున్నారు. భర్తలను కోల్పోయిన స్త్రీలు ఆ కుటుంబ భారాన్నంతా ఒంటరిగా మోస్తూ తీవ్రమైన వత్తిళ్ళకు లోనవుతున్నారు.

విద్యార్థులు, యువకులు లక్ష్యంగా పాలకులు స్కూళ్ళు, కాలేజీలు, యూనివర్సిటీలను మాదకద్రవ్యాలకు అడ్డాలుగా మార్చుతున్నారు. యువతలో నేర స్వభావాన్ని పెంచి పోషిస్తూ, వారి జీవితాల్ని బలి తీసుకుంటున్నారు. మద్యానికి బానిసల్ని చేసి ఎంతటి ఘోరమైన నేరాలు చెయ్యడానికైనా తెగబడే అరాచక గ్యాంగులుగా మార్చి పాలక, ప్రతిపక్ష రాజకీయ నాయకులు తమ సైన్యంగా తిప్పుకుంటున్నారు. దీనివల్ల కుటుంబాలకి, సమాజా పురోభివృద్ధికి ఉపయోగపడాల్సిన యువతరం శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలన్నీ ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. కుటుంబం లోపల, బయటా మహిళలపై, పసిపిల్లలపై హింసాత్మక లైంగిక దాడులు తీవ్రమవుతున్నాయి. సమాజంలో నేరాలు, నేర ప్రవృత్తి పెరుగుతున్నది. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. జీవితాలు విధ్వంసమవుతున్నాయి. ఈ పరిస్థితులన్నింటికీ మద్యం ఒక ప్రధాన కారణంగా వుందని అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నప్పటికీ మద్యం, మత్తుపదార్థాల విషయంలో పాలకులు వెనుకడుగు వేయటంలేదు.

రాజ్యాంగం ప్రకారం మద్యం, మత్తు పదార్థాలు వంటి ప్రజల బలహీనతలతో ప్రభుత్వాలు వ్యాపారం చేయకూడదు. కానీ దానికి భిన్నంగా ప్రభుత్వాలు పేద ప్రజల శ్రమ ఫలితాన్నంతా మద్యం ద్వారా దోచుకుంటూ, సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలంటే మద్యం ద్వారా వచ్చే ఆదాయమే ప్రధానవనరు అని చెప్పడం పాలకుల దోపిడీ స్వభావాన్ని బహిర్గతం చేస్తున్నది. పాలకవర్గాలకు మద్యం కేవలం ఆదాయవనరు మాత్రమే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యూడల్ పెత్తందారీశక్తులు తమ ప్రాబల్యాన్ని నిలుపుకోవడం కోసం మద్యం బలమైన సాధనంగా ఉంది. ఎన్నికల సందర్భంగా మద్యాన్ని విచ్చలవిడిగా ప్రవహింపజేసి, ప్రలోభాలకు గురిచేసి ప్రజల చైతన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. అడ్డూ అదుపూ లేకుండా తమ దోపిడీని యదేచ్ఛగా కొనసాగించుకోవాలంటే యువతరం, ప్రజలు చైతన్యవంతులై వుండకూడదు. తమ దుర్భర జీవితాలకు కారణమైన వ్యవస్థ సంక్షోభపు మూలాలను తెలుసుకోకూడదు. దోపిడీని ప్రశ్నించకూడదు, పోరాటాల్లోకి రాకూడదు. నిత్యం మత్తులో వుండాలి. అందుకే దోపిడీశక్తుల చేతుల్లో మద్యంపాలసీ ఒక బలమైన వ్యవస్థీకృత దోపిడీ రూపంగా కొనసాగుతున్నది.

దీంతోపాటు పాలకవర్గాలు నిరంతరం ప్రజల మధ్య విభేదాలను సృష్టిస్తూ కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. మతతత్వ భావజాలాన్ని, ఫ్యూడల్ సంస్కృతిని, అభివృద్ధి నిరోధక భావజాలాన్ని సమాజంపై రుద్దుతున్నారు. నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా నిరంతరం హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తూ, విద్వేషాలు నింపుతున్నది.

***మిత్రులారా!***

పాలకులు అనుసరిస్తున్న దోపిడీ విధానాలన్నీ మహిళల జీవితాల్ని నిరంతరం అభద్రతలోకి నెట్టేస్తున్నాయి. హక్కుల్ని కాలరాస్తున్నాయి. సమాజంలో వేళ్ళూనుకొని వున్న పితృస్వామ్య భావజాలం, భూస్వామ్య సామ్రాజ్యవాద దోపిడీ విషసంస్కృతులు, మద్యం దోపిడీ - ఇవన్నీ కలగలిసి మహిళల జీవితాలని హింసాత్మకం చేస్తున్నాయి. స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో, హుందాగా బ్రతకటం మహిళల హక్కు. అందుకోసం మహిళల్ని అడుగడుగునా అణచివేస్తూ, హక్కుల్ని నిరాకరిస్తున్న పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు సాగించాలి. సంఘటిత శ్రామికవర్గ పోరాటాల ఆవశ్యకతను ఎలుగెత్తి చాటిన మార్చి 8 స్ఫూర్తిని స్వీకరిద్దాం. మద్యం, మత్తు పదార్థాలు, విషసంస్కృతి ప్రభావాలకు యువతను బలిచేస్తున్న నేరమయ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుదాం. **మహిళల జీవితాల్ని విధ్వంసం చేస్తూ, శ్రామిక ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటున్న పాలకుల మద్యం పాలసీని ప్రతిఘటిద్దాం.** మహిళలపై సాగుతున్న శ్రమదోపిడి, పితృస్వామ్య పీడన, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడుదాం.

**- స్త్రీ విముక్తి సంఘటన**

## భూమిని స్వాధీనం చేసుకోవటానికి తల్లి - కూతుళ్ళ సజీవ దహనం

**కాన్పూర్‌కి** చెందిన మైతా తహసీల్ ప్రాంతంలోని మదౌలి గ్రామంలో పేద ప్రజలు నివశించే ప్రాంతాన్ని ప్రభుత్వం అక్రమ కట్టడాల పేరుతో మైతా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ జ్ఞానేశ్వర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఖాళీ చేయిస్తున్నది.

2023 ఫిబ్రవరి 13న అక్కడి నివాస గృహాలను కూల్చివేత కార్యక్రమాన్ని అడ్డుకుంటూ నిరుపేద కుటుంబం అయిన కృష్ణకుమార్ భార్య ప్రమీల (44 ఏళ్ళు), కూతురు - నేహా (21 ఏళ్ళు) తమ పూరిగుడిసెలోకి వెళ్ళారు.

సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ జ్ఞానేశ్వర్ ప్రసాద్ నేతృత్వంలో ఆ తల్లీ కూతుళ్ళను అందులోనే బంధించి, ఆ పూరిగుడిసెకు నిప్పు అంటించారు. దాంతో తల్లి ప్రమీల, కూతురు నేహ సజీవ దహనం అయ్యారు. వాళ్ళని కాపాడ్డానికి తీవ్ర ప్రయత్నం చేసిన తండ్రి కృష్ణకుమార్ మంటల వల్ల తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆగ్రహానికి గురైన మదౌలి గ్రామస్థులు అధికారులపైనా, పోలీసులపైనా రాళ్ళు రువ్వారు. ప్రభుత్వం పోలీసు బలగాలతో ప్రజలను అడ్డుకున్నది.

అక్రమ కట్టడాల పేరుతో భూమిని స్వాధీనం చేసుకుంటూ బడా బాబులకు అప్పనంగా కట్టబెడుతూ నిర్భాగ్యపు ప్రజల్ని సజీవ దహనాలకు గురిచేస్తోన్న పైశాచిక పాలన ఇది. ఇలాంటి అజాదీ అమృతోత్సవ్ వేళల్లో మనం జీవిస్తున్నాం.

పుస్తక పరిచయం

నర్సింహారావు (జి.పి.ఎల్) రాసిన

# విశ్వం

(సూక్ష్మ - స్థూల విశ్లేషణ)

పరిచయకర్త : **జి.వి. భద్రం**

**సాంకేతికత** ఎంతగానో అభివృద్ధి చెందిన 21వ శతాబ్దంలో మనం జీవిస్తున్నాం. నిత్యజీవితంలో డిజిటల్ సాంకేతిక సాధనాలను వాడుతున్నాం. సాంకేతిక ఆధారిత సేవలను అనుభవిస్తున్నాం. అయినప్పటికీ మనం నివసించే యీ విశ్వంపట్లా, మన చుట్టూ ఆవరించి వున్న ప్రకృతిపట్లా శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోలేకపోతున్నాము.

విద్యావంతులు సహితం, సైన్సులో ఉన్నత డిగ్రీలు పొందిన మేధావులు సహితం, మూఢాచారాలను పాటిస్తున్న విషయాన్ని మనం చూస్తూనే వున్నాం! ఒకవైపు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు) ద్వారా అత్యంత సంక్లిష్టమైన శాస్త్ర సంబంధమైన, వివిధ సమస్యలను పరిష్కరించటం జరుగుతోంది. వైద్యరంగంలో అతి సున్నితమైన, సూక్ష్మమైన, సర్జరీలను రోబోట్ల (మరమనుష్యుల) ద్వారా సునాయాసంగా చేయటాన్ని మనం చూస్తూనే వున్నాం. ఆటో, ఐ.టి.రంగ పరిశ్రమల తయారీ ప్రక్రియలో, అతి కష్టమైన, సంక్లిష్టమైన, అత్యంత శ్రమతో కూడిన పనులను రోబోట్ల ద్వారా చేయించుచున్న విషయం మనకు తెలుస్తున్నదే! వివిధ సేవలను – హోటల్‌లో సర్వీసింగ్ సేవలతో సహా రోబోట్లే నిర్వహిస్తున్నాయి. అంతరిక్షంలోకి, కొన్ని గ్రహాలలోకి పర్యాటక ట్రిప్పులు నిర్వహిస్తున్నారు. వాటిలో మానవుల నివాసాన్ని ఏర్పాటుచేస్తున్న అద్భుత విషయాల గురించీ తరచుగానే వింటున్నాం. అప్పుడప్పుడు అత్యంత సంపన్నులు అంతరిక్షంలో వివాహాలు జరుపుకొంటున్న ఘటనల గురించీ తెలుసుకుంటున్నాం.

అయినా మత సంప్రదాయాలు పేరిటనో, మత–కుల ఆచారాల పేరిటనో శని త్రయోదశినాడు మందపల్లిలో తైలాభిషేకాలు చేయించుకోవటం, రాహు, కేతువులకు కాళహస్తి గుడిలో ప్రత్యేక పూజలు చేయటం, సూర్య–చంద్ర గ్రహాలకు గ్రహణాలు పట్టిన సందర్భాలలో గ్రహణ కాలంలో తిండి తినకపోవటం, గ్రహణ విడుపు సందర్భంగా తలస్నానాలు చేయటం, గ్రహణ కాలాల్లో యింట్లోని తినుబండారాలు, ఆహార వస్తువులపై దర్భ పుల్లలు పెట్టుకోవటం, రథసప్తమి రోజున తలపై జిల్లేడు లేదా చిక్కుడు ఆకులు, రేగిపళ్ళు పెట్టుకు స్నానాలు చేయటం చూస్తున్నాం. గతంలో చాదస్తవంతులు పాటించే యీ మూఢాచారాలను నేటి సామ్రాజ్యవాద గ్లోబలీకరణ యుగంలో ప్రత్యేకించి మనదేశమంతటా ముమ్మరంగా పాటించటం అన్నది గణనీయంగా పెరిగిపోయింది. ఆఖరికి అంతరిక్షంలోకి ఉపగ్రహ వాహకాలను పంపే ఇస్రో (శ్రీహరికోట) శాస్త్రజ్ఞులు సహితం, ఆయా అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించిన ప్లానులను, బ్లూప్రింట్లను తిరుపతిలో వేంకటేశ్వరస్వామి విగ్రహం ముందుపెట్టి, పూజించిన తర్వాతే తాము అంతరిక్ష ప్రయోగాలను సాగించటం మనం చూస్తూనే వున్నాం. ఇదంతా శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోకపోవటం వలన సంభవిస్తున్న మూఢత్వం యొక్క ఆచరణలే!.

మనం విద్యాకాలంలో సైన్సును చదివినా, అది పరీక్షల కోసం బట్టీపట్టి పరీక్షల్లో చీమిడి చీదేసినట్లుగా అప్పుడే మరిచిపోతున్నాము. అందునా ఆ సైన్సులను మన మాతృభాషలోకాక, ఇంగ్లీషు భాషలో నేర్చుకొంటున్న వల్ల – నేర్చుకోవల్సిన విధి మనపై రుద్దబడటం వల్ల శాస్త్రవిజ్ఞానపు సూక్ష్మతలను అర్థం చేసుకోలేకపోతున్నాము. పోనీ ప్రభుత్వంవారి ద్వారా తెలుగులో నేర్పబడే సైన్సులోని పదాలు ఇంగ్లీషు నుండి కోతిపుండు – బ్రహ్మరాక్షసిలా మార్చబడుతుందన్నట్లు వుండి ఆయా సాంకేతికపదాలు అర్థం చేసుకోవటం చాలా సంక్లిష్టంగా వుండటంతో అసలే అర్థం చేసుకోలేకపోతున్నాం. ఇందువల్ల, యితర అనేక కారణాలు (ప్రధానంగా నిరంతరం కెరీర్‌ను కాపాడుకొని, అభివృద్ధి చేసుకోవాల్సిన, ఆరాటపడాల్సిన పరిస్థితుల వలన) మనం శాస్త్రాన్నీ సులభంగా అర్థం చేసుకోలేకపోతున్నాము. శాస్త్రీయ దృక్పథాన్నీ అలవరచుకోలేకపోతున్నాము. మన సైన్సు జ్ఞానం పాలకు పాలు, నీళ్ళకు నీళ్ళుగా విడిపోయి, శాస్త్రీయ అవగాహనలేక మూఢాచారాలను పాటిస్తున్నాం.


గతంలో నాలుగైదు దశాబ్దాల క్రితం నందూరు రామ్మోహనరావు లాంటివారు విశ్వరూపంలాంటి గ్రంథాలు తెలుగుభాషలో ప్రచురించినా, వాటిని కొద్దిమంది ఆసక్తిపరులే చదవటం జరిగింది. వారిలో చాలామంది ఆ విషయాలను పరిమితంగానే అర్థం చేసుకోగలిగారు. ఆ శాస్త్రసంబంధిత విషయాలను మరికొద్దిమందే తమ జీవన కార్యకలాపాలకు అన్వయం చేసుకొన్నారు. శాస్త్రవిజ్ఞానం అన్నది ఎవరో కొందరి శాస్త్రజ్ఞులకు సంబంధించిన విషయంగా, సామాన్యులకు అవసరంలేని విషయంగా, శాస్త్రవిజ్ఞానం పొందటం అన్నది, తద్వారా శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవటం అన్నది పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది.

ఇటువంటి సందర్భంలో, విశ్వాన్ని గురించి సూక్ష్మమైన, స్థూలమైన విశ్లేషణాపూర్వకమైన 'విశ్వం' అనేపేరిట నర్సింహారావు (జి.పి.ఎల్), ఒక చిన్న పుస్తకాన్ని వ్రాసి ముద్రించారు. విశ్వరహస్యానికి చెందిన వివరాలు, రహస్యాలన్నింటిని అతి తేలికైన భాషలో, తేలికగా అర్థం అయ్యేట్టు వివరించారు. తెలుగుభాషలో వ్రాసిన యీ పుస్తకం ఐదవ తరగతి చదువుకొన్నవారికి సహితం చాలా క్షుణ్ణంగా అర్థమవుతుంది.

విశ్వాన్ని గురించీ, ప్రకృతిని గురించీ వీటికీ మానవులకు గల సంబంధం గురించీ సునాయాసంగా అర్థమయేట్లు, జి.పి.ఎల్., ఆయా విషయాలను బోధపరుస్తూ వ్రాశారు. ఈ విజ్ఞానానికి సంబంధించిన నిర్వచనాలను, సాంకేతిక పదాలను తెలుగులో అతి తేలికగా అందరూ అర్థం చేసుకోగలిగేటట్లుగా తెలుగు పదాలను రూపొందించారు. పుస్తకంలో యీ విషయాలన్నిటినీ కేవలం 66 పేజీల్లోనే వివరించటం, అది కూడా సాధారణులకు, చిన్నపిల్లలుగా వున్న విద్యార్థులకు, 'అరటిపండు వొలిచి నోట్లో పెట్టినట్టుగా' వ్రాయగల్గటం వెనుక జి.పి.ఎల్ యొక్క కృషి, నేర్పరితనం ప్రశంసింపదగ్గదని చెప్పటం ఎంతమాత్రం అతిశయోక్తి కాబోదు. జి.పి.ఎల్ ఎన్ని సంవత్సరాల కాలంపాటు శ్రమపడి, అనేక విషయాలను సేకరించి, యీనాటిదాకా శాస్త్రవిజ్ఞానం కనుగొన్న విషయాలన్నింటినీ సూక్ష్మీకరించి, సంక్షిప్తంగా విశ్లేషణ చేయగలిగారన్నది ఊహించాల్సిన విషయంగానే వుంది. నిజానికి యిటీవలి కాలంలో విజ్ఞానశాస్త్ర బోధనాకృషిలో తద్వారా శాస్త్రీయ అవగాహన ఏర్పడటానికి వేసిన బాటలో జరిగిన ఒక అద్భుతంగా జి.పి.ఎల్ వ్రాసిన యీ చిరుపుస్తకం 'విశ్వం' గురించి చెప్పుకోక తప్పదు.

విద్యార్థుల నుండి పెద్దవారి వరకూ, విద్యావంతుల నుండి ప్రాథమిక విద్యనే గరిపిన సామాన్యులవరకూ యీ పుస్తకాన్ని తప్పక చదివితీరాలి! శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని, నిత్యజీవితానికి ఆ అవగాహనను అన్వయం చేసుకొనేందుకు యీ పుస్తకం ఎంతగానో దోహదపడుతుంది.

ఈ పుస్తకానికి కొనసాగింపుగా, వైజ్ఞానిక విషయమై అవసరమై వున్న మరిన్ని పుస్తకాలను జి.పి.ఎల్. వ్రాయాలని కోరుకుందాం. ●




**1/8 డెమ్మీలో 72 పుటలు.**
**వెల : రూ.100/-**
దొరుకుచోటు : **మైత్రీబుక్‌హౌస్,**
**జలీల్‌వీధి, అరండల్‌పేట,**
**కారల్‌మార్క్స్ రోడ్డు,**
**విజయవాడ - 520002.**
**మరియు నవోదయ బుక్‌హౌస్,**
**ఆర్యసమాజ్ ఎదురుగా,**
**కాచిగూడ, హైదరాబాద్.**

**కవిత**

# సగం తెరిచిన తలుపు

– కంచరాన భుజంగరావు

ప్రతిఘటించే ఎడారి నేలను
ప్రలోభ పెట్టగల వ్యూహాలున్నాయ్

తలలెత్తే కొమ్మల చెట్టును
నేలకు వొంచగల తాయిలాలున్నాయ్

సంఘటితమయ్యే వాగుల నదిని
లోబరుచుకునే మలుపులున్నాయ్

యోచించే కన్నుల దృష్టిని
దిశ మళ్లించే మార్గాలున్నాయ్

సాయుధమయ్యే ఆలోచనలను
మట్టు పెట్టగల తంత్రాలున్నాయ్

స్వతంత్రించే ఉరుకుల పాదాలను
బంధీచేసే మెత్తని గొలుసులున్నాయ్

కుర్చీల వెనుక చీకటి కోణాలను
కప్పిపుచ్చగల కాయితపు కర్టెన్లున్నాయ్

బార్లా తెరిచిన గదులకు కూడా
వెలుతురు దాచగల రహస్యాలున్నాయ్

ఇది సత్యానంతర ప్రపంచం
తత్వాన్ని శోధించే మతానిదో దోవ!
సత్యాన్ని సమాధి చేసే మతతత్వానిది మరో దోవ!

ఇంద్రధనస్సు లాంటి ఇంటర్నెట్ విల్లును వొంచి
నీ చెవిగుమ్మం వరకూ వింటినారిని లాగి
నీ మెదడులో వేలాడే జ్ఞానమత్స్యానికి
గురిపెట్టిన సోషల్ మీడియా బాణం మతతత్వం!

సత్యమేదో అసత్యమేదో అర్ధసత్యమేదో
సగం తెరిచిన తలుపులోంచి దూరి
ఎలా తెలుసుకోవడం?

అయితే నువ్వు చేతన మరిచి
శిలవైనా కావాలి
కాదంటే, నీ చలనాన్ని నిరోధించే
బండశిల మాయాజాలాన్ని బద్దలుకొట్టాలి! ●

# ధిక్కార స్వరం వినిపిస్తున్న జానపద కళాకారిణి నేహాసింగ్ రాథోర్

**'యు.పి. మేం కా బా 2.0'** అనే పాటలతో నేహాసింగ్ రాథోర్ అనే భోజపురి జానపద వాగ్గేయకారిణి ఉత్తరప్రదేశ్‌లో బిజెపి పాలన ప్రజలపై చేస్తున్న దాడుల్ని – అమలవుతున్న అవకతవకల్ని – నిగ్గదీసి, ఎండకడుతున్నారు. తాను ఏ రాజకీయ పార్టీకీ సంబంధించినదానిని కాననీ, ఈ పాటలను ఎన్ని ఆటంకాలు వచ్చినా కొనసాగిస్తాననీ అంటున్నారు. ఆమె సొంత వూరు జల్దహాన్ గ్రామం (క్రైమూర్ జిల్లా – యు.పి.) సామాజిక మాధ్యమాల్లో అనూహ్యమైన అభిమానుల్ని కూడదీసిన నేహాసింగ్ రాథోర్ తన పాటలలో యు.పి. ప్రభుత్వ ఆగడాలను ఎండగడుతున్నారు.

2019 డిసెంబర్ 28న ఉదహళ మహిళపై నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారం చేసి, చంపిన దుర్ఘటననీ దాన్ని వెనకేసుకొచ్చిన యు.పి. ప్రభుత్వాన్నీ దుయ్యబడుతూ, 2017 జూన్ 4న ఉన్నావ్‌లో 12 ఏళ్ళ దళిత బాలికపై యు.పి. ఎమ్మెల్యే, అతని అనుచరులు అత్యాచారం చేసి, అది కోర్టు కేసైతే ఆమె తండ్రినీ, బంధువుల్నీ కారు ప్రమాదం పేరుతో చంపిన దారుణ సంఘటనలో నేరస్థ ఎమ్మెల్యేని నెత్తిన పెట్టుకున్న యు.పి. ప్రభుత్వ నిర్వాకాన్నీ ఎండగడుతూ, 2021 అక్టోబర్ 5న లఖింపూర్ ఖేరీలో యూనియన్ మినిస్టర్ అజయ్‌కుమార్ మిశ్రా కొడుకు ఆశిష్ మిశ్రా కారుతో తొక్కించి 8 మంది రైతుల్ని దుర్మరణంపాలు చేసిన దుర్ఘటననీ, ఫిబ్రవరి 2023లో జరిగిన కాన్పూర్ తల్లీ – కూతుళ్ళ సజీవదహనంపై స్పందిస్తూ ఆమె పాటలు పాడుతున్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని యోగి పాలనలో జరుగుతున్న దారుణాలను నేహాసింగ్ రాథోర్ నిర్భయంగా తన జానపద వాగ్గేయ సరళిలో పాటల రూపంలో నిగ్గదీసి ప్రశ్నిస్తున్నారు. ఈమె పదునైన పాటలను సామాజిక మాధ్యమాల్లో (యూట్యూబ్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ మొ॥) ప్రజలు ఆదరిస్తున్నారు.

నేహాసింగ్ ఇలా పాడుతూ (నిజానికి సంఘటనలు జరగడం, జరిపించడం వల్ల కాదన్నమాట) ప్రజల్లో భయభ్రాంతులు సృష్టిస్తున్నారని, 3 రోజుల్లో జవాబు ఇవ్వాలని యు.పి. పోలీసులు ఆమెకు నోటీసు ఇచ్చారు.

తాను జానపద గాయనిని అనీ, ప్రజల తరఫున పాడతాననీ, పాలకుల విధానాలపై అస్త్రాలు తన పాటలనీ నేహాసింగ్ ధిక్కార స్వరంతో ప్రకటించింది.

కవిత

# ఎటు నా దారి?

– తమ్మినేని సూర్యనారాయణ

కళ్ళు ముందుకు, కాళ్ళు వెనుకకు
చేతులు పైకి చూపులు కిందకు
కొయ్యగుర్రంపై లోకం చుట్టిరావాలని కోరిక!
హరప్పా మొహంజొదారోకు -
నేటి అయోధ్యా మక్కా జెరూసలేం యాత్రకు
సంస్కృతుల అంతరం అనంతం!
రాజుల కొలువు తీర్పుకూ - నేటి కోర్టు తీర్పుకు
నేరానికీ శిక్షకూ మధ్యకాలం మన్వంతరం!
కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న సూర్యకుటుంబాల
చుట్టూ తిరిగే మనం
ఇంటి వెనుక బాబాతో రక్ష కట్టించుకుంటాం!
శాస్త్రాలకూ పురాణాలకు - వేదాలకు పరిశోధనకు
పిలకలు ముడివేసి వాదాలతో మోదాలని చూస్తున్నాం!
నోబెల బహుమతి గ్రహీతలైనా - కడియాల ప్రవచన కర్తకు లోకువే
అగ్గిపుల్లతో వెలిగే దీపం - అణ్వాయుధాన్నే అదిలిస్తుంది
ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్‌ల అధికారం -
వార్డు కౌన్సిలర్‌కూ తలాడిస్తుంది
వెయ్యినోటు నల్లగా మారిందని వచ్చిన
రెండువేల నోటు రెక్కలు ముడిచి దాగుంది!
జాతీయ ఆస్తుల అమ్మకాలకు - సంస్కరణల నామకరణం!
విదేశీ అప్పుల కుప్పలకు - అభివృద్ధి పూలమాల
జాతీయ ఆదాయం అంతర్జాతీయ వ్యక్తిగత
రహస్య ఖాతాల్లో కాపురం
మేధావుల నోళ్ళు మూసి - ఉద్యమాలపై నీళ్ళుపోసి
భారీ విగ్రహాలకు నోట్లు కోట్లు కుమ్మరింది
చట్టసభలో రాజ్యాంగం - నేరస్తుడి చేతిలో
భగవద్గీతగా మారింది.
అదుగో నా భరతమాత -
నాలుగు సింహాల మధ్య నిలబడింది.
ఆత్మరక్షణ కోసం రాజకీయ జెండాల చాటున దాగుంది.
ఈ అయోమయ పయనంలో చిక్కిన -
భరతమాత బిడ్డ నేను
ఏది నా ఉనికి? ఎటు నా దారి?

కరపత్రం

# దర్శన్ సోలంకిది ఆత్మహత్యా?! సంస్థాగత హత్యా?!

## సెంథిల్ కుమార్... రోహిత్ వేముల...పాయల్ తాడ్వీ...దర్శన్ సోలంకి... ఇంకా ఎంతమంది బలవ్వాలి?

## దర్శన్ మృతిపై తక్షణమే దర్యాప్తు చేపట్టి బహిరంగ నివేదిక యివ్వాలి!

- ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (PDSO)

**ఫిబ్రవరి 12,** ఆదివారం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)-బొంబాయిలో మొదటి సంవత్సరం చదువుతున్న దళిత విద్యార్థి క్యాంపస్‌లో ఆత్మహత్య చేసుకుని మరణించాడు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన 18 ఏళ్ల దర్శన్ సోలంకి కెమికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చదువుతున్నాడు. కుళాయిలు బిగించే పనిచేసే అతని పేద తండ్రి, పొరుగిళ్ళలో పనిమనిషిగా చేసే అతని తల్లితో ప్రతివారంలాగే ఆ రోజూ మాట్లాడాడు. ఆ తరువాత ముప్పావుగంటకే దర్శన్ సోలంకి ప్రాణాలు తీసుకున్నాడు. కానీ పరిస్థితులను బట్టి కులవివక్షకు తట్టుకోలేకే ఆత్మహత్య చేసుకున్నప్పటికీ, పోలీసులు మాత్రం కారణం తెలియని హత్య కింద కేసు నమోదుచేశారు. అంటే దర్శన్ ఆత్మహత్యకు కారణం ఏమిటో, కారకులెవరో ఎన్నటికీ తేలదు.

### ఆత్మహత్య కాదు, సంస్థాగత హత్యే!

దర్శన్ సోలంకి బొంబాయి ఐ.ఐ.టి.లో చేరిన తరువాత మిగతావారితో పరిచయాలు, స్నేహాలు కుదుర్చుకోకముందే అతను జె.ఇ.ఇ.లో ఎన్ని మార్కులు సంపాదించాడో అడగడం మొదలుపెట్టారు. ఈ మార్కులు తెలిస్తే విద్యావిషయాల్లో అతని స్థానం ఏమిటి, దానిని బట్టి అట్టడుగు కులమో, అగ్రకులమో తెలుస్తుంది. అప్పుడు "నువ్వు రిజర్వేషన్ కోటా విద్యార్థివి" అని ముద్ర వేశారు. మూడున్నర నెలల క్రితమే అతడు ఈ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి, అంతవరకూ చదువులో చురుగ్గా ఉండేవాడు ఇటీవల ముభావంగా మారాడనీ, నెలక్రితం మాట్లాడినప్పుడు కులవివక్ష సంగతి చెప్పాడనీ అతని సోదరి చెబుతున్నారు. తన కులం తెలిసినప్పటి నుంచీ సహవిద్యార్థులు మాట్లాడటం మానేశారనీ, తాను ఒంటరినయ్యానని బాధపడ్డాడని అంటున్నారు. అత్యున్నత విద్యాసంస్థల్లో దళితులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న కులవివక్ష, అంటరానితనమే వారు ఆత్మహత్యలకు పాల్పడటానికి ప్రధాన కారణం అని అందరికీ తెలుసు. దర్శన్ సోలంకి ఆత్మహత్య కూడా ఆ కోవలోనిదే! కనుక ఇది ముమ్మాటికీ సంస్థాగత హత్యే!!

### బుట్ట దాఖలవుతున్న కమీషన్ నివేదికలు

సోలంకి ఇంత తీవ్రమైన నిర్ణయం ఎందుకు తీసుకున్నాడో కనిపెట్టడానికి ఐ.ఐ.టి. యాజమాన్యం ఓ కమిటీని నియమిస్తుందట. కుల వివక్షే కారణం అని ఆ కమిటీ తేల్చినా అది భవిష్యత్తులో ఇలాంటి ఘాతుకాలను నివారించడానికి ఏమాత్రం ఉపయోగపడదు. ఎందుకంటే మన సమాజంలో కులం అనే చెట్టు వేర్లు అంత బలంగా పాతుకు పోయాయి గనుక. తమ ప్రాంగణంలో కుల వివక్ష లేనేలేదని, ఒకవేళ అలాంటిదేమైనా ఉంటే ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక విభాగం ఉన్నదని చెబుతున్న బాంబే ఐఐటీ ఆ విభాగం పని తీరెలావుందో ఈ సందర్భంగా అర్థం చేసుకోవచ్చు.

ఏడేళ్లనాడు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రోహిత్ వేముల ప్రాణం తీసుకున్నప్పుడు యాజమాన్యం నుంచి వచ్చిన సంజాయిషీకీ, దీనికీ పెద్దగా తేడాలేదు. రోహిత్ వేముల మరణానికి దారితీసిన పరిస్థితులేమిటో వెలికి తీయాల్సిన జస్టిస్ రూపన్‌వాల్ కమిషన్ అతను ఎస్సీ కాదని చెప్పడానికే తాపత్రయపడింది. తన చిన్ననాడే తల్లిదండ్రులు విడిపోయి దళిత స్త్రీ అయిన తల్లి పెంపకంలో దళిత వాడలోనే పెరిగిన రోహిత్ దళితుడు కాదని నిరూపించింది.

ఇందుకు దేశంలోని ఉన్నతశ్రేణి విద్యాసంస్థలేవీ మినహాయింపు కాదని 2007లో థోరట్ కమిటీ ఇచ్చిన నివేదిక మొదలుకొని 2013 నాటి ముంగేకర్ కమిటీ నివేదిక వరకూ చెబుతూనే వస్తున్నాయి. కానీ వాటిని అవసరమైనంతగా పట్టించుకోవటంలేదని దర్శన్ సోలంకీ ఉదంతం మరోసారి నిరూపించింది. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది హిందూ' కథనం ప్రకారం నిరుడు ఫిబ్రవరిలో బాంబే ఐఐటీలో కుల వివక్ష, అందువల్ల తలెత్తే సమస్యలపై సంస్థలోని ఎస్సీ, ఎస్టీ విభాగం రెండు సర్వేలు చేసింది. దాంట్లో వచ్చిన ఫలితాల ఆధారంగా కొన్ని చర్యలు తీసుకోవాలని కూడా సంకల్పించింది. ఏడాదైంది కానీ, ఇంకా అది ఆచరణ రూపం దాల్చినట్టు లేదు. అసలు సర్వేలకు స్పందించిన విద్యార్థుల సంఖ్య చూస్తేనే వివక్ష ఎంత బలంగా ఉన్నదో అర్థమవుతుంది. బాంబే ఐఐటీలో దాదాపు 2,000 మంది దళిత విద్యార్థులుంటే కేవలం

20 శాతంమంది మాత్రమే తొలి సర్వేకు స్పందించారట! రెండో సర్వేకైతే 5 శాతంమంది మాత్రమే జవాబిచ్చారు. స్టూడెంట్ కౌన్సెలర్‌గా ఉంటున్న మహిళా ప్రొఫెసర్ రిజర్వేషన్ల గురించి సామాజిక మాధ్యమాల్లో బాహాటంగా వ్యక్తం చేసిన అభిప్రాయాలు వారి భయానికి ఒక కారణం.

### ఈ కుల జాఢ్యానికి ఇంకెంతమంది బలి అవ్వాలో..?

2008లో చనిపోయిన పీహెచ్‌డీ విద్యార్థి సెంథిల్ కుమార్ చనిపోవటానికి కారణాలు ఇలాంటివే. ఆయనది తమిళనాడు. ఎస్టీ వర్గానికి చెందిన విద్యార్థి. ఫెలోషిప్ కోసం వెళితే.. 'పందులు కాసుకునేవాడివి నీకెందుకురా ఈ చదువు' అని వ్యాఖ్యానించటంతో ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. స్కాలర్‌షిప్ రాకపోవటంతో అప్పులయ్యాయి. ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగోకపోవటంతో, ఏమీ చేయలేక ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. అలాగే 2016లో హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యకు కూడా ఇటువంటి సామాజిక, రాజకీయ వివక్ష, వేధింపులే ప్రధాన కారణం. క్యాంపస్‌లో అసమానతలు, వివక్షకు వ్యతిరేకంగా రోహిత్ వేముల రాజకీయంగా గొంతెత్తటంతో.. ఒక సంస్థను టార్గెట్ చేశారు. అందులోని విద్యార్థులందరూ దళితులే. తమపై విధించిన సస్పెన్షన్ మీద మూడు నెలల పాటు పోరాడారు. ఈ అన్యాయాలకు పరిష్కారం ఉండదనే వేదనతో రోహిత్ ఆత్మహత్య చేసుకున్నారు. 2019లో ముంబైలో వైద్య శాస్త్రంలో పీజీ చేస్తున్న పాయల్ తాడ్వీ అనే గిరిజన విద్యార్థిని సహ విద్యార్థినుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంది. గైనకాలజీలో పీజీ చేస్తున్న తనను కనీసం ఆపరేషన్ థియేటర్‌లోకి కూడా రానీయలేదని చివరిసారిగా రాసిన లేఖలో ఆమె బాధ పడింది. ఇదే ఐఐటీ ముంబైలో 4 సెప్టెంబర్ 2014న హాస్టల్‌లోని ఆరవ అంతస్తు నుండి పడి మరణించిన అనికేత్ అంబోర్ కూడా కుల వివక్ష వాతావరణం వల్లే మరణించాడు. వరంగల్‌లో పి.జి. విద్యార్థిని డా॥ ప్రీతి మరణం, బి.టెక్ విద్యార్థిని రక్షిత మరణాలు ఈ వివక్ష వాతావరణం వల్లే సంభవించాయి.

ఐఐటీలతో సహా పలు ఉన్నత విద్యా సంస్థల నుంచి పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య గత కొన్నేళ్లుగా చర్చనీయాంశంగా ఉంది. దేశంలోని ఐఐటీలు, ఐఐఎంలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో 2014 నుంచి 2021 మధ్య మొత్తం 122 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర ప్రభుత్వం గతేడాది లోక్‌సభలో వెల్లడించింది. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల్లో 58 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థులే కావటం గమనార్హం.

75 ఏళ్ళ స్వాతంత్ర్య భారతంలో దేశంలోని దళిత, ఆదివాసీ విద్యార్థులు యింకా కుల వివక్ష ,వేధింపులకు గురి కావాల్సిందేనా? తమ జ్ఞానంతో ఈ దేశాన్ని ముందుకు తీసుకెళ్ళాల్సిన విద్యార్థులు ఇలా కుల దురంహకారానికి, దుర్మార్గాలకి బలి కావాల్సిందేనా? ఈ సమస్య పాలకులకు పట్టదా?

దర్శన్‌కు న్యాయం చేయాలని పోరాడుతున్న విద్యార్థులకు సంఘీభావం తెలియజేస్తూ,కుల వివక్షకు బలైన దర్శన్ మృతిపై తక్షణమే దర్యాప్తు చేపట్టి బహిరంగ నివేదిక యివ్వాలని, కుల వివక్ష, వేధింపులు కేంద్రాలుగా మారుతున్న విద్యాలయాలపై తగు చర్యలు చేపట్టి 'విద్యా వాతావరణాన్ని' నెలకొల్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాలని విద్యార్థులకు పిడిఎస్‌ఓ పిలుపునిస్తుంది.

- ★ **దేశంలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించి, నివారణాచర్యలు చేపట్టాలి!**
- ★ **ఆత్మహత్యలు వద్దు! సామాజిక రుగ్మతలపై ఆత్మస్థైర్యంతో పోరాడుదాం!!**

దీర్ఘ కవిత

## రంగు వెలిసిన చిత్రం

– శీలా సుభద్రాదేవి

(గత సంచిక తరువాయి....)

అసమ్మతుల అలకలు తీర్చడం ఒక ఎత్తు
పక్కపక్షం వాడిరెక్కలు తెగ్గొట్టి తేగల్గటం మరో ఎత్తు
గుర్రం మీద కూర్చుని గడకర్రకు ఎరకట్టినట్లు
ఓటర్లను బూత్ ల లోనికి
పరిగెత్తించే కుయుక్తులు ఇంకో ఎత్తు
ఇదికూడా అంత తేలిగ్గా అయ్యే పని కాదుకదా
ప్రజలముందు వెలిగించే ఉపన్యాసమతాబులు
ఉత్సాహాన్నిపెంచికాంతిపుంజాలై కురవాలి కదా
రేప్పొద్దున గద్దెక్కితే అవే పులకింత పూలవ్వాలి
పాదాలకింద నిప్పు కణికలు కాకూడదు కదా
వెచ్చించిన దానికి లెక్కాపత్రాలు లేకపోవచ్చు
కానీ
అందలం ఎక్కాక
అధికారం చిక్కాక
అంతకు ఎన్నింతలు రాబట్టొచ్చో
దానికి మాత్రం ఖచ్చితంగా
పద్దుల్ని రచించుకొనే ఉంటారు
ప్రస్తుతం జనహృదయాకాశంలో
ఆశల గాలిపటాలు ఎంతెత్తు ఎగరెయ్యాలా అని
ఎంతమందిని వాగ్దానాల మాంజాలతో
కట్టి బంధించి గలమా అని
గొర్రెపాటి తమ బందెలదొడ్లో
ఏ పథకాలతో బంధించాలా అని
రెప్ప వాలని చీకటి మాటున
ఎన్ని మంతనాలో!
ఎన్ని వలలో!!

(ఇంకావుంది)

వ్యాసం

# టర్కీ భూకంపం - పాక్ వరదలు - అమానవీయ పెట్టుబడిదారీ పద్ధతులు

- ప్రసన్న

**"ప్రకృతిపై** మానవ విజయాల కారణంగా మనల్ని మనం ఎక్కువగా ఉహించుకోవద్దు. అలాంటి ప్రతి విజయానికీ ప్రకృతి మనపై ప్రతీకారం తీర్చుకుంటుంది. ఇది నిజం. మొదట మనం ఊహించిన ఫలితాలనే ఇస్తుంది, కానీ ఆ తర్వాత, చాలా భిన్నమైన, ఊహించలేని నష్టాలను కూడా ఇస్తుంది. ఆ నష్టాలు చాలా సార్లు మొదట పొందిన ప్రయోజనాలను శూన్యం చేస్తాయి..... అందువల్ల, పరాయి ప్రజలను జయించిన వీరుడిలాగా, ప్రకృతి వెలుపల నిలబడిన వ్యక్తిలాగా మనం ఏ విధంగానూ ప్రకృతిపై ఆధిపత్యం వహించలేమని, మనం –మాంసం, రక్తం మరియు మెదడుతో సహా – ప్రకృతికి చెందినవారమని మరియు ప్రకృతిలో అంతర్భాగమనీ అడుగడుగునా గుర్తు చేయబడుతుంది. మరియు ప్రకృతి గురించిన మన పాండిత్యమంతా దాని ధర్మాలను అర్థం చేసుకుని, వాటిని సరిగా అన్వయించుకోగలగడం వరకే. కేవలం ఆ ప్రత్యేకత వల్ల మాత్రమే ఇతర జీవులన్నింటి కంటే మనకు ప్రకృతి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది." – ఫ్రెడరిక్ ఎంగెల్స్ **(కోతి నుండి మనిషిగా పరిణామంలో శ్రమ పాత్ర)**

మార్క్సిస్ట్ మహోపాధ్యాయులు చెప్పిన పై పాఠం ఇటీవల చాలా తరచుగా గుర్తు చేసుకోవాల్సిన పరిస్థితులు సహజంగానే తలెత్తుతున్నాయి. మానవ కల్పిత విపత్తులే కాక, ప్రకృతి సిద్ధమైన విపత్తులకు తగిన సంసిద్ధత లేకపోవడం వల్ల కూడా వేల సంఖ్యలో ప్రాణ నష్టం, లక్షల కోట్ల రూపాయల వనరుల నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది. గడచిన సంవత్సర కాలంలో సిరియా–టర్కీ సరిహద్దు భూకంపం, పాకిస్తాన్ వరదలు, పశ్చిమ యూరోప్ కరువు మొదలైనవన్నీ కూడా పాలకుల నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించుకున్న శ్రామిక ప్రజల సాక్షిగా మన నుండి హేతుబద్ధ కార్యాచరణను కోరుతున్నాయి.

ఆగ్నేయ టర్కీ, వాయువ్య సిరియాలను అతలాకుతలం చేసిన ప్రస్తుత భూకంపం 50 వేల ప్రాణాలను బలిగొనగా, లక్షకు పైగా భవనాలు ధ్వంసమై, 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. రిక్టర్ స్కేల్ పై 7.8 తీవ్రతను నమోదు చేసిన ఈ భూకంపం టర్కీలోని 11 రాష్ట్రాలను ప్రభావితం చేసింది. భూకంపం సంభవించిన 2 వారాల తర్వాత కూడా సహాయ చర్యలలో సజీవ క్షతగాత్రులు వెలుగులోకి వస్తున్నారు. బిడ్డల్ని కోల్పోయిన తల్లిదండ్రులూ, తల్లిదండ్రులను కోల్పోయిన బిడ్డల ఆక్రందనలతో ఈ ప్రాంతం హృదయ విదారకంగా తయారైంది. ఇలా లక్షల మందికి తమ కుటుంబ సభ్యులని దూరం చేసిన ఈ దురవస్థకు కారణం ప్రకృతి మాత్రమేనా? ఈ నష్టాన్ని మనం తగ్గించాలేమా?? పరిశీలిద్దాం...

టర్కీ దేశపు వాయువ్య ప్రాంతంలోని ఇజ్మిత్ నగరం చుట్టూ 1999లో సంభవించిన భూకంపం కారణంగా 17,000 మంది మరణించారు. ఆ తరువాత కఠినమైన భద్రతా ప్రమాణాలు తీసుకువచ్చారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం భూకంపం సంభవించే ప్రాంతాల్లోని నిర్మాణాల్లో గట్టి ఉక్కు కడ్డీలు, అధిక నాణ్యత గల కాంక్రీటు వాడాలి. భూకంపాల ప్రభావాన్ని సమర్థవంతంగా తట్టుకునేందుకు బలమైన స్తంభాలు, దూలాలు కూడా ఉండాలి. కానీ ఈ నిబంధనలను అమలు చేయడంలో మాత్రం శ్రద్ధ చూపలేదు.

మాలత్యా నగరంలోని ఒక భవనాన్ని పోయిన సంవత్సరం నిర్మించారు. ఆ భవనం ఫొటోలతో పాటు "కొత్తగా వచ్చిన భూకంప నిబంధనలకు అనుగుణంగా ఈ భవనాన్ని కట్టాం" అని రాసిన ప్రచార చిత్రాలు కూడా నాడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 'అత్యంత నాణ్యమైన' మెటీరియల్‌ను నిర్మాణంలో వాడామనీ, 'అత్యంత నైపుణ్యం' కలిగినవారు పనిచేశారని కూడా అందులో రాశారు. ప్రస్తుత భూకంపం వల్ల ఈ భవనం నేలకొరిగిన తర్వాత చాలామంది వ్యక్తులు నాటి ప్రకటన ఫొటోలు, వీడియోలను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశారు.

నిర్దేశించిన నిబంధనలు, ప్రమాణాల ప్రకారం భవనాల నిర్మాణం లేకపోయినా, కొంత రుసుము కట్టించుకొని నిర్మాణాలకు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేశారు. అలా అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించడం వల్ల భారీ భూకంపం సంభవించినప్పుడు నష్టం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చాలా కాలంగా హెచ్చరిస్తూనే ఉన్నారు. టర్కీ భూకంప జోన్‌లో గల 75,000 భవనాలను ఇలా క్రమబద్ధీకరించారని టర్కీలోని యూనియన్ ఆఫ్ ఛాంబర్స్ ఆఫ్ తుర్కిష్ ఇంజనీర్స్, ఆర్కిటెక్ట్స్ ఛాంబర్ ఆఫ్ సిటీ ప్లానర్స్ ఇస్తాంబుల్ హెడ్ పెలిన్ పనార్ గిరిత్లియోగ్లు వెల్లడించారు.

అంతేకాదు ఇటీవలి విపత్తుకు కొద్ది రోజుల ముందు కూడా మరొకసారి అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు ప్రతిపాదించిన కొత్త బిల్లు పార్లమెంట్ ఆమోదం కోసం వెళ్లినట్లు తుర్కిష్ మీడియా నివేదించింది. స్థానిక జియాలజిస్ట్ సెలాల్ సెంగోర్ ఈ ఏడాది ప్రారంభంలోనే దీని మీద స్పందిస్తూ, ఇలా అక్రమకట్టడాలను క్రమబద్ధీకరించడం క్రూరమైన నేరం అవుతుందన్నారు. 2020లో

పశ్చిమ ప్రావిన్స్ ఇజ్మీర్‌లో ఘోరమైన భూకంపం సంభవించిన తరువాత, ఇజ్మీర్‌లోని 6,72,000 భవనాలు ఇటీవలే చట్టబద్ధత పొందాయని బీబీసీ టర్కిష్ నివేదిక వెల్లడించింది. ఇదే నివేదిక 2018లో పర్యావరణ, పట్టణీకరణ మంత్రిత్వ శాఖను ఉటంకిస్తూ టర్కీలోని 50 శాతం భవనాలు (దాదాపు కోటికి పైగా భవనాలు) నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణమయ్యాయని తెలిపింది.

"దురదృష్టవశాత్తు టర్కీ మరియు సిరియాలలో మౌలిక వసతులు సరిగా లేవు. కాబట్టి ప్రాణాలను కాపాడటం అనేది కష్టం అవుతుంది. బాధితులను కాపాడడానికి విపత్తు జరిగిన తర్వాతి 24 గంటలు చాలా కీలకం. 48 గంటల తర్వాత ప్రాణాలతో బయటపడేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది" అని నిపుణులు చెబుతున్నారు.

ఇదీ సంగతి. అక్రమ కట్టడాలను కాసుల కక్కుర్తితో క్రమబద్ధీకరించడమే కాక, సరైన మౌలిక వసతులు కూడా లేకపోవడం వల్లే మరణాలు ఇంత ఎక్కువ సంఖ్యలో నమోదయ్యాయనేది స్పష్టం. జోరుగా సహాయ చర్యలు కొనసాగుతున్నాయని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ ప్రకటించినప్పటికీ, సహాయక బృందాలు రాలేదనీ, కళ్ళ ముందే తమ వాళ్ళు కన్ను మూస్తున్నారనీ స్థానికులు ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1990 నాటి భారీ భూకంపం సాకుతో టర్కీ పాలకులు జనం పై భూకంపం పన్ను(?) విధించారు. నాటి నుండి నేటి వరకు 3 దశాబ్దాలుగా ఈ పేరుతో (మన కరెన్సీలో చెప్పాలంటే) 40 వేల కోట్ల రూపాయలు ($8^1/_2$ కోట్ల) జనం ముక్కు పిండి వసూలు చేశారు. భౌగోళికంగా తీవ్ర భూకంపం వచ్చే అవకాశం ఉన్న ప్రాంతంలో ఉన్న టర్కీ ఈ డబ్బుతో ఇలాంటి విపత్తులను ఎదుర్కొనేందుకు సర్వ సన్నద్ధంగా ఉండవచ్చు. నిర్మాణ రంగంలోనూ, జీవన శైలి లోనూ తగిన మార్పులు ప్రవేశపెట్టవచ్చు. ఆధునిక హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ ఈ సొమ్మును కూడా అన్ని దేశాల పాలకులలాగే వీరు కూడా దారి మళ్ళించారు. ఫలితంగా నేడు సహాయక చర్యలు నత్తనడకన సాగుతున్నాయి. నివారించదగిన మరణాలు వేల సంఖ్యలో నమోదౌతున్నాయి. గత రెండు దశాబ్దాలుగా దేశాధ్యక్షునిగా, ప్రధానిగా అధికారం చెలాయిస్తున్న ఎర్డోగాన్ ఈ పాలనా తప్పిదాలకు బాధ్యతపడాలి.

2011 నుండి అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న సిరియా ప్రజల పరిస్థితి ప్రస్తుత భూకంపం తర్వాత పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టైంది. ఈ భూకంప ప్రభావిత ప్రాంతం మొత్తం తిరుగుబాటుదారుల అధీనంలో ఉండగా అసద్ ప్రభుత్వం సహాయ చర్యల విషయంలో కంటితుడుపు చర్యలకు మాత్రమే పరిమితం అయింది.

త్వరలో ఈ ప్రాంతంలో అతి తీవ్ర భూకంపం రానున్నట్టు డచ్ శాస్త్రవేత్త ఒకరు 3 రోజుల ముందుగానే ట్విట్టర్ ద్వారా హెచ్చరించినట్టు కూడా వార్తలు వస్తున్నాయి. అయినా స్థానిక పాలకులు స్పందించక పోవడం సొంత ప్రజలపై జాతిహననానికి పాల్పడటం కంటే తక్కువేమీ కాదు.

06/2022 నుండి 10/2022 వరకు పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్, సింద్, ఖైబర్ ఫఖ్తూన్ ఖ్వా, పాక్ ఆక్రమిత (ఆజాద్) కాశ్మీర్‌లను ముంపుకు గురిచేసి దాదాపు 1800 మంది మరణానికి, 3.2 లక్షల కోట్ల రూపాయల ఆస్థి నష్టానికి కారణమైన వరదలు కూడా మానవ కల్పిత విపత్తు మాత్రమే. అపరిమిత పారిశ్రామిక శిలాజ ఇంధన వినియోగంతో భూతాపం పెరిగి హిమనీ నదాలు కరగడం వల్ల తీవ్ర వరదలు సంభవించి పాకిస్తాన్ ప్రజలు 1800 మంది ప్రాణాలు విడవాల్సి వచ్చింది. 2022లో ఇలాంటి వరదల వల్ల ఆఫ్రికాలో 2100 మంది (వారిలో 647 మంది చిన్నారులు), ఇండో-బంగ్లా వరదల్లో 300 మంది, అస్సాం లోని సిల్చార్ లో 250మంది, అమర్నాథ్‌లో 56 మంది అసువులు బాశారు. ఈ ప్రాణ నష్టానికి పెట్టుబడిదారీ అత్యాశ ఎలా కారణమైందో పరిశీలిద్దాం.

ఒకవైపు పరిశ్రమలు వెలువరించే కాలుష్యం, మరోవైపు ఖనిజాలు – భారీ ప్రాజెక్టుల కోసం అడవుల నరికివేతల కారణంగా వాతావరణం వేడెక్కడం, దానివల్ల ధృవ ప్రాంతాలలో మంచు కరిగి వరదలు పెరుగుతాయని మనకందరికీ తెలిసిన విషయమే. తమ లాభార్జనకు అనుకూలమైన చట్టాలు చేయించుకోవడం, అవసరమైతే వాటిని కూడా తుంగలో తొక్కి తన రక్త దాహం తీర్చుకోవడం, పెట్టుబడి యొక్క సహజ లక్షణం. మార్క్స్ చెప్పినట్లు సమస్త భౌతిక సంపదలకు తల్లి ప్రకృతి కాగా, తండ్రి మానవ శ్రమ. కాబట్టి లాభాల కోసం మానవ శ్రమతోపాటు ప్రకృతిని కూడా కొల్లగొట్టడం పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క స్వాభావిక లక్షణం. ప్రపంచపు మొత్తం కర్బన ఉద్గారాలలో 71 శాతాన్ని, ప్రపంచపు అతిపెద్ద 100 బహుళజాతి కార్పోరేషన్లు విడుదల చేస్తున్నాయి. 18వ శతాబ్ది నుండి ఇప్పటివరకు విడుదలైన కాలుష్యంలో 50 శాతం ఉత్తర అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా ఖండాల నుండే విడుదలైంది. అందునా.... మొత్తం యూరప్‌ను మించి అమెరికా కాలుష్యాన్ని ప్రపంచం మీద వెదజల్లి తన తరహా అభివృద్ధిని సాధించింది.

ఈ విధంగా కాలుష్యకారక చర్యల ద్వారా లబ్ధిని అమెరికన్, యురోపియన్ సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు అనుభవిస్తుండగా, దుష్ప్రభావాలను మాత్రం శ్రామిక ప్రజలు, ముఖ్యంగా మూడవ ప్రపంచదేశాలు మొయ్యాల్సి వస్తోంది. కర్బన ఉద్గారాలకు ప్రధాన ఆధారమైన శిలాజ ఇంధనాల వ్యాపారంలో సౌదీ ఆరాం కో., పెట్రో చైనా, మొబిల్, షెల్ తదితర బడా కార్పోరేషన్లు రోజుకు రెండు వేల కోట్ల రూపాయల చొప్పున గత 5 దశాబ్దాలలో 40,00,00,000 (40 కోట్ల) కోట్ల రూపాయల లాభాలు పోగేసుకున్నాయి. ఆ డబ్బుతో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల ప్రభుత్వాలను, వ్యవస్థలను శాసిస్తూ యధేచ్ఛగా వనరుల దోపిడీ, విధ్వంసం సాగిస్తున్నాయి. చౌకగా, కాలుష్య రహితంగా ఉత్పత్తయ్యే సౌర, జల విద్యుత్తును కాదని, ప్రమాదకరమైన అణువిద్యుత్తును కేవలం తమ లాభాల కోసం ప్రోత్సహిస్తున్నారు.

భూతాపం వల్ల ఏర్పడిన వడగాడ్పుల మూలంగా పశ్చిమ యూరప్ మొత్తాన్ని గత 500సంవత్సరాలలోనే అతి తీవ్రమైన కరువు 2022లో చుట్టుముట్టింది. గత సంవత్సరం ఈ ప్రాంతంలో వర్షాలు లేక జల విద్యుదుత్పత్తి నిలిచిపోవడమేకాక, అణువిద్యుత్తు కేంద్రాలలో శీతలీకరణ ప్రక్రియ స్థంబించి, వాటి భద్రత ప్రమాదంలో పడింది. అరణ్యాలలో కార్చిచ్చు ప్రబలి జంతు, వృక్ష వైవిధ్యం దెబ్బతింది.

పర్యావరణ పరిరక్షణ అనేది జీవ కారుణ్య కార్యక్రమం కాదనీ, భూగోళం మీద మానవ జాతి మనుగడ సాగించాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ, అభివృద్ధి సాధించాలనీ పర్యావరణ శాస్త్రవేత్తలు నెత్తీ నోరూ కొట్టుకుంటున్నా, తమ లాభాలు తప్ప మరేమీ చెవికెక్కని పెట్టుబడిదారీవర్గాలు శ్రామికవర్గపు శ్రమను, దానితోపాటు ప్రకృతి వనరులను విచ్చలవిడిగా దోచుకుంటూ మానవజాతి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నారు.

శిలాజ ఇంధనాల అతి వినియోగం, పర్యావరణ-సహజ వనరుల విధ్వంసం ద్వారా ధనిక దేశాలుగా ఎదిగిన సామ్రాజ్యవాద దేశాలు పేద దేశాల పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు కూడా నిధులు సమకూర్చాలి. అందుకోసం 3వ ప్రపంచ దేశాలు ఐక్యంగా సామ్రాజ్యవాద దేశాలపై ఒత్తిడి తేవాలి. లేకుంటే సామ్రాజ్యవాద దేశాల, బడా కార్పోరేట్ల కనుసన్నలలో, వారి నిధులతో నిర్వహించే ఆర్భాటపు సమావేశాలు, సభలు ప్రహసనంగానే మిగిలిపోతాయి.

రోజురోజుకీ తీవ్రమౌతున్న పర్యావరణ విధ్వంసం,అందువల్ల తలెత్తుతున్న ప్రకృతి వైపరీత్యాల నుండి గట్టెక్కాలంటే, వ్యక్తిగత ఆస్తులను పోగేసుకోవడమే పరమావధిగా భావించే నేటి వ్యవస్థ స్థానంలో మొత్తం మానవజాతి ప్రయోజనాలకు, భవిష్యత్తు తరాల సంక్షేమానికి బాధ్యత వహించే సామ్యవాద వ్యవస్థను సాధించుకోవాలి. అందుకోసం పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలు సామ్యవాద వ్యవస్థ స్థాపన కోసం సాగుతున్న పోరాటాలతో మమేకం కావాలి.

## ప్రముఖ తెలంగాణా గజల్ కవయిత్రి - ఉపాధ్యాయిని భైరి ఇందిర మృతి



**ప్రముఖ** గజల్ కవయిత్రి, ఉపాధ్యాయిని, దక్కన్ గజల్ అకాడమీ స్థాపకురాలు భైరి ఇందిర 2023 ఫిబ్రవరి 19న కేన్సర్‌తో 60వ యేట మృతిచెందారు. ఆమె 1962 జూలై 7న నేటి తెలంగాణారాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందులో పుట్టారు.

తండ్రి రామ్మూర్తి. తల్లి వెంకటరమణ. ఇందిర ఎం.ఏ., బి.ఈడీ, ఎం.ఫిల్ చదివారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇల్లెందు, కొత్తగూడెం, కారేపల్లి, తదితర ప్రాంతాల్లో పలు ప్రైవేటు, ప్రభుత్వ బడుల్లో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయినిగా, ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. ప్రభుత్వ ఉద్యోగానికి ముందు శాంతినికేతన్ అనే ప్రైవేటు బడిలో ఉపాధ్యాయినిగా పనిచేశారు. 1980లో రామశంకరయ్యతో వివాహం జరిగింది. భర్త సింగరేణి ఉద్యోగి. ఇందుసాగర్, రఘురాం, హిమజారామం వారి సంతానం.

బాల్యంలో తండ్రి ప్రోత్సాహంతో, సాహిత్య అధ్యయనం చేశారు ఇందిర. ఆ క్రమంలోనే కవిత్వం రాయడం కూడా ప్రారంభమయ్యింది. ఆమె తొలి కవిత తాను 9వ తరగతిలో వుండగా రాసిన "ఉక్కు పిడికిళ్ళు". ఉద్యోగంలోకి చేరాక – పూర్తిస్థాయిలో సాహిత్యంలో నిమగ్నమయ్యింది. హైకూ, మినీ కవిత్వం, నానీలు, వచనకవిత, గజల్, గేయం, పాట, అనువాదం, మొదలైన సాహితీ ప్రక్రియల్లోనేకాక, పరిశోధనారంగంలో కూడా కృషిచేశారు.

## ప్రముఖ కథారచయిత భమిడిపాటి జగన్నాథరావు మృతి



**ప్రముఖ** కథారచయిత భమిడిపాటి జగన్నాథరావు 2023 ఫిబ్రవరి 6న తన 89వ యేట హైదరాబాద్‌లో చనిపోయారు. అతని సొంతూరు కృష్ణాజిల్లా గుడివాడ. 1934 డిసెంబరు 1న పుట్టారు.

ప్రజాపాలనా విషయంలో నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ. పట్టా పొందారు. తెలుగు కథా ప్రపంచంలో తనదైన స్థానాన్ని సంపాదించుకున్న జగన్నాథరావు వృత్తిరీత్యా – ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖలో సంయుక్త సంచాలకులుగానూ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ప్రెస్ కార్యదర్శిగానూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. 'ప్రజాసాహితి' పాఠకులు.

ప్రవృత్తిరీత్యా అతని ప్రపంచం కథాప్రపంచం, చలం, పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబులు అతని అభిమాన రచయితలు.

రాసిన కథలు రాసిలో కొంచెమైనా, వాసిలో ప్రసిద్ధిపొందాయి. 'పరస్పరం', 'మువ్వలు', 'అడుగుజాడలు' – అనే మూడు కథాసంపుటాలుగా అవి తెలుగు పాఠకులకు అందుబాటులో వున్నాయి. త్రిపుర (ప్రముఖ కథారచయిత) స్ఫూర్తి వున్న భమిడిపాటి జగన్నాథరావు – 'త్రిపుర ఓ జ్ఞాపకం' అనే పుస్తకానికి అత్తలూరి నరసింహారావు, కె.కె. రామయ్యలతోపాటు సంపాదకత్వం నిర్వహించారు.

ప్రముఖ తెలుగు పత్రికల్లో అతని కథలు ప్రచురితమయ్యాయి.

వ్యాసం

# ఉరికంబం సాక్షిగా సెక్యులరిస్టు-భగత్‌సింగ్

- దివికుమార్

***"భరతమాత బిడ్డలం / భగత్‌సింగ్ తమ్ములం" అంటూ హిందూమతోన్మాదసంస్థ ఆర్.ఎస్.ఎస్. అనుచరగణమైన అఖిలభారత విద్యార్థి పరిషత్ వారు గోడలమీద రాస్తూంటారు. తమ రాతల్లో కొద్దిపాటి నిజాయితీ వారికున్నా భగత్‌సింగ్ రచనలు పాఠ్యగ్రంథాల్లో చేర్చాలని డిమాండ్‌చేసి వుండేవాళ్ళు. కనీసం బి.జె.పి. పాలిత రాష్ట్రాల్లోనయినా పెట్టించే వాళ్లు. తెలుగులో "నా నెత్తురు వృధాకాదు"గా వెలువడ్డ భగత్‌సింగ్ రచనల పుస్తకాన్ని తమ పత్రికల్లో పరిచయం చేయించి వుండేవాళ్ళు.***

ఆయన రచనలు చదివిన ప్రతి ఒక్కరికీ భగత్‌సింగ్ మతోన్మాద వ్యతిరేకిగా, సెక్యులర్ ప్రజాస్వామ్య విప్లవవాదిగా అర్థమవుతాడు.

మురుగుకి సుగంధమని పేరుపెట్టి "చూశారా ఎంత కంపు గొడుతుందో" అని ఇల్లెక్కి కూసేవాడిలాగా హిందూ మతోన్మాదులు కాంగ్రెసుమార్కు కుల, మత, ప్రాంతీయ, భాషాతత్వపు పెత్తందారీ పరిపాలననే సెక్యులర్, ప్రజాస్వామ్యంగా ప్రచారంచేస్తూ.... సెక్యులరిజమంటేనే బూతుగా వెక్కిరిస్తున్నారు. దానికి ప్రత్యామ్నయంగా 'హిందూ పాకిస్తాన్'ను ఏర్పాటు చెయ్యాలని పాకులాడుతున్నారు.

బ్రిటీషువారిని పారదోలిన తర్వాత భారతదేశం ఎలా వుండాలి? ఏఏ వర్గాలు అధికారం చెలాయించాలి? భారతీయులందరూ ఒకే జీవన విధానం కలిగివున్నారా? అనే దానికిపడ్డ సంఘర్షణల ఫలితంగా ఆవిర్భవించిందే పాకిస్తాన్. పాకిస్తాన్ ఏర్పడటానికి ఆధ్యాత్మిక సమస్యలేమీ కారణం కాదు. కేవలం లౌకిక జీవితసమస్యలే దానికి మూలం. మెజారిటీగా వున్న హిందువుల్లోని పెట్టుబడిదారీ భూస్వామ్య శక్తులు, రాజకీయాధికారంలో ప్రధానపాత్ర నిర్వహిస్తుంటే, విద్య ఉన్నతాధికారాల్లో కూడా వారి ఆధిపత్యమే కొనసాగుతూంటే - ముస్లిం భూస్వామ్య, పెట్టుబడిదారీ, వ్యాపార, నిరంకుశాధికార వర్గాలకి తగు అవకాశాలు లేకుండా పోతాయన్న భౌతిక జీవితసమస్యలకు మతాన్ని జోడించగా వచ్చిన జవాబే పాకిస్తాన్. హిందూ దోపిడీవర్గాల పోటీలేకుండా ముస్లిం పేద ప్రజానీకాన్ని దోపిడీ చేయటానికి గుత్తాధికారం పుచ్చుకొనటానికిగాను పాకిస్తాన్ ఏర్పాటు చేసుకున్నారు. ఇంకొక 20 కోట్లమంది ప్రజానీకాన్ని దోపిడీచేయలేక పోయామే అన్నదే భారత దోపిడీ వర్గాల 'ఆవేదన' (దేశభక్తి) అంతా! ఉపఖండంలోని ప్రజానీకానికి సామ్రాజ్యవాద దోపిడీ నుండి స్వతంత్రమూ లభించలేదు, భూస్వామ్య పెట్టుబడిదారీ శక్తుల పీడన నుండి వారు స్వేచ్ఛా పొందలేదు. వర్ణకుల వ్యవస్థల పీడననుండి విముక్తి సాధించలేదు. అందుకే 'స్వతంత్ర భారతం' ఎలా వుండాలో భగత్‌సింగ్ "భారత జాతీయ విముక్తి పోరాట దిశలు" అన్న తన వ్యాసంలో యిలా రాశాడు. "భారతదేశంలో మేం ఆశించేది ఒక్కటే– అదేమిటంటే సామ్రాజ్యవాదుల, దోపిడీ ఆర్థికవ్యవస్థ అనే ముళ్ళకంచె మీద కూర్చున్న వారి స్వదేశీ ఆశ్రితులస్థానే - భారతీయ శ్రామికవర్గ ఆధిపత్యం! ఇంతకి మినహా మరింకేమీ అక్కర్లేదు. తెల్ల బద్మాష్‌ల పరిపాలనని అంతమొందించి, నల్ల బద్మాష్‌ల పరిపాలనని భరించడానికి, ఎన్నడూ ఒప్పుకోం. ఈవిధంగా పరిపాలన చేయడానికి, స్వప్రయోజనాల సమానత ప్రాతిపదికగా ఒక కూటమిని ఏర్పాటు చేసుకున్నారు నల్లబద్మాష్‌లు" ***('నా నెత్తురు వృధాకాదు'-50వ పేజీ).***

భగత్‌సింగ్ పేర్కొన్న నల్లబద్మాష్‌ల మధ్యగల పోటీవల్లే దేశం రెండు ముక్కలయింది. దేశవిభజనకి సామ్రాజ్యవాదానికి లొంగిన స్వార్థపర దోపిడీ పాలకవర్గ గ్రూపులే కారణం.

ఈ రోజున మతానికీ, రాజకీయాలకి వుండవలసిన సంబంధమేమిటని తీవ్రచర్చ జరుగుతోంది. స్వాతంత్ర్యోద్యమ సమస్యలకు ఇంకా నిజమైన పరిష్కారాలు లభించలేదు కనకే మత ఘర్షణలు కూడా పెట్రేగిపోతున్నాయి. మతానికీ రాజకీయాలకీ సంబంధం వుండకూడదనే వారిని వెక్కిరించే మతోన్మాదులకి 65 సం॥ల క్రితమే భగత్‌సింగ్ జవాబిచ్చాడు. "మతకలహాలూ –వాటి నివారణోపాయమూ" అన్న వ్యాసంలో "1914–15 నాటి అమరవీరులు, మతం నుంచి రాజకీయాల్ని వేరుచేశారు. మతం మనిషి వ్యక్తిగత విషయమనీ, అందులో మరొకరు జోక్యం చేసుకోరాదని చెప్పాలి. రాజకీయాల్లోకి సహితం మతం దూరరాదు. ఎందుకంటే యిది స్థిమితంగా కలసి కట్టుగా ఒకచోట కూచోని పనిచేయనివ్వదు.... మతాన్ని వేరుచేసిన పక్షంలో రాజకీయ రంగంలో మనమంతా ఐక్యం కావచ్చు. మన మతాలు వేర్వేరుగా వున్నా ఫర్వాలేదు".

గత 45 సంవత్సరాల కాంగ్రెసు మార్కు పరిపాలనలో రాజకీయాధికారానికీ, వ్యాపారాలకీ, కుల, మత, ప్రాంతీయ భాషాతత్వాల్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్నారు. అణగారిపోతోన్న అత్యధిక శ్రామిక ప్రజానీకం సంఘటితమై అభివృద్ధి ఫలితాలలో వాటాకై నిగ్గదీస్తుంటే భరించలేని దోపిడీ పెత్తందారీ శక్తులు మతోన్మాదం రూపంలో ఫాసిజాన్ని అమలుజరిపి ప్రజల్ని అణచివేయాలని చూస్తున్నాయి. మతోన్మాదం దోపిడీశక్తుల చేతుల్లో త్రిశూలమవుతోందని భగత్‌సింగ్ బృందం గ్రహించారు కనుకనే దాన్ని రాజకీయాలకి దూరంగా వుంచాలని కోరారు.

"భగవంతుడూ - మతం" వ్యాసంలో "అన్ని కాలాల్లోనూ స్వార్థపరులూ, పెట్టుబడిదారులూ మతాన్ని తమ స్వార్థప్రయోజనాల కోసం వుపయోగించుకున్నారని మేం చెబుతున్నాం. చరిత్ర యిందుకు సాక్షి" అని ఆయన స్పష్టంచేశాడు. ***(పేజీ 166)***

ఈనాటికీ అది పరమ సత్యంగా మన కళ్ళెదురుగా సాక్షాత్కరిస్తోంది.

హిందూమతోన్మాదులు మరుగుపరచాలని చూస్తున్న అనేక సమస్యల్లో దళిత సమస్య ఒకటి. వర్ణ, కులవ్యవస్థా దాని సంస్కృతి, పునాదుల్లో ఒకటి హిందూమతం. దీన్ని కప్పిపుచ్చాలని కపట నాటకీయంగా వాళ్లు ప్రవర్తిస్తున్నారు. "మానవులంతా సమానమే. పుట్టుకతోగానీ పనివిభజన వల్లగానీ ఎవరూ భిన్నంగా పుట్టలేదు". "మన పూర్వులయిన ఆర్యులు, అస్పృశ్యుల యెడల చాలా అన్యాయంగా ప్రవర్తించారు. నీచులని చీదరించుకున్నారు. నికృష్టమైన పనులకు వారిని బలవంతంగా వినియోగించారు.... ఇది నువ్వు పూర్వజన్మలో చేసుకున్న పాపాలకి ఫలితం అన్నారు. ***("నా నెత్తురు...." పేజీ 153)***


ఈనాటి దళిత సమస్య యొక్క మూలం గతంలోని మత నియమాల్లో వుంది. మనుధర్మశాస్త్రంలో వుంది. భారతీయ ఫ్యూడల్ వ్యవస్థయొక్క కరడుగట్టిన సాంఘిక రూపమైన వర్ణ కులవ్యవస్థలో వుంది. దీన్ని అంతం చేయడానికి భగత్‌సింగ్ దళితులకి "సంఘటితపడితేనే తప్ప అస్పృశ్యజాతికి విమోచనం లేదు" అంటూ "మీరు మరొకరికి పావుగా మారకండి. వారి మొహాలకేసి (నిస్సహాయంగా) చూడకండి. బ్యూరోక్రాట్ల మోసంలో పడకండి. వాళ్ళు మీకు చేసే సహాయం ఏమీ వుండదు సరికదా మీదుమిక్కిలి మిమ్మల్ని పావులుగా వాడుకోవాలని చూస్తారు. మీ ఈ బానిసత్వానికీ, పేదరికానికీ మూలకారణం ఈ పెట్టుబడిదారీ బ్యూరోక్రసీయే. అందువల్ల వాళ్ళతో ఎన్నడూ మీరు చేతులు కలపకండి.. లేవండి-నేటి వ్యవస్థమీద తిరగబడండి. అతి నెమ్మదిగా జరిగే సంస్కరణలవల్ల ఏమీ ప్రయోజనంలేదు. సాంఘికోద్యమాన్ని లేవదీసి, విప్లవం తీసుకురండి. రాజకీయార్థిక విప్లవాలకోసం సమాయత్తం కండి. మీరే దేశానికి పట్టుగొమ్మలు. నిజమైనశక్తి మీరే. నిదురిస్తున్న సింహాల్లారా లేవండి. తిరుగుబాటు చేయండి". *(పేజీ. 157)* వలస అర్ధఫ్యూడల్ రాజకీయార్థిక వ్యవస్థతో, దాని పెత్తందారీ సంస్కృతితో తలపడకుండా, వాటిని నిరంకుశంగా అమలుపరుస్తున్న రాజ్యం' (స్టేట్)పై పోరాడకుండా మెజారిటీ దళితుల జీవితంలో మౌలికమైన మార్పు రాదు. సంస్కరణవాద ఊబిలో కూరుకుపోయినా, కాంగ్రెసు మార్కు నయవంచకుల పంచన చేరినా దళితుల విముక్తి దుస్సాధ్యమవుతుందని 1928లోనే భగత్‌సింగ్ స్పష్టంచేశాడు. తదనంతరపు అనుభవాల వెలుగులో ఆయన పరిశీలనే నిజమని రుజువయింది.

హిందూమతోన్మాదులకు భగత్‌సింగ్ పేరుని ఉచ్చరించటానికి కూడా అర్హత లేనంత స్పష్టంగా "నేనెందుకు నాస్తికుడను" అనే వ్యాసంలో రాశాడు.

"విగ్రహారాధననీ, సంకుచిత వైఖరినీ సమాజం లోగడ ఎలా ఎదురించి పోరాడిందో అలా ఈ దైవ నమ్మకాన్నీ ఎదురించి పోరాడాల్సి వుంది. తన కాళ్ళమీద తాను నిలవాలనుకున్న మనిషి మతవిశ్వాసాన్ని తోసివెయ్యాలి. దేవుణ్ని నమ్మటం, రోజూ ప్రార్థనలు చెయ్యటం, ఇవి పరమనీచమైన స్వార్థబుద్ధితో మానవుణ్ని తక్కువ చేసేవని నాకనిపిస్తుంది." ***(పేజీ 122)***

భగత్‌సింగ్ దృష్టిలో సామ్రాజ్యవాదాన్ని ఓడించటం, భూస్వామ్య పెట్టుబడిదారీ దోపిడీ అంతంచేయటం, వర్ణకుల వ్యవస్థల్ని నిర్మూలించటం, మతోన్మాదాన్ని ఎదిరించటం.. విప్లవంలో భాగాలు. సెక్యులర్ ప్రజాస్వామ్య విధానాల్ని అమలుపర్చటం, సోషలిజాన్ని నిర్మించటం ఆయన లక్ష్యాలు. అందుకే తమ సంస్థకి హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్‌గా పేరు పెట్టుకున్నాడు. ఆయన లక్ష్యాన్ని సాధించే కర్తవ్యాన్ని ఉరికంబం సాక్షిగా ప్రతి మార్చి 23 గుర్తుచేస్తూ వుంటుంది.

**- ప్రజాసాహితి, మార్చి 1993**



# చైతన్యవాహిని

## 'ప్రజాసాహితి' పత్రిక ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు జీవన సహచరి

# సుధాబాల సంస్మరణ సభ

కొత్తపల్లి రవిబాబు జీవన సహచరి సుధాబాల 2023 జనవరి 31న తన 76 ఏట మరణించారు. ఆమెను స్మరించుకుంటూ ఫిబ్రవరి 5న జరిగిన సభకు ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సంస్థ ప్రధాన కార్యదర్శి వి. హనుమంతరావు అధ్యక్షత వహించారు. జనసాహితి రాష్ట్ర అధ్యక్షులు దివికుమార్ మాట్లాడుతూ – సంప్రదాయం పేరుతోనో, సనాతనత్వం పేరుతోనో ఒకనాటి లౌకిక విలువలకి తిలోదకాలు ఇచ్చేసి, తిరిగి మూఢవిశ్వాసాల కౌగిలిలోకి వెళ్ళిపోతున్న రోజుల్లో ప్రగతిశీలమైనటువంటి మార్పు, ప్రత్యామ్నాయ సంస్కృతి యొక్క రూపాలు ఎలా ఉండాలో.. సుధాబాల ఆచరించారన్నారు. ఆమె అంతిమయాత్ర ఎలాంటి కర్మకాండలు, మంత్రతంత్రాలు లేకుండా, వారి శరీరాన్ని, కళ్ళను ఇతరులకు సహాయపడేటట్టు చేశారు అని గుర్తు చేశారు. మరొక ఇద్దరు ఆమె కళ్ళతో ఇప్పుడు ప్రపంచాన్ని చూస్తున్నారు అని చెప్పారు. మానవ సంబంధమైనటువంటి ఆత్మీయతని, అనుబంధాలని ఈ సభలో తలుచుకుందాం అన్నారు. సుధాబాల పుట్టి పెరిగిన పరిస్థితులను విశ్లేషిస్తూ, అది అభ్యుదయ కాలాల సంఘర్షణ అని గుర్తుచేసారు. ఆర్థిక రాజకీయ సాంస్కృతిక గుత్తాధిపత్యానికి – వెరసి, పెత్తందారీతనానికి వ్యతిరేకంగా జరిగిన అనేక పోరాటాల నేపథ్యంలో సుధాబాల పుట్టి పెరిగారన్న విషయాన్ని చారిత్రక ఉదాహరణలతో విశ్లేషించారు. సుధాబాల పుట్టిన సంవత్సరమే, ఆర్యసమాజం తరఫున ఒక మహిళా సంఘం తొలిసారిగా ఆమె స్వగ్రామం అయిన కూచిపూడిలో ఏర్పడిందని గుర్తుచేశారు. ఆ విధంగా సుధాబాల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన చారిత్రక సామాజిక సాంస్కృతిక రాజకీయ ఆర్థిక పరిణామాల క్రమాన్ని విశ్లేషించారు. జనసాహితి తరపున ఆమెకు జోహార్లు తెలిపారు.

స్త్రీ విముక్తి సంఘటన అధ్యక్షులు చల్లపల్లి విజయ మాట్లాడుతూ.. సుధాబాలగారికి తాము పొరుగువాళ్లమని, 'ప్రజాసాహితి' భవనం కట్టాక – విజయవాడలో రవిబాబు కుటుంబం ఒక అంతస్తులో ఉంటే, తాము మరో అంతస్తులో ఉన్నామనీ అలా 2012 నుండి వాళ్లు తెనాలికి నివాసాన్ని బదిలీ చేసుకునేంతవరకు.... ఒకే దగ్గర కలసిమెలసి ఉన్నాం అంటూ సుధాబాలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తాను ఆమె కన్నా ఎంతో చిన్నదాన్ని అయినా, ఆమె తనను మీరు అనే పలకరించేవారని ఆమె సంస్కారాన్ని గుర్తు చేశారు. సుధాబాలగారి కుటుంబ నేపథ్యంలోకి వెళితే, ఆమె తాతగారు (మాతామహులు) మునసబుగా ఉద్యోగం చేసేవారు. ఆమె మేనమామలు కూడా మునసబులుగా, ఆ కాలంలోనే ఇంజనీర్లుగాను పెద్దపెద్ద హోదాలలో పనిచేసేవారని తెలిపారు. రవిబాబు కుటుంబ నేపథ్యం జాతీయ ఉద్యమంలో పాల్గొన్న చరిత్ర కలిగినదని, ఆ విధంగా సుధాబాల గుణాత్మక దర్పంతో ఉండేవారని ఆమె ఎప్పుడూ ఎవరిని చిన్నచూపు చూడలేదని అంటూ సుధాబాలగారి వ్యక్తిత్వాన్ని కొనియాడుతూ, హృదయపూర్వక నివాళి అర్పించారు.

'స్త్రీ సంఘటన' పత్రిక సంపాదకులు లక్ష్మి సంస్మరణ సభలో మాట్లాడుతూ స్త్రీ విముక్తి సంఘటన తరుపున జోహార్లు అర్పించారు. సుధా ఆంటీతో తమ మహిళా సంఘం కార్యకర్తలకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'ప్రజాసాహితి' కార్యాలయంలో పక్కనే తమ మహిళా సంఘం కార్యాలయం కూడా ఉండడం వల్ల, సుధా ఆంటీతో తమకు చాలా దగ్గర ఆత్మీయ అనుబంధం ఏర్పడిందని వివరించారు. "ఉద్యమాలలో మీరు నిజంగా సంతోషంగా ఉన్నారా అంటూ" ప్రేమగా అడిగేవాళ్ళనీ, తాము సుధాఆంటీతో హృదయ పూర్వకంగా మాట్లాడేవాళ్ళమనీ, తమ ఉద్యమ సంతోషాన్ని ఆమెతో పంచుకునేవాళ్ళమనీ గుర్తుచేసుకున్నారు. ప్రజాసాహిత్య ఉద్యమ క్రమం మొత్తంలో రవిబాబుగారికి సుధాఆంటీ తోడ్పాటు, అండగా నిలబడ్డ తీరు చాలా దగ్గరగా చూసామని లక్ష్మి చెప్పారు. స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉద్యమ కార్యాచరణలో ఉండాలంటే – జీవిత భాగస్వామి యొక్క సహకారం, తోడ్పాటు చాలా అవసరం. ఆ విధంగా సుధా ఆంటీ రవిబాబుగారికి అందించిన తోడ్పాటు చాలా గొప్పది అంటూ కుటుంబపరంగా ఎన్ని కష్టనష్టాలు వచ్చినా ఆమె చివరికంటా దిటవు గుండెతో నిలబడ్డారని లక్ష్మి అన్నారు.

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ – నగరం కళాశాలలో తాము విద్యార్థులుగా ఉన్న కాలంలో రవిబాబుగారి కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యాన్నీ అందులో భాగంగా చర్చించిన ఎన్నో రాజకీయ విషయాలను గుర్తు చేసుకున్నారు. రవిబాబుగారికి ఆయన భార్య ఇచ్చిన సహకారాన్ని దగ్గరగా చూసిన అనుభవాలను సభలో పంచుకున్నారు. వీరి మొదటి సంతానం సృజన్ మానసిక అనారోగ్యానికి గురైనా, అతనిని జాగ్రత్తగా చూసుకుంటూ, రవిబాబుగారు సాహిత్య సాంస్కృతిక రంగాలలో నిబద్ధతతో, నిమగ్నమై ఇప్పటికీ కృషి చేస్తున్నారు అంటే అదంతా సుధాబాలగారి తోడ్పాటు అని చెప్పక తప్పదు అన్నారు.

రవిబాబుగారి తమ్ముడు గురుబాబు మాట్లాడుతూ వారి వదిన సుధాబాల తమను కన్నబిడ్డల్లా సాకిందన్నారు. నలుగురు అన్నదమ్ములు ఇద్దరు అక్కచెల్లెళ్ళు ఉన్న తమ కుటుంబంలో సుధాబాల బాధ్యతా యుతంగా లౌక్యంగా అందర్నీ కలసికట్టుగా నడిపించిన తీరును గుర్తుచేసుకున్నారు.

'కార్మికనగారా' సంపాదకులు ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ రవిబాబుగారు సాహిత్య, సాంస్కృతిక రంగాలలో - కుటుంబ సంబంధాలలో పాటించిన ప్రజాస్వామిక విలువల ఆచరణకు మూలం - వర్గ దృక్పథం అని, మార్క్సిజం అని స్పష్టంచేశారు. సుధాబాలగారు 76 ఏళ్ల వయస్సుకే చనిపోయారంటే, రవిబాబుగారి పెద్ద కొడుకు సృజన్ 9వ తరగతి చదువుతున్నప్పటి నుండి తీవ్ర మానసిక రుగ్మతకు గురై, మరి కోలుకోలేదంటే, అలాగే సుధాబాలగారి తల్లి - ఆమె ఎంతో కష్టజీవి అని - ఆమె కూడా మానసికంగా చిన్నపిల్లలా అయిపోవడమంటే, మన ప్రజా వైద్యం మరణశయ్య మీద ఉన్నదని చెప్పక తప్పదని విశ్లేషించారు. ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లో రవిబాబుగారు ప్రజాసాహిత్య సాంస్కృతిక ఉద్యమంలో తలమునకలుగా నిమగ్నమయ్యారంటే చిన్న విషయం కాదని అంటూ, భార్గవశ్రీ సుధాబాలగారు రవిబాబుగారికి అందించిన సహకారానికి, సహృదయతకు, ఉన్నత వ్యక్తిత్వాన్ని గుర్తు చేసుకున్నారు.

ఆమె కళ్ళను తీసి మరో ఇద్దరికి ఈ లోకాన్ని చూసే అవకాశాన్ని ఇచ్చిన సుధాబాలగారికి నివాళులర్పిస్తూ ఆమె వ్యక్తిత్వంలో ఉన్న ఔన్నత్యాన్ని సభలో విని తాను చలించిపోయాను అంటూ కళ్ళ డాక్టరు జోహార్లు అర్పించారు.

డాక్టర్ మూర్తిగారు నిమ్రా మెడికల్ కాలేజీ నుండి వచ్చి, దేహదానం అనే అంశాన్ని గురించి మాట్లాడుతూ, సుధాబాలగారు విశాల దృక్పథంతో తన దేహాన్ని మెడికల్ కాలేజీకి ఇచ్చినందుకు జోహార్లు చెప్పారు.

ప్రముఖ రచయిత బొర్రా గోవర్ధన్, నగరం కళాశాలలో నిక్కర్లు వేసుకుని చదువుతున్న రోజులలో సుధమ్మగారి కన్నబిడ్డలుగా తాము పొందిన వాత్సల్యాన్ని ఆర్ద్రంగా పాలుపంచుకున్నారు.

ఇంకా ఈ సంస్మరణ సభలో గీతాంజలి మూర్తి, గంగా భవాని, సి.ఎల్.ఎన్. గాంధీ, డా॥ రాజారావు, సి. ఉమామహేశ్వరరావు, డా॥ భీమవరపు సాంబిరెడ్డి, గోరంట్ల లోకేశ్, పి.ఎస్. నాగరాజు, సిహెచ్. నాగిరెడ్డి, తాజారావు, పోలేశ్వరరావు మొదలైన ఎంతో మంది నివాళులు అర్పించారు.

జనసాహితి బాధ్యులు, సభ్యులు, అభిమానులు, ఇతర ప్రజాసంఘాల బాధ్యులు తరలివచ్చి సుధాబాలగారికి జోహార్లర్పించారు.

**6-2-2023, సోమవారం** రాత్రి 7:00 గంటలకు తెనాలి సమీపాన గల నూతక్కి గ్రామంలో 'సమాజం-సంస్కృతి' అనే అంశంపై గురజాడ కళావేదిక ఆధ్వర్యాన జరిగిన చైతన్యస్ఫూర్తి సభకు 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహించారు. ఆయన తన ప్రసంగంలో ప్రజాసంస్కృతి గురించి వివరించారు. తొలుత వక్తలను ఆహ్వానిస్తూ జనసాహితి సభ్యుడు సిహెచ్. నాగిరెడ్డి వ్యవసాయ సంక్షోభం, దానివల్ల వస్తున్న సాంస్కృతిక మార్పుల గురించి ప్రస్తావించారు.

ప్రముఖ నాటక దర్శకుడు అన్నపరెడ్డి శివరామిరెడ్డిని సంస్మరిస్తూ వారి శిష్యులు వంగా లక్ష్మారెడ్డి (మున్నంగి), వల్లూరు హరిప్రసాద్ (నూతక్కి) మాట్లాడారు. నాయుడుగోపి నాటకరంగానికి శివరామిరెడ్డి చేసిన సేవలను వివరించారు.

ప్రధాన వక్తగా వచ్చిన డా॥ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ వ్యవసాయం చేయడమే ఒక ఉత్తమ సంస్కృతి అనీ, దేశంలో ఈనాడు వ్యాపించిన అవినీతి సంస్కృతిని ఖండించారు. జనసాహితి అధ్యక్షుడు దివికుమార్ మాట్లాడుతూ ఈ గ్రామంలో ప్రజావైద్యుడైన రాఘవాచారి గురించి మాట్లాడారు. సభానంతరం పెదకాకాని గంగోత్రివారు 'పేగు రాసిన శాసనం' నాటికను ప్రదర్శించారు. ●

## హక్కుల నేత, ప్రగతిశీల రచయిత్రి, కాకతీయ విశ్వవిద్యాలయ అధ్యాపకురాలు

# ప్రొ॥ కందాళ శోభారాణి మృతి



**కాకతీయ** విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు, హక్కులనేత, ప్రగతిశీల రచయిత్రి ప్రొ॥ కందాళ శోభారాణి ఫిబ్రవరి 12న తీవ్ర అనారోగ్యంతో తన 49వ యేట మరణించారు. వరంగల్లు జిల్లా చెన్నారావుపేటలో సంప్రదాయ కుటుంబంలో 1974లో పుట్టారు. ఉన్నత విద్య అభ్యసించి తను చదివిన కాకతీయ విశ్వవిద్యాలయంలోనే ప్రొఫెసర్‌గా పాఠాలు చెప్పే స్థాయికి ఎదిగిన శోభారాణి సామాజిక వ్యక్తిత్వంతో క్రియాశీలంగా అధ్యాపకురాలిగా నిలదొక్కుకున్నారు. విద్యార్థి దశనుండే సామాజిక చైతన్యంతో ఎదిగారు. అనేక నిర్బంధాల మధ్య కూడా మానవ హక్కుల వేదిక బాధ్యతల్లోనూ, రచయిత్రిగానూ - బోధన - రచన - పరిశోధన - ఉపన్యాసం వంటి అనేక రూపాల్లో సామాజిక అన్యాయాలను, అక్రమాలను ధీటుగా ఎదుర్కొన్న వ్యక్తిత్వం ఆమెది.

కాకతీయ విశ్వవిద్యాలయంలో పూలే అధ్యయన కేంద్రం సంచాలకులుగా కూడా పనిచేశారు. "తెలుగు సాహిత్యంలో స్త్రీవాద విమర్శకులు" అనే ఆమె సిద్ధాంత గ్రంథం కేవలం డిగ్రీకోసం కాకుండా పితృస్వామిక వ్యతిరేక స్వరంతో రాశారు. ఆమె సామాజిక చైతన్యం తుదికంటా కొనసాగకముందే తీవ్ర అనారోగ్యానికి గురై అర్థాంతరంగా మృతిచెందారు. కన్ను తెరిచిన అక్షరం ఒడిలోనే సామాజిక మహాకావ్యంగా ఎదిగిన డా॥ కందాళ శోభారాణి మృత శరీరాన్ని కాకతీయ వైద్య కళాశాలకు అప్పజెప్పారు. ●




**చేరా సర్వలభ్య రచనలు : నాలుగు సంపుటాలు.**

**సంపాదకుడు : టి. సతీశ్. మనసు ఫౌండేషన్ ప్రచురణ.**

15 ఏళ్ళక్రితం ఎం.వి. రాయుడు, మన్నం గోపీచంద్, మన్నం చంద్రమౌళిల సోదరత్రయం ప్రారంభించిన మనసు ఫౌండేషన్ ప్రచురించిన 16వ పుస్తకం ఇది. ఈ ఫౌండేషన్ పుస్తక ప్రచురణలో భాగంగా ఇప్పటివరకు తెలుగులో ప్రసిద్ధ రచయితల సమగ్ర లభ్యరచనా సంకలనాలను పదకొండు, నాలుగు ఇతర పుస్తకాలను వెలువరించింది. అంతేగాక, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నెల్లూరు సమీపాన ఒక డిజిటల్ శాఖను ప్రారంభించి, ఆంధ్రనాట వున్న పబ్లిక్, ప్రైవేటు గ్రంథాలయాల్లోని పుస్తకాలన్నిటినీ ఉచితంగా డిజిటల్ చేసే బృహత్తర కృషిని కొనసాగిస్తోంది.

తన 79వ యేట 24-7-2014న మరణించిన భాషాశాస్త్రవేత్త, సాహిత్య విమర్శకుడు చేకూరి రామారావు ఖమ్మంజిల్లాలోని ఇల్లిందలపాడులో 1935 జులై 1న జన్మించారు. డిగ్రీ పరీక్షలవరకూ, మొదటిసారి తప్పుతూ విద్యాభ్యాసం చేసిన ఆయన భాషాశాస్త్రంలో అమెరికాలోని కార్నెల్ విశ్వవిద్యాలయం నుండి 1968లో డాక్టరేట్ డిగ్రీ సాధించారు. విశ్వవిద్యాలయాలలో ఆచార్యులుగా పనిచేశారు. సాహిత్యపరంగా అనేక బహుమతులు అందుకున్నారు. మొత్తం 19 పుస్తకాలు ప్రచురించగా, వాటిలోని వ్యాసాలన్నిటినీ కాలక్రమణికలో ఈ సంపుటులలో ప్రచురించారు.

మొదటి సంపుటిలో 28-9-1951 నుండి 27-12-1987 వరకూ (1070 పుటలు); రెండవ సంపుటిలో 3-1-1988 నుండి 1-4-1992 వరకూ (896 పుటలు); మూడవ సంపుటిలో 3-1-1993 నుండి డిసెంబరు 2014 వరకూ (1056 పుటలు) రాసిన వ్యాసాలూ, ఐదు రాతప్రతి వ్యాసాలూ, నాల్గవ సంపుటిలో 32 కవితలు, 14 పాఠాలు, 21 ఇంటర్వ్యూలు, 28 పేజీల స్వీయచరిత్ర - లేఖలు, 737 పుటల్లో ఆయన థీసిస్, ఇంగ్లీషు వ్యాసాలు (1234 పుటలు) వున్నాయి. మొత్తం నాలుగు సంపుటాలలో 4256 పుటలున్నాయి.

'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఆదివారం సంచికలో ఎనిమిదేళ్ళపాటు (మధ్య విరామంతో) సాగిన చేరాతలు 1986 నుండి 1994 వరకూ తెలుగు స్త్రీవాద కవితల గురించీ, వివిధ సాహిత్య విషయాల గురించీ ఆసక్తికరమైన అంశాలను ఈనాటి పాఠకులకు అందిస్తున్నాయి. 'చేరాతలు' శీర్షిక ఆపివేసిన ఉదంతమూ తెలుస్తుంది.

నాల్గవ సంపుటిలో చేరా, వివిధ రచయితలకు, తన కుటుంబ సభ్యులకు, భార్యకు రాసిన లేఖలు ఆయన జీవితంలోని విశేష ఘట్టాలను, ఒడుదుడుకులను తెలియచేస్తాయి. ఆయన భాషాశాస్త్రంలోనూ, ఛందస్సులోనూ, విమర్శలోనూ చాలమందితో విభేదించారు. వారి విమర్శలు ఆయనకు ఎంత పేరు తెచ్చిపెట్టాయో అంత వివాదాన్నీ సృష్టించాయి.

నాల్గవ సంపుటిలో ఎ.పి. సార్వత్రిక విశ్వవిద్యాలయానికి రాసిన పాఠాలు క్రింద "బి.ఏ. తెలుగు మౌళిక అంశాలు : 1987-1995" అని, 'మౌలిక' బదులు 'మౌళిక' అనే పదాన్ని 221, 239, 253, 267 పుటల్లో వాడారు. 'బి.ఏ. తెలుగు మౌళికాంశాలలోని పాఠ్యాంశాలు' అని 'మౌళిక' అనే పదాన్ని 44, 121, 164, 171, 175, 279 పుటల్లో వాడారు. ఇంతకీ అది 'మౌలిక'మా లేక 'మౌళిక'మా? ఇది సంపాదకుల పొరపాటా? లేక సార్వత్రిక విశ్వవిద్యాలయంవారి అచ్చుతప్పా? లేక రెండు ప్రయోగాలూ సమ్మతమేనా?

ఈనాటి యువసాహితీవేత్తలకు ఎన్నో విధాలుగా ఉపయోగపడే చేరాతలు అన్నీ ఒకచోట కూర్చి ఇచ్చిన మనసు ఫౌండేషన్ వారికి జేజేలు.

ఈ నాలుగు సంపుటాల ధర రూ. 1600/- మొదటిముద్రణ : జులై 2022. పంపిణీదారులు : ఎమెస్కో హైదరాబాదు, విజయవాడ.

**అమ్మనుడి : సంపాదకీయాల సమాహారం. (రాష్ట్రీయం - జాతీయం - రాజకీయం - సిద్ధాంతం)** రచన : **సామల రమేశ్‌బాబు**

కేవలం భాష విషయం కేంద్రీకరించి వెలువడుతున్న ఏకైక తెలుగు మాసపత్రిక 'అమ్మనుడి'. ఎనిమిదేళ్ళపైగా నడుస్తున్న ఈ పత్రిక సంపాదకీయాలను, 1. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు - భాషావిధానాల నిర్వాకం; 2. భారతదేశం - జాతీయ భాషావిధానం; 3. భాషావిధానం - సిద్ధాంతం; 4. తెలుగు భాషోద్యమ సమాఖ్య - కార్యాచరణ అనే నాలుగు భాగాలుగా విడగొట్టి ప్రచురించారు.

మాతృభాషల రక్షణకై ఉద్యమించేవారికి ఇది ఒక ఆకర గ్రంథంగా వుపయోగపడుతుంది. 1/8 డెమ్మీ 310 పుటలు. వెల : రూ. 200/- తొలిముద్రణ : 21 ఫిబ్రవరి 2023. ప్రతులకు : తెలుగుజాతి ట్రస్టు, 8-386, జీవక భవనం. అంగలకుదురు (పోస్టు), తెనాలి - 522211. గుంటూరుజిల్లా. ఫోన్ : 94404 48244.

**హేతువాదం వ్యక్తిగత మరియు సామాజిక అభివృద్ధికి తోడ్పడుతుందా?... రచన : జె.వి. కృష్ణయ్య**

హేతువాదమంటే శాస్త్రీయ ఆలోచనావిధానం. సక్రమమైన మానసిక వైఖరి అని రచయిత నిర్వచించారు. హేతువాదాన్ని ఒక సిద్ధాంతంగా అనేకమంది గ్రంథాలు రాసి ఉండవచ్చు. కానీ కృష్ణయ్యగారు తన స్వీయ అనుభవాల నుండి, ఇతరుల పరిశీలనల నుండి అబద్ధాలను బట్టబయలు చేసి, నిజాల నిగ్గుతీసే రచనా పద్ధతిని ఈ గ్రంథ రచనలో వినియోగించారు. ఇది పాఠకునికి ఎంతో ఆసక్తిని కలిగిస్తూ సైన్సు దృక్పథాన్ని చేరువ చేస్తుంది. నిత్య జీవితంలో అనునిత్యమూ ఎదురయ్యే మూఢనమ్మకాల నుండి సైన్సు పేర చలామణీ ఔతున్న సూడో సైన్సును.... ఇంకా బాబాలు పీఠాధిపతులు పనిగట్టుకు

వ్యాపింపజేస్తున్న మౌఢ్యాలు, ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, సెలబ్రిటీలు మొదలైనవారు వారి మూఢనమ్మకాల వలన సమాజంలో కలిగిస్తున్న తప్పుడు పరిణామాలు వగైరాలన్నీ ఈ గ్రంథంలో చర్చించబడ్డాయి.

పుస్తకం : వెల : రూ.200/- పేజీలు : 313. దొరుకుచోటు : ఎస్. అబ్దుల్ అజీజ్, 46/633, 34 బుధవారపేట, కర్నూల్ - 518002.; జె.వి. కృష్ణయ్య 86-276-2, సోమప్పకాలనీ, బి క్యాంపు, కర్నూలు - 518002. ఫోన్ : 94405 52830, 96521 00114.

**విశాల నయనం :** సంపాదకీయ కవిత్వం. - ఈతకోట సుబ్బారావు

13 సంవత్సరాలుగా నెల్లూరు నుండి కోసూరు రత్నం ప్రచురిస్తున్న సాహిత్య మాసపత్రిక 'విశాలాక్షి'కి సంపాదకునిగా వున్న కవి ఈతకోట సుబ్బారావు రాసిన సంపాదకీయ కవితలు ఇవి. కవితా సంపాదకీయాలు ఒక కొత్త ప్రక్రియ. క్లుప్తంగా, భావయుక్తంగా సమకాలీన సమస్యపై వ్యాఖ్యానిస్తూ రాసిన సంపాదకీయాలు ఇవి. 'విశాలాక్షి' పత్రికకు రాసినవి గనుక. ఈ సంపుటికి 'విశాల నయనం' అని పేరు పెట్టారు. ఈతకోట సుబ్బారావు ఇప్పటికే 8 కవితాసంపుటులూ, నెల్లూరుకు చెందిన చరిత్ర పుస్తకాలు ఆరు, ఒక కథా సంపుటి ప్రచురించారు. కె. శివారెడ్డి స్వర్ణోత్సవ సంచికకూ, విశాలాక్షి దీపావళి, సంక్రాంతి, ఉగాది ప్రత్యేక కథల సంచికలకు సంపాదకీయాలు రాశారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక సంపాదకులు కె. శ్రీనివాస్ 'విశాలాక్షి'కి కవిత్వపు కాటుక' అనే శీర్షికతో దీనికి ముందుమాట రాశారు.

ఈ కవితాసంపాదకీయాలు రాసిన సందర్భాలను కొన్ని కవితల చివర్లో ఇచ్చారు. మరికొన్ని ఆయా కవితల్లోనే సందర్భం అర్థమౌతుంది. వచనాన్నే తుంపులు చేసి వచన కవితగా అచ్చువేసుకుంటున్న కాలంలో ఈ కవితాత్మక సంపాదకీయాలు, సాహిత్యాభిమానులకు ఒకే బహుమతే!

('విశాల నయనం', 1/8 డెమ్మీలో 126 పుటలు. వెల : రూ.100/ - ప్రథమముద్రణ : డిసెంబరు 2022. ప్రతులకు : ఈతకోట సుబ్బారావు, 24/1697, రెండవ వీధి, రవీంద్రనగర్, నెల్లూరు - 524004. ఫోన్ : 94405 29785. ethakotas@yahoo.com)

**కంఠాగ్ని - కరోనా : ఖండకావ్యం (పద్యసంపుటి) 2020-21. రచన : డా॥ లగడపాటి సంగయ్య**

కంఠాగ్ని అనే పిట్ట కంఠంలోనే పాకాగ్ని (ఆహారం ఉడకటానికి కావలసిన వేడి) వుంటుంది. కంఠంలోనే ఆహారం జీర్ణమవుతుంది. అలాగే కరోనా కంఠంలో ప్రవేశించి ప్రాణాలను జీర్ణం చేసుకుంటుంది. కనుక ఈ ఖండకావ్యం పేరు కంఠాగ్ని కరోనాగా పెట్టారు.

దీనిలో కందం, ఆటవెలది, తేటగీతి, మత్త కోకిల, పంచచామరం, వచన కవిత మొదలగు పద్యాలలో కరోనా కాలంలో ప్రజలు అనుభవించిన వెతలు సంగయ్య తెల్పారు. వలస కార్మికుల పాదయాత్రలు, వారిపై రైళ్ళు దూసుకుపోవడం, కార్పొరేట్ చికిత్సాలయాల దోపిడీ, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసులు, డాక్టర్లు, నర్సులు, పారిశుధ్య కార్మికుల సేవలు మొదలగు విషయాలన్నీ ప్రస్తావించారు.

డా॥ జి.వి. పూర్ణచందు, డా॥ దాశరథుల నర్సయ్య ముందుమాటలు రాశారు.

కంఠాగ్ని - కరోనా : 1/8 డెమ్మీలో 40 పుటలు. వెల : రూ.50/ - మొదటిముద్రణ : సెప్టెంబరు 2021.

**ముక్తసంగయోగి త్రిశతి : రచన : డా॥ లగడపాటి సంగయ్య**

ఛందస్సు అనే శృంఖలాలు తెంచుకుని వచన కవితాయుగం వచ్చింది. కాని ఆ వచన కవితా కవులే మరల కొన్ని నియమాలు నిర్దేశిస్తూ - నానీలు, హైకూల పేరుతో కవితారచన చేస్తున్నారు. కవితారూపం ఏదైనా అది సాధారణ పాఠకులకు అర్థమయేట్లు - వేమన పద్యాల్లాగా వుంటే ఛందస్సును వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. జంధ్యాల పాపయ్యశాస్త్రి పద్యాలు ఎంత సులభంగా, సుందరంగా వుంటాయో మనకు తెలుసు.

వేమనయోగి తనకాదర్శమంటూ లగడపాటి సంగయ్య రాసిన 303 తేటగీతుల, ఆటవెలదుల సంపుటి ఇది. సమకాలీన సామాజిక అంశాలే వారి కవితావస్తువు. ప్రతి పద్యానికీ క్రింద దాని తాత్పర్యం కూడా ఇవ్వడం విశేషం. దీనిపై అక్కిరాజు సుందర రామకృష్ణ, జి.వి. పూర్ణచందు, ముత్తేవి రవిప్రసాద్, ఎండ్లూరి సుధాకర్‌లు తమ అభిప్రాయాలు రాశారు.

1/8 డెమ్మీలో 266 పుటలు. వెల : రూ.100/- ప్రథమముద్రణ : ఫిబ్రవరి 2021. పై రెండు పుస్తకాలకు చిరునామా : 22-20, కాకానినగర్, కాకాని టవర్స్ ఎదురుగా, నందిగామ - 521155. సెల్ : 94907 69242.

**డా॥ పి. దక్షిణామూర్తి : మరికొన్ని వ్యాసాలు - జ్ఞాపకాలు**

డా॥ పి. దక్షిణామూర్తి తెనాలిలో ప్రముఖ వైద్యులు. సాహితీ సాంస్కృతికరంగాలలో అభిరుచి వున్నవారు.

2014లో వీరు పత్రికలలో రాసిన వ్యాసాలు, సేవాతత్పరుల గురించి రాసిన వ్యాసాలు ఒక పుస్తకంగా ప్రచురించారు. ఇప్పుడు కొన్ని వైద్య విజ్ఞాన, పర్యాటక, వ్యాసాలతోపాటు మూడు పుస్తక సమీక్షలు, వివిధ రంగాలలో కృషిచేసిన 62 మంది మహనీయుల గురించీ, వారిలో కొందరితో తనకు గల వ్యక్తిగత పరిచయాన్ని ప్రస్తావిస్తూ రాసిన వ్యాసాలను దీనిలో పొందుపరిచారు. వివిధ సందర్భాలకు సంబంధించిన ఛాయాచిత్రాలను 12 పుటలలో ఇచ్చారు.

(డా॥ పి. దక్షిణామూర్తి - మరికొన్ని వ్యాసాలు - జ్ఞాపకాలు. 1/4 క్రౌన్‌లో 208 పుటలు. వెల : రూ.300/- ప్రథమముద్రణ : జూన్ 2022. ప్రతులకు : డా॥ పాటిబండ్ల దక్షిణామూర్తి, గీతా నర్సింగ్ హోం, తెనాలి - 522201. ఫోన్ : 79010 14749.

కవిత

# ఆమె అనంత సాహిత్యానికి సృష్టికర్త

- డా॥ కత్తి పద్మారావు

ఆకాశం వంగి
భూమిని తాకుతుంది.
భూమి పువ్వులా వికసించింది.
నక్షత్రాల మొక్కలు
కొల్లేరు సరస్సులో మొలుస్తున్నాయి.
ఆ పక్షుల కుహూరావాలకు
అలలు నృత్యం చేస్తున్నాయి.
ఆ చేప మింగుతున్న
నీటి బిందువుల్లో శృతి ఉంది.
ఆ ఈతలో సంగీతం ఉంది.
ప్రకృతంతా అనుబంధంగా ఉంది.
నిజమే!
వివాదమెందుకు?
భాష రాకా?
భావము లేకా?
బాంధవ్యం కుదరకా?
సంబోధన చేయకా?
సామరస్యం లేకా?
ఎందుకు?
అభినందనలు లేనివారి జీవితం
నిందా సహితమౌతుంది?
ఆ రాతి విగ్రహానికి సాగిలపడి
వెయ్యి దండాలు చదువుతాడు.
సతిని చూసి ఈసడించుకుంటాడు.
వ్యతిరిక్తాలు పెంచుకుని
విముఖుడవుతాడు.
కళ్ళు కదపని శిల్పాన్ని చూసి
ఎందుకీదండకం?
నీకు అన్నం పెట్టే అతివపై
ఎందుకు ఈ విరసం?
దేన్ని పొందుతున్నావో
దాన్ని నిరాకరిస్తున్నావు.

నీ స్వరంలో నుండి
నిప్పురవ్వలు కురుస్తున్నాయి.
అవి నిన్నే దహిస్తున్నాయని
నీవు తెలుసుకోలేకపోతున్నావు.
అవును!
మీరు ఎవరి దగ్గర
తలవంచి అభ్యర్థిస్తున్నారో
వారి తలలే తుంచుతున్నారు.
బిందెలు బిందెలు పాలు
రాళ్లపాలు చేసే మీరు
పాలబొట్టు పుట్టుకకే
గాటు చేస్తున్నారు.
మిమ్మల్ని మీరు
తెలుసుకునేవరకూ
మీరు ఓడిపోతూనే ఉంటారు.
మీరు చీకటి గుహల్లో
పెద్దగా కేకలు వేస్తున్నారు.
మీ శబ్దాలు మీకే వినిపిస్తున్నాయి.
మీ చేతులకు పచ్చబొట్లు
నామవాచకాలుగా పొడిపించుకుంటున్నారు.
మీ గుండెల మీద మాత్రం
ఒక చిత్రం లేదు.
అందుకే మీరు ఒక్కసారి
పునర్వివేచించుకోండి.
మీరు కోల్పోతున్నది మిమ్మల్నే.
ఎవర్నో కాదు.
మిమ్మల్ని మీరు కోల్పోయాక
మీరు ఎవరిని పొందుతారు?
ఆత్మీయత
అమృత నిష్యందమైనది.
తోడు జీవనగమనానికి వాహిక.
మీరు తోడును నిరాకరించాక

ఎవరి హృదయ క్షేత్రంలో
శిల్పమై నిలవగలరు?
మీరు మీ మిత్ర హస్తాన్ని ఛేదిస్తున్నారు.
మీరు మార్మిక ఇనుపకచ్చడాలు
వారికి కడుతున్నారు.
మీ కళ్ళల్లో అనుమాన
వలయాలున్నాయి.
వారి ఆప్తవాక్యానికి
మీరు భయపడుతున్నారు.
స్నేహం మానవ జీవన ప్రవాహిక.
స్త్రీ ఒక సార కుటుంబ సామూహిక.
సూర్యుళ్లు, చంద్రుళ్లు
ఆమెలోనే జనిస్తారు.
అవును!
ఈనాటి ఆత్మగౌరవ స్వరం ఆమె.
అందుకే నిన్ను నిజాయితీతో
నిలవేస్తోంది.
ఆమె బానిస కాదు.
ఆమె భావోజ్వల జీవన సుస్వరం.
ఆమె ప్రవహిస్తున్న నది.
అందులో దాగున్న సుస్వరాలు
మాతృగర్భితమైనవి.
మమతానురాగాల పూరితమైనవి.
నిరాపేక్ష త్యాగపూరితమైనవి.
ప్రేమపూర్విత అభియుక్తమైనవి.
ఆమె ప్రతి ఊనికలో
సంగీత గీత సాహితీ
పరిమళాలున్నాయి.
ఆమె అనంత సాహిత్యానికి
సృష్టికర్త.
ఆకాశం అంచుల దాకా
నడుస్తున్న విజేత.

PRAJA SAAHITI March 2023 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023

No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month



కార్టూనిస్ట్ టీ.వీ. గీసిన చిత్రం

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI